24-3Pg1exHMNWJQE.qxd:24-3Pg1exHMNWJQE.qxd 1/1/02 7:10 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శ్రీకాకుళం : fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

24-3-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 52 పేజీలు: 16 వెల: 6.50

హార్ముజ్ నుంచి భారత్‌కు మరో రెండు చమురు నౌకలు 5లో

యుద్ధ సమయంలో ఇరాన్‌కు భారత్ మానవతా సాయం



# వార్‌కు మినీ బ్రేక్!

5 రోజులపాటు కాల్పుల విరమణ ప్రకటించిన ట్రంప్

యుద్ధ విరమణకు ఇరాన్ షరతులు

నష్టపరిహారం చెల్లించాలని పట్టు

భయంతోనే ట్రంప్ వెనక్కి తగ్గారన్న ఇరాన్

వెంటనే తగ్గిన ముడిచమురు ధరలు

మళ్లీ చెట్టెక్కిన పసిడి, వెండి

**వాషింగ్టన్/టెహ్రాన్, మార్చి 23:** పశ్చిమాసియాలో 25 రోజులపాటు ఇరాన్, అమె రికా, ఇజ్రాయెల్‌లమధ్య జరిగిన యుద్ధానికి స్వల్ప బ్రేక్ పడింది. ఐదురోజులపాటు యుద్ధం విరమిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. రెండుదేశాలమధ్య చర్చలు సానుకూలంగాజరిగాయని, కీలకమైన డీల్ ఖరారవుతోందని అదే జరిగితే ఇఇరాన్‌లోని యురేనియం నిల్వలను మేం తీసుకుంటామని ట్రంప్‌ప్రకటించి ప్రపంచదేశాలను ఆశ్చర్యపరిచారు.గౌరవనీయ వ్యక్తితో చర్చలు జరుగుతున్నామని, నేరుగా మాట్లాడుతున్నట్లు తెలిపారు అయితే వ్యక్తి కొత్త సుప్రీం కమాండర్‌మొజ్తబా ఖమైనీ కాదన్నారు. ఆయన బతికున్నాడో లేదో కూడా తనకు తెలియదని అన్నారు.ఫ్లోరిడాలోని పామ్‌బీచ్‌లో తన అధికారిక విమానం ఎయిర్‌ఫోర్స్ వన్ ఎక్కేముందు ఆయన సోమవారం మీడియాతోమాట్లాడారు. ఒప్పందంకోసం ఇరుదేశాలమధ్య 15 అంశాలపై చర్చలుజరుగుతున్నాయని, వీటిలో ఇరాన్ అణు ఆయుధాలను పూర్తిగా వదులుకోవడం తమ మూడు ప్రాధాన్యాలలో ఒకటిగా ఉందన్నారు. ఒప్పందానికి బలమైన కారణం ఉందని, దేనికీ గ్యారంటీ లేదన్నారు. 90శాతంఅంశాలపై ఇరుపక్షాల్లోను అంగీకారం కుదిరిందన్నారు. ఈ చర్చల్లో తన సలహాదారు స్టీవ్ విట్కాఫ్, అల్లుడు జారెడ్ కుష్నర్‌లు కూడా పాల్గొన్నట్లు అమెరికా అధ్యక్షుడు తెలిపారు. అలాగే చర్చలకు రావాలని ఇరాన్‌ముందుగా తానే కోరిందని, తాము ముందుగా కోరలేదన్నారు. అతిపెద్ద ఇంధన ప్రాజెక్టుపై దాడిచేసేందుకు సిద్ధం అయ్యామని చివరినిమిషంలో డీల్ కోరారన్నారు. అయితే మేం కూడా >>2

# ప్రత్యామ్నాయాలే పరిష్కారం

రాష్ట్రంలో ప్రతి ఇంటికి పిఎన్‌జి కనెక్షన్‌లు

విద్యుత్ పరికరాల వినియోగం పెంచాలి

శ్రీకాకుళం- కాకినాడ పైప్‌లైన్ పునరుద్ధరణకు చర్యలు

26 కల్లా పంటనష్టంపై నివేదిక ఇవ్వండి

తాజా సంక్షోభంపై సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,మార్చి 23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుతం వాడుకలో ఉన్న వంట(ఎల్పీజీ)గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ ఇంధనాలవైపు మళ్లడమే సరైన పరిష్కారమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి పైప్డ్ నేచరల్ గ్యాస్ (పీఎన్జీ), విద్యుత్ పరికరాల వినియోగం పెరిగేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటికీ పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాలతో తలెత్తిన పంట నష్టంపై సోమవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణ కోసం 2.34లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ 60వేల మంది వినియోగదారులు మాత్రమే కనెక్షన్లు పొందారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అయితే దీనిని 100శాతం వినియోగించుకునేలా చూడటంతోపాటు, జిల్లాకు కనీసం 10వేలకు తగ్గకుండా నూతన కనెక్షన్లు ఇవ్వాలంటూ సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. శ్రీకా కుళం-కాకినాడ పైప్ లైన్ పునరుద్ధరణపై కేంద్ర మంత్రికి లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్‌కు వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వచ్చే కేబినెట్ సమావేశానికి 'నేచరల్ గ్యాస్ పాలసీ ఫర్ ప్రమోషన్ ఇన్ కమర్షియల్ సెక్టార్' విధానాన్ని తీసుకురావాలని చెప్పారు. గ్యాస్ సంక్షోభం విద్యుత్ రంగానికి ఒక అవకాశమని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు వంటివి ప్రత్యామ్నాయ వనరుగా వినియోగించేలా చూడాలన్నారు. విద్యా సంస్థలకు, ఆస్పత్రులు, అంగన్వాడీలు, అన్న క్యాంటిన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరిగేలా చూడాలన్నారు. మరోవైపు గత ఐదురోజులుగా గృహావసరాల కోసం రోజుకు సగటున 1.80లక్షల సిలిండర్లు పంపిణీ చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. అటు అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో సంభవించిన పంట నష్టం ప్రాథమిక వివరాలపైనా ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. ఈ నెల 26వ తేదీ కల్లా పంటనష్టం అంచనావేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వ్యవసాయంలో జీఎస్డీపీ 40శాతం, ఉత్పాదన 71 శాతం పెరగడంతో పంటల నిర్వహణ, పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలన్నారు.

**ఎఐ సాయంతో తిరుమలలో పెరిగిన దర్శనాలు:** టెక్నాలజీ వినియోగించడంతో అన్నింటా మంచిఫలితాలు వస్తున్నాయని దీనికి తిరుమలలో పెరిగిన దర్శనాల సంఖ్యనే నిదర్శనమని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. ఏఐ సాయంతో తిరుమలలో క్యూలైన్లు, భక్తుల రద్దీ నిర్వహణ వల్ల నిరీక్షణ సమయం తగ్గిందని, దీంతో 20 శాతం వరకు భక్తులు అదనంగా దర్శనాలు చేసుకునే అవకాశం లభించిందన్నారు. ఇప్పుడు కొండపై ప్రసాదం బావుంది, దర్శనం బావుంది, శ్రీవారి సేవకులు, భక్తుల్లో సంతృప్తి పెరిగిందని అన్నారు. అత్యాధునిక ఫుడ్‌టెస్టింగ్ ల్యాబ్ ద్వారా తిరుమల >>2




సోమవారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి కుమారస్వామి, సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి లోకేష్, లక్ష్మీమిట్టల్, ఆదిత్య మిట్టల్ తదితరులు

# చరిత్రను సృష్టించే ఆర్సెలార్ స్టీల్ ఫ్యాక్టరీ

ప్రపంచం పాయకరావుపేట వైపు చూసే విధంగా తీర్చిదిద్దుతాం: సిఎం చంద్రబాబు

భూమిపూజలో సిఎంతోపాటు పాల్గొన్న కేంద్రమంత్రి కుమారస్వామి, రాష్ట్ర డి.సిఎం పవన్, మంత్రి లోకేష్, లక్ష్మీమిట్టల్, ఆదిత్య మిట్టల్

ఈ పరిశ్రమ ద్వారా 17.8 మి.టన్నుల ఉక్కు ఉత్పత్తి

**నక్కపల్లి, ప్రభాతవార్త:** ప్రపంచంలోనే అర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఫ్యాక్టరీ ఒకటని ఇది ఒక చరిత్రని ,ప్రపంచంలోనే నెంబర్ వన్ పరిశ్రమగా తీర్చిదిద్దే విషయంలో అన్ని విధాలుగా సహకరిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు సోమవారం మధ్యాహ్నం భూమి పూజ కార్యక్రమం మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర గనుల శాఖ మంత్రి హెచ్ డి కుమార్ స్వామిలతో కలిసి లక్ష్మి మిట్టల్ ,ఆదిత్య మిట్టల్ సారాధ్యంలో నిర్వహించారు. అనంతరం వేదిక మీదకు చేరుకుంటుండగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను చూసిన వేలాదిమంది సభలో ఉన్నప్రజలు,రైతులు,మహిళలు, విద్యార్థులు థాంక్యూ సీఎం,, థాంక్యూ పవన్ కళ్యాణ్ అంటూ ప్లే కార్డులు పట్టుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఒక్కసారిగా సభ అంతా హోరెత్తింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ20 నెలల్లోనే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏర్పాటును సాకారం చేసి చూపించాం అన్నారు.ఈ భారీ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మంది యువతకు ఉద్యోగాలు వస్తాయని, ఈ ప్రాజెక్టు సాకారం కావటంలో కృషి చేసిన ఆదిత్య మిట్టల్, మంత్రి నారాలోకేష్‌లతోపాటు వేగవంతంగా భూసేకరణ చేసి ముందడుగులు వేసిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితలను అభినందిస్తున్నా, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం భూమిని ఇచ్చిన రైతులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా 17.8మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది.అనకాపల్లిలో కేవలం స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే కాదు.స్టీల్ >>2




# చిత్తూరు రిజిస్ట్రార్ కార్యాలయంపై ఎసిబి పంజా

పారిపోయిన రిజిస్ట్రార్

**చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:** చిత్తూరు గిరింపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం-1పై సోమవారం ఎసిబి అధికారులు పంజా విసిరారు. చిత్తూరు గిరింపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం-1పై ఎసిబికి అవినీతిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్ళడంతో అవినీతి నిరోధకశాఖ అధికారులు సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ఒక్కసారిగా కార్యాలయంపై దాడి చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి ఎసిబి అధికారులు ప్రవేశించారనే సమాచారం తెలిసిన వెంటనే ఇన్‌ఛార్జీ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ విజయకుమార్ కార్యాలయం నుండి ఎసిబి అధికారుల కన్నుగప్పి తప్పించుకున్నారు. అయితే సబ్ రిజిస్ట్రార్ రమణ రావుతోపాటు ఇసి సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మేనక, కంప్యూటర్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న గాంధీ, మేరేజ్ సర్టిఫికేట్లు జారీ చేసే రాంప్రసాద్‌లు ఎసిబి అధికారులకు చిక్కారు. ఎసిబి ఎఎస్పీ విమల ఆధ్వర్యంలో ఎసిబి డిఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడి చేయడంతో ఇక్కడ పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని ఎసిబి అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఎసిబి అధికారులు కార్యాలయంలోకి ప్రవేశించిన వెంటనే కార్యాలయ తలుపులు మూసి వేసి కార్యాలయం నుండి ఎవ్వరు బయటికి వెళ్లకుండా కట్టడి చేశారు. అప్పటికే కార్యాలయంలో విధులు నిర్వర్తించే కొంతమంది జారుకున్నట్లు సమాచారం. అయితే ఎసిబి అధికారులు కార్యాలయంలోకి ప్రవేశించినపుడు పలువురు స్టాంప్ వెండర్లతో పాటు డాక్యుమెంట్ రైటరు ఉండటం >>2

# ఉద్యోగుల మెడికల్ బిల్లుల మంజూరులో సంస్కరణలు



మంత్రి సత్యకుమార్ యాదవ్

**సచివాలయం,మార్చి 23,ప్రభాతవార్త :** ఉద్యోగుల వైద్య బిల్లులు తిరిగి చెల్లింపు విధానంలో కూటమి ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకురాబోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉండేందుకు వీలుగా 'కాగిత రహిత'విధానంలో ఆన్‌లైన్ ద్వారా మాత్రమే బిల్లుల స్వీకరణ, పరిశీలన, బిల్లుల మంజూరు,చెల్లింపులు జరిగేలా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు.ఈ మేరకు నూతన సాఫ్ట్‌వేర్ ఏపి సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ అండ్ సర్వీసెస్ ద్వారా తయారు కాబోతుందని మంత్రి వివరించారు. ఆస్పత్రుల నుంచే బిల్లులు నేరుగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌కు చేరతాయని,ఈమేరకు ఆస్పత్రులు వారికి లాగిన్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కొత్త సంస్కరణలను త్వరగా అమల్లోనికి తెచ్చేందుకు వైద్య ఆరోగ్యశాఖ కృషి చేస్తుంది.హాస్పటల్ రిజిస్ట్రేషన్ ఇతరచర్యలను ఏప్రిల్ 30నాటికి పూర్తిచేయాలని ప్రాథమికంగా లక్ష్యాన్ని నిర్ధేశించుకున్నారు.

**రూ.232 కోట్ల విలువైన బిల్లులు మంజూరు :** రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు 5,55,988, పెన్షనర్లు 2,32,764మంది ఉన్నారు.వీరిపై ఆధారపడిన కుటుంబసభ్యులతో కలిపి మొత్తం 24,33,306మంది ఉద్యోగుల ఆరోగ్యబీమా పరిధిలో ఉన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ అనుబంధ ఆస్పత్రుల్లో నగదు రహిత విధానంలో చికిత్స పొందినవారు కాకుండా, మెడికల్ రీ యింబర్స్‌మెంట్ విధానంలో చికిత్స పొందినవారి బిల్లులు ట్రస్ట్ కార్యాలయానికి అందుతున్నాయి.2024-25ఆర్థిక సంవత్సరంలో >>2

# ప్రపంచస్థాయిలో అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు టవర్లు

మంత్రి నారాయణ

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని పనుల కోసం భారీ ఎత్తున నిధులను ప్రభుత్వం సమకూర్చుకుంటోందని మంత్రి నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వంనుంచి రూ. 15వేల కోట్లు, హడ్కో ద్వారా మరో రూ. 11వేల కోట్లు సమకూర్చుకుంటున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పనులకోసం భారీ ఎత్తున నిధులను ప్రభుత్వం సమకూర్చుకుంటోందని మంత్రి అన్నారు. నిర్మాణ పనులపై రాష్ట్ర మున్సిపల్, పరిపాలనశాఖ మంత్రి పొంగూరునారాయణ తాజా పరిస్థితులను వివరిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల అమరావతి ముందుకెళ్లదనుకున్నారు. ప్రధానితో మాట్లాడి సీఎం వివిధ రూపాల్లో నిధులు తెస్తున్నారు.5వేల ఎకరాల అభివృద్ధి చేసిన భూమి అమ్మడం ద్వారా అప్పులు తీరుస్తాం అని >>2




సోమవారం శంకుస్థాపన సందర్భంగా యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం

# కొత్తగా 23,980 మె.వా పంప్డ్‌స్టోరేజి ప్రాజెక్టులు

రూ.1.20 లక్షల కోట్ల పెట్టుబడులు

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:**పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ చేపట్టింది.ఇందులో భాగంగా రాష్ట్రంలో మరో 23 వేల 980 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం పలు జిల్లాల పరిధిలో 20 కొత్త ప్రాంతాలను గుర్తించింది. ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీచేసిన అధ్యయనాల ఆధారంగా కొత్త ప్రాంతాలను నెడ్‌క్యాప్ గుర్తించింది. ఈ క్రమంలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూముల ఆధారంగా లొకేషన్లను ఖరారు చేసింది. సాంకేతిక, వాణిజ్య ఫీజిబిలిటీ రిపోర్టు (టీసీఎఫ్ఆర్)ను నూతన పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్) సిద్ధం చేసింది. తర్వాత దశలో ప్రీ ఫీజిబిలిటీ నివేదికలు, డీపీఆర్‌లను నెడ్‌క్యాప్ తయారు చేయిస్తుంది.ఈ ప్రాజెక్టులు కేటాయించడం ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.లక్షా 20 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంటుంది.ఐదు లొకేషన్లలో ప్రతిపాదించిన 7,450 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో విగిశిది ఇప్పటికే ఎంవోయూ కుదుర్చుకుంది. దీంతో ఇప్పటికే వివిధ సంస్థలకు కేటాయించిన 31,800 మెగావాట్లతో కలిపి మొత్తంగా 55,750 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులు రాష్ట్రంలో ఏర్పాటు కానున్నాయి.గతంలో 23 లొకేషన్లలో 31,900 మెగావాట్ల పీఎస్పీ ప్రాజెక్టులను వివిధ సంస్థలకు ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది. వాటిని పూర్తి చేయడంపై అధికారులు దృష్టి పెట్టారు. 2 వేల 600 మెగావాట్ల సామర్థ్యంగల 3 పీఎస్పీ ప్రాజెక్టులను దక్కించుకున్న సంస్థలు వివిధ కారణాలతో పనులుచేపట్టేందుకు ఆసక్తి చూపలేదు. ఈ కారణంగా వాటి డీపీఆర్‌ల తయారీని నెడ్‌క్యాప్ నిలిపేసింది. మిగిలిన 29,300 మెగావాట్ల పీఎస్పీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు రూ.లక్షా 64 వేల 955 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నాయి. ప్రకాశం జిల్లాలో 16 వందల 50 మెగావాట్లు,అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 లొకేషన్లలో 17,150 మెగావాట్లు, పార్వతీపురం మన్యంలో 3 లొకేషన్లలో 2 వేల 50మెగావాట్లు, కడపజిల్లాలో 2లొకేషన్లలో 2 వేల మెగావాట్లు, తిరుపతిలో వెయ్యిమెగావాట్లు, నంద్యాలలో 180 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు అనువైనప్రాంతాలను అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.రాష్ట్రంలో 21,153మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉన్న విద్యుత్ ప్రాజెక్టులుఉన్నాయి.వాటిలో సుమారు 8వేల మెగావాట్ల ప్రాజెక్టులు సౌర,పవన విద్యుత్ ఉత్పత్తికి సంబంధించినవి. గ్రిడ్‌నిర్వహణలో ఇబ్బందులు,భవిష్యత్తు విద్యుత్ అవసరాల దృష్ట్యా ప్రకాశంజిల్లాలో 16వందల 50మెగావాట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 లొకేషన్లలో 17,150 మెగావాట్లు, పార్వతీపురం మన్యంలో 3 లొకేషన్లలో 2 వేల 50 మెగావాట్లు, కడప జిల్లాలో 2 లొకేషన్లలో 2 వేల మెగావాట్లు, తిరుపతిలో వెయ్యి మెగావాట్లు, నంద్యాలలో 180 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

# విజయనగరంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

**విజయనగరం, మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని దాసన్నపేటలో గాడ నారాయణమూర్తి (43) అనే కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 5వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సూర్యనారాయణకి పెళ్లయింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. తన తల్లి వారం క్రితం చనిపోవడంతో మనస్థాపానికి గురైన ఈయన రెండు రోజుల నుంచి భోజనం కూడా చేయకుండా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. సోమవారం తెల్లవారుజామున గెడ్డవీధి, బాబామెట్టలోని తన ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వఆస్పత్రికి తరలించారు.

24-3Pg2exHMNWJQE.qxd:24-3Pg2exHMNWJQE.qxd 1/1/02 7:15 AM Page 1



# చరిత్రను సృష్టించే ఆర్సెలార్ స్టీల్ ఫ్యాక్టరీ



ఉక్కు ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

>> సిటీకి శంకుస్థాపన జరిగిందన్నారు. ఈ స్టీల్ ప్లాంట్ తో పాటు 11,198కోట్లతో క్యాప్టివ్ పోర్టు కూడా నిర్మాణం జరుగుతున్నారు. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ రూపకల్పన చేస్తూ 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్టర్ ఫర్నేన్, డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నేస్ నిర్మాణం పూర్తి చేస్తారు. అని చెప్పారు జాతీయ రహదారిని అనుసంధానిస్తూ నాలుగు లైన్ల రహదారి కూడా పూర్తి అవుతుంది అని ముఖ్య మంత్రి అన్నారు. పరిశ్రమకు ముడి ఇనుము సరఫరా కోసం పైప్ లైన్ కూడా వేయబోతున్నారు అని చెప్పారు, ఉక్కు ఉత్పత్తి ఒక్కటే కాదు ఆర్థిక లావాదేవీలతో విద్య, వైద్యం, ఉద్యోగాలతో ఈ ప్రాంత రూపు రేఖలు మారతాయి అన్నారు. ఇంత వేగంగా పరిశ్రమకు భూసేకరణ, అనుమతులు ఇచ్చింది దేశంలో ఒక్క ఏపీలోనే
దేశంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతం ఆంధ్రప్రదేశ్ అని అంటూ పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం, రాష్ట్రం ఉంది అని చెప్పారు. నిపుణులు, మానవ వనరులు ఏపీకి మాత్రమే సొంతం టూరిజం నుంచి డేటా సెంటర్ వరకూ, ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి తయారీ రంగం వరకూ అన్నింటికీ ఏపీలో మెండైన అవకాశాలు ఉన్నాయి అని ఆయన అన్నారు. కొత్త ఆలోచనలతో వచ్చి అవకాశాలను అందిపుచ్చుకోవాలని అందరికీ చంద్రబాబు సభ ద్వారా పిలుపు నీచ్చారు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వన్ ఫ్యామిలీ వన్ ఎంటప్రెన్యూర్ అనే నినాదాన్ని విజయవంతం చేస్తాం అన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతుందని 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావటం దేశంలో ఇదే తొలిసారి అనిబీపీసీఎల్ సహా పెద్ద పెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి అని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలల్లో రాష్ట్రానికి 20.35 లక్షల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి అని చెబుతూ ఇది చరిత్ర అన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ నాలెడ్జి ఎకానమీ, పోర్టులు, స్టీల్, డేటా సెంటర్లు, ఐటీ సెంటర్లు ఇలా కీలకమైన కేంద్రంగా విశాఖ మారుతుంది అని చంద్రబాబు అన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడి పెడుతున్నాయి అని చెప్పారు. రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా ఉత్తరాంధ్ర మారుతుంది, అందుకు అనుగుణంగా రూపకల్పన చేస్తున్నామని చెబుతూ పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తాం చెప్పారు. కొత్తగా పోర్టులు, ఎయిర్ పోర్టులు వస్తున్నాయి అన్నారు. ఉత్తరాంధ్రలో మూలపేట పోర్టు, జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభిస్తాం చెప్పారు. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి వేగంగా నిర్మాణం పూర్తి చేసుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. ఈ పరిశ్రమ నిర్మాణంలో రైతులు తమ భూములను త్యాగం చేశారు. వారికి సహకారం అందించాలని కోరుతున్నాను అని చెబుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక కృషితో ఈ ప్రాంతానికి స్టీల్ ప్లాంట్ వచ్చిందని అనుమతులతో కూడి అవకాశాలు ఇచ్చారని అన్నారు.
ఉక్కు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు.
మొదటిగా అనకాపల్లి జిల్లా యువతకు ఈ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలని స్టీల్ ప్లాంట్ యాజమాన్యం సూచించారు. ఆవిష్కరణల కోసం ఈ మెటలర్జీ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు అభినందనలు తెలియ చేశారు ప్రపంచంలోనే లక్ష్మీ మిట్టల్ ఉక్కుమనిషి అని కొనియాడారు. పాయకరావుపేట నియోజకవర్గం కూటమికి కంచుకోట అని చెబుతూ ఎప్పుడూ చెక్కిచెదరని అన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్ జూలైలో ప్రారంభిస్తామని చెప్పారు. ముందుగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ లక్ష్మీ మిట్టల్, ఆదిత్యలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిశ్రమ రావడానికి ఐటీ మంత్రి నారా లోకేష్ కృషి చేశారని చెబుతూ హోంమంత్రి అనిత కృషి చాలా ఉందని కొనియాడారు. విద్యాశాఖ మంత్రి మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూఆర్సెలార్ మిట్టల్‌నిప్పన్ స్టీల్ పరిశ్రమఉక్కు పరిశ్రమకు ఇవాళ శంకుస్థాపన మాత్రమే కాదు అని చెబుతూ పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం, నమ్మకానికి ఇదొక ఉదాహరణ అని అన్నారు. 2019 కంటే ముందు ఆదిత్య మిట్టల్‌ను కలిసి ఏపీలో ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరాను2024లో ఏపీలో మళ్లీ కూటమికి పట్టం కట్టారు. అప్పటి నుంచే స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కార్యాచరణ మొదలైంది అన్నారు. కేవలం 30 నిముషాల జూమ్ కాల్ ద్వారా దేశంలోనే అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఏపీకి వచ్చింది అంటే లక్ష్మీ ఆదిత్య మీ ట్టల్ ఎంత ముందుకు వచ్చారో అర్థం అవుతుందన్నారు. రాష్ట్రంలో 3,132 కిలోమీటర్ల పాదయాత్ర రాష్ట్రంలో చేశాను. చాలా మంది ప్రజల్ని కలిశాను. వారి ఆకాంక్షల్ని తెలుసుకున్నాను, అందుకే రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని సంకల్పించుకున్నాం ఆ లక్ష్యం ప్రకారం అడుగులు వేస్తున్నామని అన్నారు. ఆ హామీని నెరవేర్చటంలో భాగంగా ఇవాల్టి శంకుస్థాపన మరో మైలు రాయి అవుతుంది అని చెప్పారు. ఇప్పటికే పారిశ్రామికంగా అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాలకు పోటీగా మేం వెళ్లటం లేదు కానీ ఏపీకి కూడా పరిశ్రమల్ని ఆకర్షించగల సత్తా ఉందని నిరూపిస్తున్నాం అని లోకేష్ అన్నారు. ప్రపంచ స్టీల్ పటంలో అనకాపల్లికి కూడా స్థానం దక్కింది అన్నారు. ఈ ప్రాజెక్టు సాకారం కావటంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అనుసరించాంభూమి, అనుమతులు వేగంగా ఇచ్చాం అని చెబుతూ హోం అనిత కృషికి అభినందించారు. కేవలం సీబీఎన్ బ్రాండ్‌తోనే ఈ స్థాయి పరిశ్రమ వచ్చిందనిఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు విశ్వాసం, నమ్మకం సీబీఎన్ బ్రాండ్ తోనే వచ్చిందని 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేసేందుకు రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. డబుల్ ఇంజన్ బులెట్ ట్రైన్ సర్కారు విధానాలతో ఈ స్థాయి పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి అని చెప్పారుకేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ మంత్రి కుమారస్వామికి కూడా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను అని లోకేష్ అన్నారు. స్లరీ పైపు లైన్ ఏర్పాటు విషయంలో ఉక్కు మంత్రి వేగంగా అనుమతులు ఇచ్చారు. దీనికి ఏపీ ప్రజలు ఎప్పుడూ రుణపడి ఉంటారు. మొత్తంగా ఏపీలో స్టీల్ ఎకోసిస్టం రూపుదిద్దుకునేలా చేయటంలో ప్రధాని మోదీ సహా కేంద్రం సహకారం అందించింది అని లోకేష్ అన్నారు
.స్పీడ్ ఆఫ్ బులెట్ ట్రైన్ సర్కారు నిర్ణయాలకు ఈ ఉక్కు పరిశ్రమ ప్రత్యక్ష ఉదాహరణ అని చెబుతూ ఉత్తరాంధ్రకు ఓ ఆభూషణంగా ఈ ఉక్కు పరిశ్రమ నిలుస్తుంది అని సంతోషం వ్యక్తం చేశారు. ప్రాంతీయ అభివృద్ధికి సహకారం అందిస్తుంది అన్నారు. ఏపీ కేవలం ఎంఓయూలు మాత్రమే సంతకాలు చేసి ఊరుకోదు వాటిని సాకారం చేసి చూపిస్తుందని పరిశ్రమల్ని ఏర్పాటు చేసి తీరుతుందని ప్రజాప్రభుత్వం నిరూపించింది అని అన్నారు. రాష్ట్రంలోని యువతకు 2లక్షల ఉద్యోగాలు కల్పించటంలో ఈ పరిశ్రమ కీలకంగా నిలుస్తుంది అని పిలుపునిచ్చారు.
అభివృద్ధి వికేంద్రీకరణతో పాటు సమీకృత అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని ఇది భారత గ్రోత్ మంత్రగా నిలిచిపోతుంది అన్నారు. వేగంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకున్న పారిశ్రామిక వేత్తలకు ఏపీ స్వాగతం పలుకుతోంది అన్నారు. ఆర్సెలార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతులకు, ప్రజలకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాని లోకేష్ అన్నారు. అనంతరం కేంద్ర ఉక్కు గనుల శాఖ మంత్రి కుమారస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబుపవన్ కల్యాణ్ నాయకత్వం అద్వితీయంగా రాణిస్తోంది కొనియాడారు. రాష్ట్రాన్ని ప్రగతిశీల, పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా సీఎం చంద్రబాబు ఏపీని మార్చారుతండ్రికి తగ్గ తనయుడిగా నారా లోకేష్ రాణిస్తున్నారు. సంతోషం వ్యక్తం చేశారు నారా లోకేష్ మంచి భవిష్యత్తు ఉందని అన్నారు. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏపీకి రావటం ఈ ప్రాంతానికి స్టీల్ ఎకోసిస్టమ్‌ను సాకారం చేసింది అన్నారు. ప్రధాని మోదీ రూపకల్పన చేసిన 2047 వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా దేశీయ ఉత్పాదన పెరగాలని జాతీయ ఉక్కు వినియోగ విధానాన్ని అనుసరించి కూడా దేశవ్యాప్తంగా ఉక్కు ఉత్పాదన పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం కుమార్ స్వామి అన్నారు. విశాఖ ఉక్కును గాడిలో పెట్టేందుకు ఉత్పాదన కూడా పెరిగేందుకు కేంద్రం ఆర్థిక సహకారాన్ని అందించింది అని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మళ్లీ కుదుటపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారాన్ని ఇచ్చింది అన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రులు జి .భరత్ ,కొల్లు రవీంద్ర అచ్చం నాయుడు కొండపల్లి శ్రీనివాస్ ,గుమ్మడి సంధ్యారాణి ,జిల్లా శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ,సుందరపు విజయ్ కుమార్ ,పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యనారాయణమూర్తి, భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ,కె ఎస్ ఎన్ రాజు, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పీవీ మాధవ్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తదితరులు ఉన్నారు.



సోమవారం దొమ్మేటి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బిసిసంక్షేమ మంత్రి సవిత

## గొప్ప సంఘ సంస్కర్త దొమ్మేటి: మంత్రి సవిత

**విజయవాడ మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** శెట్టి బలిజెల పితామహుడు బొమ్మేటి వెంకటరెడ్డి గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన సేవలు నేటి యువతకు ఎంతో ఆదర్శమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత కొనియాడారు. మహాత్మా గాంధీ కంటే ముందే వయోజన విద్య కోసం కృషి చేసిన మేధావిన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి మంత్రి సవిత పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభివృద్ధికి, శెట్టిబలిజ సమాజ అభ్యున్నతికి, విద్యకు కృషి చేసిన మహనీయుడన్నారు. 1853 మార్చి 23న జన్మించిన దొమ్మేటి వెంకటరెడ్డి వయోజన విద్య వ్యాప్తికి విశేష కృషి చేశారన్నారు. 1905 లో బర్మాలో శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి, ఆ సంఘం ద్వారా దేశంలో ప్రాథమిక పాఠశాలలు, గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలను నెలకొల్పారన్నారు. అనంతరం కోనసీమలో కూడా శెట్టి బలిజల ఐక్యతకు, వయోజన విద్యకు కృషి చేశారన్నారు. ఆనాటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలోనూ తనవంతు పాత్ర పోషించారన్నారు. తుదిశ్వాస విడిచిపెట్టే వరకూ శెట్టిబలిజల ఐక్యతకు, వారి అభ్యున్నతికి పాటు పడ్డారన్నారు. వెంకటరెడ్డి పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎందో ఆదర్శమన్నారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు బీసీలు, శెట్టి బలిజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ, శెట్టి బలిజల పితామహుడు బొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, శెట్టిబలిజ సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

## మెడికల్ బిల్లుల మంజూరులో సంస్కరణలు

>> రూ.232కోట్ల విలువైన బిల్లులను మంజూరు చేశారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ విధానంలో సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కమిటీ ఏర్పడింది. ఈ క్రమంలో గత వారం సాధారణ పరిపాలన శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశాన్ని అనుసరించి ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సీఈఓ ఈనెల 18న మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ విదానంలో సంస్కరణలు తీసుకువస్తున్నందున ప్రత్యేక ఆన్‌లైన్ విధానాన్ని రూపొందించాలని సిఎఫ్‌ఎస్ఎస్‌కు వర్క్ ఆర్డర్ పంపారు. చికిత్స పొందిన ఆస్పత్రుల నుండి సదరు ఉద్యోగుల ఆరోగ్య, చికిత్స బిల్లుల వివరాలు నేరుగా ట్రస్ట్ కార్యాలయానికి వెళ్తాయి. ఇక్కడి వైద్యులు పరిశీలన అనంతరం బిల్లులు మంజూరు వివరాలు సదరు ఉద్యోగ హెచ్ఓడి కార్యాలయానికి పరిపాలన ఆమోదం కోసం వెళ్తాయి. అనుమతి ఉత్తర్వులు ఇక్కడి నుండి డిడిఓ కార్యాలయానికి వెళ్తాయి. డిడివో కార్యాలయానికి వివరాలు అందిన వెంటనే బిల్లులను చెల్లింపుల కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీని ద్వారా ప్రతి ప్రక్రియ కాగిత రహిత విధానంలో ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. దీనివల్ల ఉద్యోగుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు, సమయం ఆదా అవుతుంది. జిల్లా స్థాయిలో రూ.50,000లోపు జరిగే ఆస్పత్రులు బిల్లుల చెల్లింపు ప్రస్తుతం మాన్యువల్ విధానంలో జరుగుతోంది. దీన్ని కూడా పూర్తిగా ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకురాబోతున్నారు.

## ప్రపంచస్థాయిలో అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు టవర్లు

>> మంత్రి నారాయణ అన్నారు. ప్రపంచంలోనే మంచి అసెంబ్లీ భవనం ఏపీలో ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి రాజధాని ఎలా కడతారని వైఎస్సార్‌సీపీ భ్రమలో ఉందని నారాయణ అన్నారు. రాజధాని కోసం చేసిన అప్పులను భూమి అమ్మకాల ద్వారా తీరుస్తామని మంత్రి అన్నారు. గత ప్రభుత్వానికి ఆర్థిక ప్రణాళిక లేదని మంత్రి నారాయణ ఆరోపించారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐకానిక్ కట్టడాలుగా నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. అమరావతి అసెంబ్లీ భవనాన్ని 250 మీటర్ల ఎత్తులో నిర్మి స్తున్నామని తెలిపారు. ఈ భవనంపైకి ప్రజలువెళ్లి మొత్తం అమరావతినగరాన్ని వీక్షి ంచేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు అసెంబ్లీ, హైకోర్టుతో పాటు మరో ఐదు ఐకానిక్ టవర్లను అత్యద్భుతంగా నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఐకానిక్ భవనాలు కాబట్టి సాధారణ భవనాలకంటే వీటికి ఖర్చు కొంత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని ఐకానిక్ భవనాల రేట్లతో పోల్చి వీటిని చూస్తున్నామని, ఎస్ఆర్ రేట్లప్రకారం నిబంధనలను పాటిస్తూ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## ప్రత్యామ్నాయాలే పరిష్కారం

>> ప్రసాదాల్లో న్యూట్రిషనల్ విలువలు, పదార్థాల క్వాలిటీ చెక్ చేస్తున్నామని, దీంతో భవిష్యత్‌లో కల్తీకి ఆస్కారం ఉండదని సీఎం అన్నారు. ఇదే తరహాలో మిగిలిన శాఖలు మెరుగైన ప్రజా సేవలకు ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీ టీవీ లాంటి వివరాలతో త్వరితగతిన నిర్ణయాలు తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. డ్రోన్ల వినియోగం ద్వారా సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెరిగేలా చూడాలని ముఖ్య మంత్రి అధికారులకు సూచించారు. పొరుగు రాష్ట్రాల్లో డ్రోన్ల వినియోగంపైనా అధ్యయనం జరపాలన్నారు. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ శాఖలు అవేర్, డేటా వినియోగం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించేలా చూడటం కీలకమన్నారు. ఈ సమావేశానికి మంత్రులు కొలుసు పార్థసారధి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

## మచిలీపట్నం జిల్లా కోర్టుకు బాంబు బెదరింపు

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్టణంజిల్లా కోర్టులో బాంబు పెట్టినట్లు వచ్చిన బెదిరింపు సమాచారం నగరంలో సంచలనం సృష్టించింది. న్యాయస్థానంలో బాంబుపెట్టినట్లు ఆగంతుకులు జిల్లా జడ్జికి మెయిల్ చేసారు. ఈ మెయిల్ గమనించిన న్యాయమూర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు బాంబు స్క్వాడ్‌తో వచ్చిన న్యాయస్థానంలో తనిఖీలు చేపట్టారు. బాంబు బెదిరింపుతో నేపథ్యంలో కోర్టులోకి కక్షిదారులు ఎవరినీ పోలీసులుఅనుమతించలేదు. కోర్టు పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులకు ఎటువంటి బాంబు గుర్తింపులోకి రాలేదు. వచ్చింది ఫేక్‌మెయిల్ అని ప్రాథమికంగా గుర్తించినప్పటికి పోలీసులు అనుమానంతో కోర్టులో, ఆవరణలోను, ఈ ప్రాంగణంలో ఉన్న వాహనాలను పలు మార్లు తనిఖీ చేసారు. న్యాయమూర్తికి మెయిల్ ఎవ్వరు పంపారు, ఎక్కడ నుంచి వచ్చిందనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

### వారం - వర్జ్యం

24-03-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
షష్ఠి సా.4.10
రోహిణి రా.7.06
వర్జ్యం : ఉ.11.41-మ.1.10, 2)రా.12.21-రా.1.51
దు.ఉ.8.34-ఉ.9.23,
2) రా.11.11-రా.12.00
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** ఎన్ని అవాంతరాలు వచ్చినా ధైర్యాన్ని వీడరు. సమస్యలతో సమరం సాగిస్తూ ముందుకు వెళతారు.

**వృషభం:** ఉన్నతాధికారుల మెప్పు పొందడానికి ఎంతగానో కృషిచేసి శ్రమించి నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు.

**మిథునం:** కోర్టు కేసులు వాయిదాల మీద వాయిదాలు పడటం, కొంత ఇబ్బందులు కలిగించినా ఓర్పు వహించండి.

**కర్కాటకం:** నూతన ప్రయత్నాలు కలిసి వస్తాయి. ఆప్తుల నుండి విలువైన సమాచారం అందు కుంటారు. వాహనసౌఖ్యం కలదు.

**సింహం:** నూతన ఉద్యోగావకాశాలు లాభసాటిగా సాగుతాయి. ఆలయ సందర్శం చేసుకుంటారు. వస్త్రలాభం.

**కన్య :** మీరు సంతకాలు పెట్టేటటువంటి చెక్కులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పత్రాలను సరిచూసుకోండి.

**తుల :** దీర్ఘాలోచనలకు తెరవేస్తారు. కలిసిచ్చేకాలం వస్తే అన్ని అనుకూలిస్తాయని భావిస్తారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృశ్చికం:** అదృష్టానికి మించింది లేదని దృఢ నిర్ణయానికి వస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**ధనుస్సు:** వృత్తి, ఉద్యోగాల పరంగా మీస్థాయి యధాతథంగా ఉంటుంది. వాహనాల కొనుగోలు చేస్తారు.

**మకరం:** ముఖ్యమైన కార్యక్రమాలకు సంబంధించిన వ్యవహారాలను సానుకూల పరచుకోగలుగుతారు.

**కుంభం:** భాగస్వాముల నుండి రావలసిన ముఖ్యమైన పత్రాలు మీకు అందే విషయంలో జాప్యం జరుగుతుంది.

**మీనం :** సహాయపడే వారి కన్నా వంకలు పెట్టి నిందించే వారు అధికమవుతారు. ప్రయాణాలు అనుకూలంగా వుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎపిపై నమ్మకం, విశ్వాసానికి ప్రతీక ఏఎంఎన్ఎస్ స్టీల్ ప్లాంట్

## బ్రాండ్ సిబిఎన్ వల్లే భారీ ప్రాజెక్టు రాష్ట్రానికి: మంత్రి లోకేష్

**అనకాపల్లి, ప్రభాతవార్త:** ఈరోజు ఆర్సెలర్ మిట్టల్ !! నిప్పాన్ స్టీల్స్ చేస్తున్నది కేవలం భూమిపూజ కార్యక్రమం మాత్రమే కాదు, ఇది ఒక విశ్వాసం, నమ్మకంతో కూడిన ప్రకటన. ఆంధ్రప్రదేశ్ లోని ప్రజాప్రభుత్వం చెప్పింది చేయగలదని ప్రపంచానికి చాటిచెప్పే ప్రకటన అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి సమీపంలో ఏఎంఎన్ఎస్ సంస్థ నిర్మించనున్న దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఇది స్టీల్ ప్రాజెక్టు గురించి మాత్రమే కాదు, మన బలం, ధైర్యం, నమ్మకం గురించి. ఒకసారి మిమ్మల్ని 2019 జనవరి నాటి దావోస్‌కి తీసుకెళ్తాను. అప్పట్లో నేను అదిత్య మిట్టల్‌ని కలవాలని ప్రయత్నించాను, కానీ సమయం ఇవ్వలేదు. టాటా గ్రూప్ నైట్ క్యాంప్‌లో ఆయనను కలిసి ఒక సింపుల్ అభ్యర్థన చేశాను. 'ఆంధ్రప్రదేశ్‌లో మీరు ఎందుకు ఇన్వెస్ట్ చేయరు?' అని అడిగాను. ఆయన మర్యాదపూర్వకంగానే 'మేము ఇప్పటికే మరో రాష్ట్రాన్ని చూస్తున్నాం' అన్నారు. 'మీ నిర్ణయాన్ని గౌరవిస్తాను. అది జరగకపోతే, ఆంధ్రప్రదేశ్ మీకోసం సిద్ధంగా ఉంది' అని చెప్పాను. సంవత్సరాలు గడిచాయి. 2024లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు మాకు 94 శాతం స్ట్రైక్ రేట్ తో మరో అవకాశం ఇచ్చారు. మేం మళ్ళీ అధికారం చేపట్టిన వెంటనే, ఒక్క రోజు కూడా వృథా చేయకుండా వేగంగా ముందుకు సాగాం.
2024 సెప్టెంబర్ 22 ఆదివారం రాత్రి 8:30 గంటలకు అదిత్యతో మాట్లాడిన 30 నిమిషాల జూమ్ కాల్, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మార్చేసింది. ఆ కాల్ తో భారతదేశంలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఇన్వెస్ట్‌మెంట్ పొందగలిగాం. ఇది ఆధునిక ఆంధ్రపదేశ్ లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు నిదర్శనం. 2025 దావోస్ లో అదిత్య మిట్టల్ చెప్పాడు: "ఇది గణాంకాల గురించి కాదు. సీబీఎన్ పైన, ఆయన నాయకత్వం పైన, స్థిరమైన అభివృద్ధి సాధనమైన నమ్మకం. అది సీబీఎన్ బ్రాండ్. దశాబ్దాలుగా క్రెడిబిలిటీ నిర్మించిన నాయకుడు. ప్రపంచ ఇన్వెస్టర్లు నమ్మే నేత. ఇది కేవలం హామీల వల్ల కాదు, సామర్థ్యం వల్లే సాధ్యం. నమ్మకంతో పాటు, అలైన్‌మెంట్, పార్ట్‌నర్‌షిప్ కూడా అవసరం. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ వేగానికి ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి, సమర్థ నాయకత్వంలో భారతదేశం ట్రాన్స్‌ఫర్మేషనల్ గ్రోత్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్‌కి బలమైన పాలసీ మద్దతునిస్తోంది. నాకు అసాధారణ సపోర్టు అందించినస్టీల్ మంత్రి హెచ్.డి. కుమారస్వామికి కృతజ్ఞతలు. అదిత్య మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు. ఆదిత్య మిట్టల్ గారిని ఒకటే కోరుతున్నా. వచ్చే మూడేళ్లలో ఏపీలో లక్ష ఉద్యోగాలు నిరుద్యోగ యువతీ, యువకులకు కల్పించాలి. ప్రత్యేకంగా ఇక్కడున్న రైతులకు నా హృదయపూర్వక నమస్కారాలు. మీరు చేసిన త్యాగం వల్లే ఇక్కడ ఈ రోజు ఈ స్టీల్ ప్లాంట్ వచ్చింది.
గతంలో విశాఖ ఉక్కు కోసం చాలామంది పోరాడారు. కానీ మీ మనోభావాల ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు గారు మన ప్రాంతానికి ఒక అద్భుతమైన ఉక్కు పరిశ్రమను తీసుకువచ్చారని మంత్రి పేర్కొన్నారు.

# వార్‌కు మినీ బ్రేక్!

>>ఒప్పందానికి సిద్ధమేనని అది మంచి ఒప్పందంగా అయితే ముందుకువెళతామన్నారు. అందుకే ఐదురోజులపాటు యుద్ధం కాల్పులు క్షిపణిదాడులు మొత్తం నిలిపివేస్తున్నామని, చర్చలు కొలిక్కిరాకుంటే తమ దారి తమదేనని ట్రంప్ అన్నారు. హార్ముజ్ జలసంధిని 48 గంటల్లోపు పునరుద్ధరించకపోతే భారీ ఎత్తున దాడులుచేస్తామని, ఇంధన ప్రాజెక్టులపై దాడులుచేసి ధ్వంసం చేస్తామని ట్రంప్ హెచ్చరించిన 24 గంటలు గడవకముందే కాల్పులకు బ్రేక్ ఇస్తున్నట్లుప్రకటించడం గమనార్హం. స్వదేశంలోనే అధికారగణంనుంచి ట్రంప్‌పై అసమ్మతి పెరిగింది. ప్రజల్లోకూడా ట్రంప్ పట్లరేటింగ్ తగ్గింది. ఇరాన్‌పై యుద్ధనిర్ణయం ట్రంప్ ఏకపక్ష నిర్ణయమని, కేవలం ఇజ్రాయెల్‌మెప్పుకోసమే యుద్ధంచేసారని విమర్శలు చేసారు. అలాగే యుద్ధం ఖర్చు తడిసిమోపెడవుతున్నది. 20వేల కోట్ల డాలర్లు కావాలని సెంట్‌కామ్ ప్రభుత్వానికి లేఖ ఇచ్చిన సంగతి తెలిసిందే. పెరుగుతున్న ఆర్థికభారం, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను గమనించడం, ప్రపంచదేశాల్లో అత్యధికశాతం వ్యతిరేకించడం కూడా ట్రంప్ రూటు మార్చడానికి కారణంగా చెపుతున్నారు.

### చర్చలకు మేం కోరలేదు..ట్రంప్ భయంతోనే తగ్గారు..ఇరాన్

కాగాట్రంప్ ప్రకటనపై ఇరాన్ సంప్రదించింది. విద్యుత్‌కేంద్రాలపై దాడులుచేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించడంతో ఆయన వెనక్కి తగ్గారని ఇరాన్ టివి ఇరిబ్ తెలిపింది. ఆఫ్ఘన్‌లోని ఇరాన్‌రాయబార కార్యాలయంకూడా ఇలాగే వ్యాఖ్యలుచేసింది. తమ పవర్‌ప్లాంట్‌లను అమెరికా టార్గెట్‌చేస్తే హార్ముజ్‌జలసంధిని పూర్తిగామూసివేస్తామని హెచ్చరించింది. ఇజ్రాయెల్ విద్యుత్‌కేంద్రాలు, ఇంధన మౌలిక కేంద్రాలు, సమాచార ప్రసార సాంకేతిక వ్యవస్థలనుకూడా తాము టార్గెట్‌చేస్తామని ప్రకటించింది. అంతేకాకుండా ఇజ్రాయెల్‌కూడా యుద్ధవిరమణకు రావాలని, భవిష్యత్తులో ఇరాన్‌పై దాడులుచేయకూడదని ఇరాన్ షరతులు విధించింది. భవిష్యత్తులో యుద్ధం ఉండదని హామీ ఇవ్వాలని, అమెరికా సైనిక స్థావరాలను తొలగించాలని, యుద్ధసమయంనష్టానికి పరిహారం ఇవ్వాలని, హార్ముజ్‌పై పూర్తిస్థాయి నియంత్రణ మాదేనని, మా దేశపరిధిలో ఉన్న జలసంధిపై వేరొకరి పెత్తనం సహించబోమని ప్రకటించింది. విద్వేషపూరిత మీడియా ప్రచారంచేసిన వారిపై విచారణజరిపించి వారిని మాకు అప్పగించాలని షరతులు విధించింది.

### వెంటనే తగ్గిన ముడిచమురు పెరిగిన పసిడి ధరలు

ఇరాన్‌యుద్ధానికి ఐదురోజులుబ్రేక్ ఇస్తున్నట్లు ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లో పోస్టుచేసిన వెనువెంటనే చమురుధరలు బ్యారెల్ 96 డాలర్లకు దిగివచ్చాయి. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియేట్‌కూడా 13 డాలర్లు తగ్గి 85 డాలర్లకు చేరింది. అలాగే బంగారం ధరలు కూడా ఏకాఎకిన తగ్గి మళ్లీపెరిగాయి. ట్రంప్‌ప్రకటన వెలువడకముందుబంగారంపై 10వేలకుపైగా తగ్గుదలనమోదుచేసింది. అలాగే వెండిధరల్లో కూడా కిలో ఒక్కంటికి రూ.20వేలు తగ్గింది. 24 కేరట్ల బంగారం రూ.1,35,650వద్ద కొనసాగింది. యుద్ధవిరమణ జరిగి చర్చలు సానుకూలంగా ముగిస్తే మరింతగా ధరలు పెరుగుతాయని అంచనా. ఇదిలా ఉంటే స్పాట్‌మార్కెట్‌లో బంగారం ధరలు ఔన్స్ ఒక్కంటికి 4099 డాలర్లకుచేరింది. రాత్రి ట్రంప్‌ప్రకటనచేసిన వెనువెంటనే 4474 డాలర్లకు పెరిగింది. వెండి ఔన్స్ ఒక్కంటికి 70 డాలర్లకు చేరింది. కిలో ఒక్కంటికి స్పాట్ మార్కెట్‌లో రూ.2.32 లక్షలుగా కొనసాగింది.

**ఇరాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు...**

ఓవైపుయుద్ధానికి ఐదురోజులు బ్రేక్ ఇచ్చామని అమెరికా అధ్యక్షుడే స్వయంగాచెపితే ఇజ్రాయెల్‌మాత్రం ఇరాన్‌పై దాడులుకొనసాగించింది. రాజధాని నగరం టెహ్రాన్‌పై దాడులు ముమ్మరంచేసింది. ఉగ్రవాద పాలననుంచి ఇరాన్‌కు విముక్తి కల్పించడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్‌ప్రకటించిన సంగతి తెలిసిందే. టెహ్రాన్ వ్యాప్తంగా ఉగ్రవాద పాలన, మౌలిక సదుపాయాలు టార్గెట్‌గా దాడులుచేసామని, ఐడిఎఫ్ ప్రకటించింది. ఇరాన్‌కూడా ఖతార్, సౌదీ అరేబియా, కువైట్; యుఎఇతోసహా గల్ఫ్‌లోని చమురు ఏంద్రాలే లక్ష్యంగా దాడులుచేసింది

### చిత్తూరు రిజిస్ట్రార్ కార్యాలయంపై ఎసిబి పంజా

>> తో వారిని సైతం ఎసిబి అధికారులు బయటికి వెళ్ళకుండా అక్కడే వుండాలని స్పష్టం చేశారు. చిత్తూరు గిరింపేట రిజిస్ట్రార్ కార్యాలయం-1లో పెద్దఎత్తున అవినీతి కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపణలువున్నాయి. గతంలో సైతం ఈ కార్యాలయంపై ఎసిబి అధికారులు దాడులు నిర్వహించి సబ్ రిజిస్ట్రార్ వద్ద నుండి పెద్ద ఎత్తున అనధికారిక నగదు స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ ఈ కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు తమ పనితీరు మార్చుకోలేదు. ఈ పరిస్థితుల్లో మళ్ళీ ఎసిబి అధికారులకు చిత్తూరు గిరింపేట రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతిపై ఫిర్యాదులు అందడంతో ఎసిసి అదికారులు, సిబ్బంది సోమవారం పెద్ద ఎత్తున ఒక్కసారిగా కార్యాలయంపై దాడి చేసి రికార్డులు స్వాధీనం చేసుకుని విస్తృతంగా విచారిస్తున్నారు.

## థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గుపై కేంద్రం లేఖ

**విజయవాడ మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం థర్మల్ విద్యుత్ కేంద్రాలను తాకకుండా కోల్ ఇండియా లిమిటెడ్ చర్యలు చేపడుతోంది. ఆయా కేంద్రాలకు సరిపడా సరఫరా చేసేందుకు సాధ్యమైనన్ని నెక్కువగా బొగ్గు వేలాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రస్తుత కోటా కంటే అదనంగా ఎంత అవసరం? వాటిని తక్కువ వ్యవధిలో సరఫరా చేసేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుత పరిస్థితుల్లో అదనంగా ఎంత బొగ్గు కావాలో తెలపాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. అందుకు అనుగుణంగా విజయవాడలో వీటీపీఎస్, ఆర్‌టీపీపీ, కృష్ణపట్నం కేంద్రాల వద్ద సరిపడా నిల్వలు ఉంచేందుకు అధికారులు ప్రతివారం సరఫరా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆయా కేంద్రాలకు వారానికి కనీసం 6.5 లక్షల టన్నుల వరకు అవసరం. దీంతో కోటా ప్రకారం వచ్చే బొగ్గుతో పాటు అదనంగా మరికొంత తీసుకోవాలని జెన్‌కో నిర్ణయించింది.

24-03Pg3exHMNWJQEK.qxd:24-03Pg3exHMNWJQEK.qxd 1/1/02 6:52 AM Page 1



## సామాజిక విప్లవ నాయకుడు దొమ్మేటి వెంకటరెడ్డికి సిఎం చంద్రబాబు నివాళులు



**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:**శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఏర్పాటుతో బలహీన వర్గాల ఆత్మగౌరవ జ్యోతి వెలిగించిన మహనీయులు దొమ్మేటి వెంకటరెడ్డి అని సీఎం చంద్రబాబు కొనియాడారు. దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి సోమవారం సీఎం చంద్రబాబు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళిని అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక విప్లవ నాయకులు, శెట్టిబలిజ సంక్షేమ సంఘ స్థాపకులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఘన నివాళులర్పిస్తున్నాను అన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి సామాజిక విప్లవకారునిగా చేసిన సంఘ సేవలకు గుర్తుగా ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే సామాజిక సేవతో పాటు, శెట్టిబలిజల అభ్యున్నతికి కృషి చేసి అందరి గుండెల్లో నిలిచారు. "చదువుతోనే సాధికారత అనే సత్యాన్ని, విద్య ప్రాముఖ్యతను ఆరోజుల్లోనే చాటి చెప్పారు. సామాన్యులపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి, తన వారందరికీ ధైర్యాన్ని ఇచ్చిన ధీశాలి దొమ్మేటి వెంకటరెడ్డి . ఈ జయంతి వేడుకల వేళ ఆయనను స్మరించుకుని, స్ఫూర్తి పొందుదాం.



## ప్రధాని మోడీ ప్రయాణం కోట్ల మందికి ప్రేరణ

### - డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**విజయవాడ మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ అధిపతిగా నిరవధికంగా 8931 రోజుల సేవ పూర్తి చేసిన సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన నరేంద్ర మోడీ రాజకీయ ప్రయాణం, భారత ప్రధానిగా కొనసాగుతూ దేశానికి విశేష సేవలు అందించిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పదవిలో గడిపిన కాలం మాత్రమే కాకుండా, అచంచల సంకల్పం, అలసటలేని కృషి, దేశ సేవకు అంకితమైన జీవితం ప్రధాని మోడీని ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని ఆయన అభిప్రాయపడ్డారు పవన్ కళ్యాణ్, గ్రాస్ రూట్ స్థాయి నుంచి గ్లోబల్ స్థాయికి దేశాన్ని నడిపిస్తూ నేషలన్ ఫస్ట్ సిద్దాంతంతో పాలనకు కొత్త నిర్వచనం ఇచ్చారు అని పవన్ కళ్యాణ్ అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణ త్యాగం, అపార కృషితో కొనసాగుతున్న నాయకత్వం దేశ అభివృద్ధికి దోహదపడిందని తెలిపారు. మౌలిక వసతులు, పేదల సాధికారత, డిజిటల్ మార్పులు వంటి రంగాల్లో ప్రధానీ మోడీ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్టను పెంచడంలో కూడా ప్రధాని నరేంద్ర మోడీ పాత్ర కీలకమని పేర్కొన్నారు పవన్ కల్యాణ్ ఈ మైలురాయి నిజమైన నాయకత్వం స్థిరత్వం, నిబద్ధత, స్వార్థరహిత ఆధారపడుతుందని గుర్తుచేస్తుందని అన్నారు. ఇక ప్రధాని మోడీకి మరింత ఆరోగ్యం, శక్తి కలగాలని, దేశసేవలో ఇంకా ఎన్నో సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## సమాచార కమిషనర్‌పై హైకోర్టులో రిట్

**విజయవాడ,మార్చి 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సమాచార సమాచార కమిషనర్‌పై దేవాదాయ శాఖ అధికారులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దేవదాయ శాఖలో సీనియర్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితా, పదోన్నతులకు సంబంధించిన నోట్‌ఫైల్ కావాలని అదే శాఖకు చెందిన ఓ ఉద్యోగి సమాచార హక్కు చట్టం ద్వారా కోరారు. సాధారణంగా ఇది పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి స్థాయిలో ఇచ్చే సమాచారం, అయితే దేవదాయ శాఖ అధికారులు మాత్రం అడిగిన సమాచారం ఇచ్చేది లేదని సదరు ఉద్యోగికి స్పష్టం చేశారు. దీంతో ఆయన ఫస్ట్ అపిలేట్ ఆథారిటీని సంప్రదించారు. అయినా ఫలితం లేకపోవడంతో విషయం ఆర్టీఐ కమిషనర్ కోర్టులోకి చేరింది. ఉద్యోగి కోరిన సమాచారం ఆర్టీఐ నిబంధనల మినహాయింపులోకి వచ్చేది కాదని, ఆ వివరాలు వెంటనే ఇవ్వాలని ఆర్టీఐ కమిషనర్ మొదటి విచారణలోనే ఆదేశించారు. దీనిపై దేవదాయ శాఖ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి స్పందించి.. సమాచారం ఇవ్వడానికి తాము సిద్ధంగానే ఉన్నామని, కానీ శాఖలో ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారులు సహకరించడం లేదని చెప్పారు. దీంతో ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారులు రెండో విచారణకు వచ్చి వివరణ ఇవ్వాలని ఆర్టీఐ కమిషనర్ ఆదేశించారు. దీంతో విచారణకు హాజరైన అధికారులు సీనియారిటీ జాబితా, నోట్ ఫైళ్లను ఇవ్వొద్దని దేవదాయ శాఖ కమి షనర్ ఆదేశించడంతోనే సమాచారం ఇవ్వడం లేదన్నారు.

# మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

### - ఆంధ్రా ప్రాంత మత్స్యకారుల సంరక్షణకు చర్యలు: మంత్రి ఆనం



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని తీర ప్రాంత మత్స్యకార సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, శాశ్వత పరిష్కారానికై గట్టి చర్యలకు ఉపక్రమించినట్లు రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజితా వేజెండ్ల, శాసనమండలి సభ్యులు రాంగోపాల్ రెడ్డి, బీద రవిచంద్ర, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, పాశం సునీల్ కుమార్, నెలవల విజయశ్రీ తదితర నాయకులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మత్స్యకార సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ తీర ప్రాంతంలోని మత్స్యకారులకు చిరకాలంగా పోరుగు రాష్ట్రాలైన తమిళనాడు, పుదుచ్చేరిలతో సమస్యలు ఉన్నాయని, వాటికి శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మన రాష్ట్ర మత్స్య సంపదను పొరుగు రాష్ట్రాలకు చెందిన మత్స్యకారులు హై పవర్ బోట్ల సహాయంతో దోచుకుంటున్న నేపథ్యంలో, ఇతర రాష్ట్రాలకు చెందిన బంధించిన నాలుగు బోట్లను గుర్తు తెలియని వ్యక్తులు విడుదల చేయించిన వైనం జిల్లా మత్స్యకారుల ఆవేదనకు కారణమైందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి సముద్ర జలాలపై గస్తీ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుందన్నారు. ఈ దిశగా వివిధ శాఖల అధికారులు ఇప్పటికే ప్రయోగాత్మకంగా గస్తీ బోటు ను పరీక్షించారన్నారు. మెరైన్ పోలీస్, అటవీ, మత్స్య శాఖ, అగ్నిమాపక శాఖ లకు చెందిన అధికారులతో రెండు బోట్లు 24/7 విధానంలో సముద్రంలో ఏప్రిల్ 14 వరకు గస్తీ తిరుగుతాయన్నారు. ఏప్రిల్ 15 నుండి రెండు నెలలపాటు వేట నిషేధం అమల్లోకి వస్తున్నందున, ఈలోపు మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అందుకనుగుణంగా ముఖ్యమంత్రి ఆదేశాలతో రాష్ట్రస్థాయి ప్రత్యేక బృందం మంగళవారం జిల్లా కు విచ్చేస్తుందన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక బృందంతో సమావేశమై చర్చించి ప్రభుత్వానికి ఆచరణాత్మక నివేదిక సమర్పిస్తుందన్నారు. జిల్లాలోని మత్స్యకారులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉండే మత్స్యకారులకు తోడుగా ఉంటామని మంత్రి ఆనం ఉద్ఘాటించారు.

# యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం

### - కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే గ్యాస్, ఆయిల్ ధరల పెంపు

### - తిరుమలకు అపకీర్తి తెచ్చే వారిని పదవిలో ఉంచుతారా? - సిపిఐ జాతీయ నాయకుడు కె. నారాయణ



**విజయవాడ, మార్చి23,ప్రభాత వార్తప్రతినిధి:** ఇరాన్‌పై అమెరికాఇజ్రాయిల్ చేపడుతున్న యుద్ధం దేశవ్యాప్తంగా మానవాళిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, ఈ యుద్ధం ద్వారా అమెరికాలోని కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరుతున్నాయని సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె. నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం కారణంగా భయానకమైన మరణాలు సంభవిస్తున్నప్పటికీ, దాన్ని నివారించాలంటూ అమెరికాపై ఒత్తిడి తీసుకురావడంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ వైఖరి ప్రశ్నార్థకరంగా ఉందన్నారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలచేసారు.. యుద్ధం ప్రధానంగా చమురు వనరులపై ఆధిపత్యం సాధించడానికి, కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడానికి డోనాల్డ్ ట్రంప్ చేపడుతున్న చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. ఇప్పటికే భారత్‌లో పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. పెట్రోలు ధరల పెరుగుదల రవాణా రంగంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల గ్యాస్ కొరత ఏర్పడి హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు మూతపడిన సందర్భాలు ఉన్నాయని, దీని ప్రభావం నేరుగా కార్మిక, శ్రామిక వర్గంపై పడుతోందన్నారు. ప్రపంచంలో అత్యధిక ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారత్ ప్రధాని నరేంద్ర మోదీ, ఈ పరిస్థితుల్లో డోనాల్డ్ ట్రంప్ వైఖరిపై మోనం పాటించడం సమంజసం కాదని విమర్శించారు. ముందుగా ఈ యుద్ధాన్ని నిలిపివేయాలని ట్రంప్‌పై మోదీ ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ యుద్ధ అంశంపై మోదీపై ఒత్తిడి తేవగల నాయకుడు సీఎం నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న చంద్రబాబు, ట్రంప్‌కు మోదీ మద్దతు పలకకుండా యుద్ధాన్ని ఆపాలంటూ ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా చంద్రబాబు ముందుకు రావాలని ఆయన సూచించారు. అమెరికా యుద్ధోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ, ఈ నెల 29వ తేదీన హైదరాబాద్‌లో "నో వార్" (యుద్ధం వ్యతిరేక) పేరుతో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి భారీ శాంతి ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబు తిరుమల తిరుపతి దేవస్థానం దర్శించుకున్నారని గుర్తుచేశారు. ఆ పవిత్ర క్షేత్రానికి అపకీర్తి తెచ్చే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని ఛైర్మన్ పదవిలో కొనసాగించడం తగదని అభిప్రాయపడ్డారు.

## వివేకా హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వైసిపి నేతలు ఆస్తుల వివాదాన్ని తెరపైకి తెస్తున్నారు : వైఎస్ షర్మిల



**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:**వివేకానంద రెడ్డిది హత్య అని తాను నిజం మాట్లాడటమే నేరమైందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. "నిజం చెప్పినందుకే నాపై ఇంతగా విరుచుకుపడుతున్నారు. తమ కుటుంబ ఆస్తుల వివాదంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. తన సోదరుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ఆస్తుల వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. తన తల్లి వైఎస్ విజయమ్మ విడుదల చేసిన లేఖలోని ప్రతి అక్షరం నిజమని, దమ్ముంటే ఆ లేఖపై జగనే నేరుగా మాట్లాడాలని సవాల్ విసిరారు. సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. వివేకా హత్య కేసులో వైసిపి అనుకూల మాధ్యమం ఏడు గంటల పాటు గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేసిందో చెప్పే ధైర్యం వైసీపీ నేతలకు లేదు. దానికి సమాధానం చెప్పాల్సింది అవినాష్ రెడ్డి, సాక్షి ని నడుపుతున్న భారతీ రెడ్డి. ఆ విషయంపై మాట్లాడలేక, ఆస్తులంటూ కొత్త వివాదాన్ని సృష్టిస్తున్నారు," అని షర్మిల విమర్శించారు. తాను ఆస్తుల కోసం పాకులాడుతున్నట్టు, చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారినట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. తన పోరాటం ఆస్తుల కోసం కాదని, ఒకవేళ అదే తన అజెండా అయితే తెలంగాణలో కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే పార్టీ పెట్టేదాన్నని స్పష్టం చేశారు. జగన్‌తో తాను సంతకం చేసిన ఎంఓయూ పత్రాలను ఇన్నాళ్లూ కోర్టుకు సమర్పించలేదని, కేవలం జగన్ తన తల్లిపై కేసు వేయడం వల్లే ఆ పత్రాలు బయటకు వచ్చాయని వివరించారు. తన తల్లి విజయమ్మ విడుదల చేసిన లేఖపై వైసీపీ సైతాన్ సైన్యం చేస్తున్న దుష్ప్రచారాన్ని షర్మిల తిప్పికొట్టారు. "విజయమ్మ అంటే రాజశేఖర్ రెడ్డి గారిలో సగం. ఆయన ఆశయాలకు సజీవ రూపం. అలాంటి వ్యక్తి, నలుగురు బిడ్డలకు ఆస్తి సమానంగా పంచాలన్నది రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశమని, జగన్ అన్యాయం చేస్తున్నాడని లేఖలో స్పష్టంగా రాశారు. ఈ గోబెల్స్ ప్రచారం ఆపాలని కూడా చెప్పారు. ఇకనైనా డీసెన్సీ ఉన్నవాళ్లు ఎవరూ ఈ విషయం మాట్లాడరు. ఇంకా మాట్లాడుతున్నారంటే, మొరగడం కుక్కల నైజం అనుకోవాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ లేఖలోని సంతకం తన తల్లిది కాదని, ఒత్తిడితో పెట్టించానని వైసీపీ ప్రచారం చేస్తోందని, నిజంగానే ఆ సంతకం ఆమెది కాకపోతే విజయమ్మే స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. జగన్ అయినా తన తల్లితో మాట్లాడించి నిజానిజాలు చెప్పించొచ్చు కదా అని నిలదీశారు. ఈ ఆస్తుల వివాదం పూర్తిగా వ్యక్తిగతమైనదని, దీనిపై మాట్లాడాల్సింది జగన్మోహన్ రెడ్డి అని షర్మిల అన్నారు. "ఇది జగన్ వ్యక్తిగత, ఆస్తులకు సంబంధించిన విషయం. దీనిపై ఆయన పార్టీ నేతల చేత, సోషల్ మీడియా సైన్యం చేత ఎందుకు మాట్లాడిస్తున్నారు? రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశం, ఇద్దరం కలిసి సంతకాలు చేసిన ఎంఓయూ గురించి తెలిసిన జగన్ మాట్లాడాలి కదా? అంటే, ఆయనకు మాట్లాడే దమ్ము లేక ఇతరుల వెనుక దాక్కుంటున్నారని అనుకోవాలా?" అని షర్మిల ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రత్యేక హోదాను, పోలవరాన్ని తాకట్టు పెట్టి మోదీకి దత్తపుత్రుడిగా మారింది జగనేనని, తాను కాదని ఆమె ఆరోపించారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసమే తాను, తన తల్లి రాజకీయాల్లో ఉన్నామని, జగన్‌లా స్వార్థ రాజకీయాలు చేయడం లేదని షర్మిల అన్నారు.

# ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు ప్రపంచ శాంతికి ముప్పు

### - ఇరాన్ పై దాడిని భారత ప్రభుత్వం ఖండించకపోవడం దారుణం - సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**అనంతపురం, మార్చి 23 ప్రభాతవార్తబ్యూరో** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు ప్రపంచాన్ని యుద్ధ ముప్పులోకి నెట్టుతున్నాయని, వాటిని తీవ్రంగా ఖండించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. అమెరికా ప్రెసిడెంట్‌గా ట్రంప్ వచ్చాక ఇతర దేశాల్లో జోక్యం చేసుకోవడం ఎక్కువైందని, అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై దాడులు చేస్తున్న భారత్ ప్రభుత్వం ఖండించకపోవడం దారుణమని అన్నారు. అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులను ఖండించాలి-యుద్ధోన్మాదం, సామ్రాజ్యవాదం నశించాలి, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి" అనే అంశంపై సోమవారం జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి అధ్యక్షత వహించగా, డి.జగదీష్, సి.జాఫర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్ జీ, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ..మార్చి 23న భగత్ సింగ్, రాజగురు వర్ధంతిని కేవలం స్మరణ దినంగా కాకుండా, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి సంకల్ప దినంగా మార్చాలని కె.రామకృష్ణ సూచించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా సామ్రాజ్యవాదం ప్రమాదకర ధోరణులు పెరుగుతున్నాయని, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ పాలనలో ఇతర దేశాలపై జోక్యం అధికమైందని విమర్శించారు. వెనిజులా, క్యూబా దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించడం, ఇరాన్‌పై ఇజ్రాయిల్‌తో కలిసి దాడులు జరపడం వంటి చర్యలు అంతర్జాతీయ శాంతికి ముప్పుగా మారాయని తెలిపారు. ఇటీవలి కాలంలో ఇరాన్‌పై జరుగుతున్న దాడులు తీవ్రరూపం దాల్చి, ప్రపంచాన్ని మరో యుద్ధ వాతావరణంలోకి నెడుతున్నాయని హెచ్చరించారు. ప్రభుత్వాలు యుద్ధాన్ని ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.

## సికింద్రాబాద్ -విశాఖపట్నం ఎక్స్ ప్రెస్ 17 నుంచి విజయవాడ రైల్వే జంక్షన్‌లో ఆగదు!

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:**విజయవాడ రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు కీలక సూచనలు చేశారు. విజయవాడ రైల్వే జంక్షన్ ప్లాట్‌ఫాం నంబర్ 4 ఆప్రాన్ పనులను చేపట్టనున్నారు. దీనివల్ల కొన్ని రైళ్లను దారి మళ్లించనున్నారు. మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేశారు. అలాగే సికింద్రాబాద్ -విశాఖపట్నం ఎక్స్ ప్రెస్ ను కూడా మళ్లించారు. నాలుగో నంబర్ అప్రాన్ పనులు పూర్తయ్యేంత వరకు ఈ ఎక్స్ ప్రెస్.. విజయవాడకు వెళ్లదు. ఈ తాజా మార్పులన్నీ కూడా ఏప్రిల్ 17వ తేదీ నుండి అమలులోకి రానున్నాయి. 45 రోజుల పాటు అంటే మే 31వ తేదీ వరకు కొనసాగుతాయి. ఆ తర్వాత ఇప్పుడు పాక్షిక రద్దు, తాత్కాలిక మళ్లింపులకు గురైన రైళ్లను పునరుద్ధరిస్తారు. యధాతథంగా విజయవాడ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.ఏప్రిల్ 17 నుండి మే 31 తేదీల్లో బయలుదేరే నంబర్ 12740 సికింద్రాబాద్ విశాఖపట్నం, నంబర్ 12739 విశాఖపట్నం సికింద్రాబాద్ దారి మళ్లిస్తారు. సికింద్రాబాద్ బయలుదేరే నంబర్ 12740 ఎక్స్ ప్రెస్ రాయనపాడు విజయవాడ బల్బ్ క్యాబిన్ నార్త్ క్యాబిన్ గుణదల మార్గంలో రైలు విశాఖపట్నానికి వెళ్తుంది. విశాఖపట్నం నుండి బయలుదేరే నంబర్ 12739 ఎక్స్ ప్రెస్ గుణదల విజయవాడ నార్త్ క్యాబిన్ బల్బ్ క్యాబిన్ .

# తిరుమల సమాచారం

## తిరుమలలో తుంబురుతీర్థ ముక్కోటి



**తిరుమల,మార్చి 23 ప్రభాత వార్త ప్రతినిధి:** రెండు రోజులు తుంబురుతీర్థముక్కోటి వేడుకల్లో భాగంగా ఈనెల 31న ఉదయం 6 గంటల నుండి ఏప్రిల్ 1న ఉదయం 10 గంటల వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఉంటుందని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. తుంబురు తీర్థ ముక్కోటికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై తిరుమల పద్మావతి అతిథి గృహంలో సుధర్మ సమావేశ మందిరంలో సోమవారం అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి సమీక్ష సమావేశం నిర్వహించారు. తుంబురు తీర్థానికి మార్చి 31న ఉదయం 6 గంటల నుండి ఏప్రిల్ 1న ఉదయం 10 గంటల వరకు భక్తులను అనుమతిస్తారు.పాపవినాశనం డ్యామ్ వద్ద భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాలు, త్రాగునీటిని 100 మంది శ్రీవారి సేవకులు ద్వారా పంపిణీ చేస్తారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, మందులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంచనున్నారు. తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సి ఉండటంతో 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, గుండె, శ్వాస కోస సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతి లేదు. భక్తులు వంట సామగ్రి, కర్పూరం, అగ్గిపెట్టెలు తీసుకురాకూడదని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

## బాలాజీ ఆరోగ్య వర ప్రసాదినికి రూ.11 లక్షలు విరాళం



**తిరుమల,మార్చి 23 ప్రభాత వార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ టి టి డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని పథకానికి దాత విరాళం ఇచ్చారు.అహ్మదాబాద్‌కు చెందిన అరోహంథ్ డై స్టఫ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు సోమవారం 11 లక్షల విరాళం అందించారు.పేద రోగులకు వైద్య సేవలకు ఉపయోగించాలనే సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు తిరుపతికి చెందిన వై. రాఘవేంద్ర ఈ విరాళాన్ని అందజేశారు.టి టి డి ఇ ఒ ఛాంబర్ లో ఇ ఒ ముద్దాడ రవిచంద్ర కు విరాళం డి డి ని ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఇ ఒ దాతలకు ధన్యవాదాలు తెలియజేసి,

## ట్రస్ట్‌లు, పథకాలకు విరాళాల సేకరణకు టిటిడి కార్యాచరణ!



**తిరుమల,మార్చి 23ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రసిద్ధిగాంచిన హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం దాతలను ప్రోత్సహించే దిశగా కార్యాచరణ సిద్ధంచేస్తున్నట్లు తెలుస్తోంది. భక్తులకు సేవలందించడమేగాక ప్రజలకు అవసరమైన వైద్యం.విద్య పరంగా మెరుగైన సేవలందించేందుకు టిటిడి ఇప్పటికే చొరవచూపుతోంది. ఇందుకోసం తిరుమల తిరుపతి దేవస్థానం అమలుచేస్తున్న పలు రకాల ట్రస్ట్‌లు, పథకాలను దాతల విరాళాలతోనే నిర్వహిస్తున్నారు. ఎస్వీఅన్నప్రసాదం, ఎస్వీప్రాణదానం, విద్యాదానం, గోసంరక్షణట్రస్ట్, వేదపరిరక్షణట్రస్ట్,ఎస్వీసర్వశ్రేయట్రస్ట్, బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్,కాటేజీ దాతల పథకం వంటి అనేక రకాల పథకాలు టిటిడి నిర్వహిస్తోంది.ఈ విభాగాలన్నిటికీ ఒక డిప్యూటీ ఇఒను నియమించి పర్యవేక్షిస్తోంది. వీటిల్లో ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు ఇప్పటికే దేశవిదేశాల్లోని కోటీశ్వరులైన, ధనవంతులైన భక్తులు దాతలుగా వేలకోట్లరూపాయలు విరాళాలుగా ఇచ్చారు. ప్రాణదానం ట్రస్ట్‌కు విరాళాలు అందుతున్నాయి. ఇదివరకు టిటిడి దాతల నుంచి నగదు రూపంలో (డిడిలు, చెక్కులరూపంలో)మాత్రమే విరాళాలు సేకరిస్తోంది. ఇలా పెద్దమొత్తంలో విరాళాలిచ్చిన దాతలకు టిటిడి పలు రకాల ప్రయోజనాలను కల్పిస్తోంది. తిరుమలకు వచ్చిన దాతలకు ఏడాదిలో వసతి, శ్రీవారి దర్శనంలో ప్రత్యేక సౌకర్యాలు కేటాయిస్తుంది. ఇప్పుడు టిటిడి అధికారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్వీబాలాజీ ఆరోగ్యవరప్రసాదిని, ఎస్వీసర్వశ్రేయ ట్రస్ట్‌కు కూడా విరాళాలు సేకరిస్తోంది. తిరుపతిలోని పద్మావతి మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంలో భాగంగా అవసరమైన వైద్యపరికరాలు విరాళంగా అందించినా ఆ దాతలకు ప్రయోజనాలు అందించేలా ప్రణాళికలు రూపొందించింది. వస్తురూపంలో కూడా విరాళాలిచ్చిన దాతలకు అన్ని రకాల ప్రయోజనాలు వర్తింపజేసేలా నిర్ణయించారు. ఇప్పటికే పలురకాల ట్రస్ట్‌లు, పథకాలకు లక్షలమంది దాతలు ఉన్నారు. ఈ దాతలను మరింతగా ప్రోత్సహించి గోసంరక్షణతోబాటు ప్రాణదానట్రస్ట్‌ను, ఆరోగ్యవరప్రసాదినిని మరింత బలోపేతం చేసి పటిష్టంగా అమలుచేయడానికి చూస్తున్నారు. దాతలు తమ విరాళాలను ఈ హుండీ ద్వారా,కియోస్క్ పరికరాలతో, ఆన్‌లైన్‌లో, తమతమ బ్యాంకు అకౌంట్ల నుంచి కూడా పంపే సౌలభ్యం తీసుకువచ్చారు.

## సూర్య కిరణాల తేజస్సులో కోదండరాముడు



**తిరుమల,మార్చి 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై దేదీప్యమానంగా ప్రకాశించారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. సూర్యుడు తేజోనిధి. సకలరోగ నివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటివల్ల పెరిగే సస్యాలు, చంద్రుడు, అతని వల్ల పెరిగే ఔషధాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. అనంతరం ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిచారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఈవాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ మునిశంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, భక్తులు పాల్గొన్నారు. -నేడు రథోత్సవం :కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా జరగనుంది. ఉదయం 7.30 గంటలకు స్వామివారు రథారోహణం చేస్తారు. ఉదయం 8.30 గంటలకు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షి ంచనున్నారు.

## వేసవికి ముందే తిరుమల కిటకిట

### - వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు



**తిరుమల,మార్చి 23 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవులకు ముందే తిరుమల భక్తులతో నిండిపోయింది. సోమవారం ఉదయానికి తిరుమల భక్తజనసంద్రంగా మారింది. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు తిరుమలకు చేరుకోవడంతో ఉదయానికి కొండ కిటకిటలాడుతోంది. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు వెలుపలకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం కేటాయించారు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. వైకుంఠం కంపార్టుమెంట్లలో ,క్యూలైన్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ శ్రీవారిసేవకులు పంపిణీ చేస్తున్నారు. సోమవారం 39వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

24-3Pg7exHMNWJQE.qxd:24-3Pg7exHMNWJQE.qxd 1/1/02 7:40 AM Page 1





# జర్నలిస్టు పూర్ణ కుటుంబానికి సీఎం చంద్రబాబు పరామర్శ

**విజయవాడ, మార్చి23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు కేసంనేని పూర్ణ (పూర్ణ) కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు పరామర్శించారు. విజయవాడ పటమటలంకలోని పూర్ణ నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మంచి జర్నలిస్టును, ఆత్మీయుడుని కోల్పోయానని సీఎం అన్నారు.

# పెమ్మసాని మూల్యం చెల్లించుకోక తప్పదు

## మాజీ మంత్రి అంబటి రాంబాబు

**గుంటూరు, మార్చి 23 ప్రభాత వార్త ప్రతినిధి:** తన ఇంటిపై దాడి ఘటనకు పూర్తి బాధ్యుడు కేంద్రమంత్రి పెమ్మసానే అని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. తన ఇంటి పై దాడి ఘటనలో టీడీపీ నేతల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కు అంబటి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అంబటి మీడియాతో మాట్లాడుతూ 24 గంటల్లో తనకు సినిమా చూపిస్తామని పెమ్మసాని అన్నారని తన ఇంటి పై దాడికి పూర్తి బాధ్యత కేంద్రమంత్రిదే అని స్పష్టం చేశారు. ఇందుకు ఆయన మూల్యం చెల్లించుకోక తప్పదని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన ఇంటిపై దాడి, అలాగే అరెస్ట్ సందర్భంగా పోలీసు వేధింపులపై చర్యలు తీసుకోవాలంటూ గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. విచారణ ఖచ్చితంగా జరిగితే కేంద్ర మంత్రి పెమ్మసాని నిందితుడు అవుతాడని కానీ పోలీసులు



రక్షి ంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అయిన వైసీపీ, తాను వదిలిపెట్టమని గుర్తించుకోవాలని ఆయన హెచ్చరించారు. గొడవల్ని ప్రోత్సహించే మనస్తత్వం లేని తన ఇంటిపై పడి, భార్యాబిడ్డల్ని, మానసికంగా తనను హింసించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులతో కుమ్మక్కై తన పై దుర్మార్గమైన దాడి చేసి వికటాట్టహాసంగా నవ్వుకుంటున్నారని అన్నారు. ఈ దాడి ఘటనలో పోలీసులు సుమోటోగా కేసులు నమోదు చేయాల్సింది పోయి.. తాను ఫిర్యాదు చేశాక 7 సంవత్సరాలు శిక్షలు పడే సెక్షన్లు నమోదు చేసి టీడీపీ నేతలకు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారని.. తనను మాత్రం జైలుకు పంపారని అన్నారు. తన ఇల్లు, కార్యాలయం పై జరిగిన దాడిని ప్రపంచం అంతా చూసిందని అయినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం దురదృష్టకరమని అన్నారు. చట్టం తన పని తాను చేసుకోకపోతే హై కోర్టు, సుప్రీంకోర్టులో సైతం పిటిషన్లు వేస్తామని అన్నారు. దాడి ఘటన పై సీనియర్ పోలీసు అధికారి లేక సిట్ చేత విచారణ చేయించాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. దాడి ఘటనలో చంద్రబాబు, పెమ్మసాని, నారా లోకేష్ లే అసలు నిందితులని తన ఇంటిపై దాడికి వచ్చిన వాళ్లంతా చిన్నచిన్నవాళ్లని స్పష్టం చేశారు.

# ఇంద్రకీలాద్రి సమాచారం



## దుర్గమ్మవారి సేవలో జస్టిస్ ఎన్.వి. రమణ

దుర్గమ్మవారిని సోమవారం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ, ఉప లోకాయుక్త న్యాయమూర్తి రజిని దంపతులు శ్రీ అమ్మవారి దర్శనము చేసుకున్నారు. ఇఒ వి కే సీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణలు వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం మెమెంటోలు అందించారు. వేదపండితులు వేద ఆశీర్వచనము అందించారు.

### దుర్గమ్మ సన్నిధిలో పద్మశ్రీ అన్నవరపు రామస్వామి



దుర్గమ్మవారిని ప్రముఖ వయోలిన్ విద్వాంసులు, భారత ప్రభుత్వ పద్మశ్రీ పురస్కార గ్రహీత అన్నవరపు రామస్వామి తమ 101వ పుట్టినరోజు సందర్భంగా సోమవారం దర్శించుకున్నారు. సంగీత శిష్యులతో కలిసి విచ్చేసిన వారికి ఈవో వీకే శీనా నాయక్, చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ, ధర్మ కర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దర్శనానంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనం అందించగా, ఈవో శీనా నాయక్ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలుఅందజేసి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ, అమ్మవారి సన్నిధిలో ఎన్నో కచేరిలు నిర్వహించి, దుర్గమ్మ సేవలో బాల్యం నుండి తరించి,సంగీత ప్రపంచంలో ధృవతారగా వెలుగుతున్న రామస్వామి గారు మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, అమ్మవారి ఆశీస్సులు వారికి ఎప్పుడు తోడై ఉంటాయని పేర్కొన్నారు.

### దుర్గమ్మవారికి వైభవంగా పుష్పార్చన



దుర్గమ్మవారికి వసంత నవరాత్రుల్లో భాగంగా సోమవారం ఐదవ రోజు ఐదు రకాల పవిత్ర పత్రాలు తెల్ల జిల్లేడు, మారేడు దళాలు, తులసి, మరువం, దవనం పుష్పాలతో అమ్మవారిని అర్చించారు. కార్యక్రమంలో ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదాన పథకానికి విరాళం:

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన సగలమ్రి పిచ్చయ్య రూ. 1,01,120/లు విరాళాన్ని సోమవారం అందించారు. మరియు కానూరు కు చెందిన తల్లా వెంకటరత్నం గారు రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని అన్నదాన కార్యక్రమాల కోసం వినియోగించనున్నారు.

### ఈనెల 28న ట్రస్టుబోర్డు సమావేశం

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, విజయవాడ ధర్మకర్తల మండలి (ట్రస్టుబోర్డు) సమావేశం ఈ నెల 28 నాడు జరగనుందని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ది. మల్లిఖార్జున మహామండపం 4వ అంతస్తులో గల సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3గంటలకు జరగనున్నఈ సమావేశంలో దేవస్థాన అభివృద్ధి మరియు ఇతర ముఖ్యమైన అంశాలపై చర్చించనున్నారు.

### టోలు రుసుము టెండర్ వాయిదా

దుర్గమ్మవారి దేవస్థానము ఘాట్ రోడ్ మరియు కనకదుర్గ నగర్ పార్కింగ్ టోలు రుసుము టెండర్ కం బహిరంగ వేలంను (ఒక సంవత్సర కాలమునకు) సరి అయిన రేటు రానందున వాయిదా వేశామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

### దుర్గమ్మవారి నామస్మరణతో దుర్గతులు తొలగుతాయ్

వసంత నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సోమవారం సాయంత్రం కళావేదికపై ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, శ్రీ ప్రణవపీఠాధీశులు, త్రిభాషా మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారిచే జరిగిన శ్రీదుర్గాతత్త్వం ప్రవచనం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అమ్మవారి శక్తిని, కరుణను హృద్యంగా వివరించారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం అమ్మవారు ఎత్తిన అవతారాల వెనుక ఉన్న పరమార్థాన్ని భక్తులకు బోధించారు. లోకపావని అయిన శ్రీకనకదుర్గమ్మను స్మరించడం వల్ల కలిగే మానసిక ప్రశాంతతను, లలితా సహస్రనామ వైభవాన్ని వారు శ్లోక రూపంలో విశ్లేషించారు. ఈ ఆధ్యాత్మిక ప్రవచనాన్ని ఆలకించేందుకు విజయవాడ నగరం నుండే కాకుండా పరిసర ప్రాంతాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.కె.శ్రీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ దంపతులను ఘనంగా సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు అవ్వారు శ్రీనివాసరావు, పి. రాఘవ రాజు, స్థానాచార్య వి. శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకులు ఆర్. శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# లంచానికి లాక్!

**125వ వార్డు, లలితానగర్ సచివాలయంలో ఉచ్చు రూ.80 వేలు లంచం తీసుకుంటూ అక్కయ్యపాలెంలో ఉద్యోగి**

**పట్టివేత సచివాలయాల్లో అవినీతిపై పెరుగుతున్న ఫిర్యాదులు**

**విశాఖ క్రైమ్ ప్రభాతవార్త:** విశాఖ నగరంలో సచివాలయ వ్యవస్థలో అవినీతి ఆరోపణలు మం ోసారి చర్చనీయాంశమయ్యాయి. అక్కయ్యపాలెం వార్డు సచివాలయంలో రూ.80 వేల లంచం తీసుకుంటూ వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ పైలా రాజేష్ ఏసీబీ అధికారు లకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కడం సంచలనం రేపింది. అక్కయ్యపాలెం పరిధిలోని 125వ వార్డు లలితానగర్ సచివాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. వార్డు ఎడ్యుకేషన్ కం డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ పైలా రాజేష్ స్థిరాస్తి సెటిల్‌మెంట్ డీడ్ ప్రాసెస్ చేయడానికి రూ.90 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు వచ్చింది. ఫిర్యాదుదారు గణేష్‌తో చివరకు రూ.80 వేల వద్ద ఒప్పందం కుదిరింది. లంచం ఇవ్వడానికి ఇష్టపడని గణేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో, గుర్తు పెట్టిన నోట్లతో ట్రాప్ ఏర్పాటు చేశారు. సచివాలయంలోనే రూ. 80 వేల నగదు స్వీకరిస్తుండగా పైలా రాజేష్‌ను అధికారులు పట్టుకున్నారు. అనంతరం అతన్ని కోర్టులో హాజరు పరచేందుకు చర్యలు చేపట్టారు. ఈ ట్రాప్‌లో ఏసీబీ డీఎస్పీలు రమణమూర్తి, హర్షిత, సీఐలు శ్రీనివాస్, వెంకటరావు తదితర



సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు ప్రజలకు 1064 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఏసీబీకి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఇటీవలి కాలంలో ఏసీబీకి చిక్కిన సచివాలయ సెక్రటరీలు విశాఖలో ఇటీవల కాలంలో పలువురు సచివాలయం స ఖియేటర్లు ఏసీబీకి చికినా సంఘటనలో ఎన్నో ఉన్నాయి. గత రెండేళ్లుగా ఏసీబీకి పట్టుబడిన సచివాలయం సెక్రెటరీ వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక నెహ్రూ నగర్ వార్డు సచివాలయంలో వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా పనిచేస్తున్న గణేశ్, ఇంటి పన్ను, నీటి పన్ను పేరు మార్పు కోసం రూ 25 వేల లంచం డిమాండ్ చేశాడు. ముందుగా రూ.9 వేల తీసుకుని, మిగిలిన రూ.16 వేల స్వీకరిస్తుండగా ఏసీబీకి చిక్కాడు. తగరపువలస పరిధిలో గ్రామ సచివాలయ కార్యదర్శి వై. స్వామి నాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ముగడ రాజు కలిసి రికార్డుల పేరు మార్పు కోసం రూ.60 వేల డిమాండ్ చేసి, రూ.30 వేల తీసుకుంటుండగా పట్టుబడ్డారు. ప్రశాంతినగర్ వార్డు అడ్మిన్ సెక్రటరీ డి. భాస్కరరావు, ప్రాపర్టీ ట్యాక్స్ పేరు మార్పు కోసం రూ.40 వేల అడిగి, రూ.20 వేల తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. సచివాలయాల్లో అవినీతిపై పెరుగుతున్న ఫిర్యాదులు రాష్ట్రవ్యాప్తంగా భూమి రికార్డులు, పన్నుల మార్పులు, రిజిస్ట్రేషన్ సంబంధిత సేవల్లో లంచాల ఆరోపణలు ఎక్కువవుతున్నాయని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. విశాఖ జిల్లాలో ముఖ్యంగా స్థిరాస్తి, ట్యాక్స్, రికార్డు మార్పులే ఎక్కువ ట్రాప్ కేసులకు కారణమవుతున్నాయి. ప్రజలు ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్ లేదా సమీప ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

# చిత్తూరు కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు

## మరోసారి ఉత్తుత్తి బెదిరింపు అని తేల్చిన పోలీసులు

**చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా కోర్టు సోమవారం మరొక్కసారి ఉలిక్కిపడింది. చిత్తూరు జిల్లా కోర్టు భవనాల్లో ఏకంగా 25 చిన్న సైనేడ్ గ్యాస్ బాంబులు పెట్టామని, ఈ బాంబులు ఎప్పుడైనా పేలవచ్చునని కోర్టు మెయిల్‌కు మెయిల్ రావడంతో కోర్టులో కలకలం రేగింది. కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు బాంబు బెదిరింపు మెయిల్ సమాచారం తెలుసుకుని ఒక్కసారిగా కోర్టు నుండి వెలుపలికి పరిగెత్తారు. కోర్టు సూపరిటెండెంట్ కోర్టుకు వచ్చిన బాంబు బెదిరింపు సమాచారంను మధ్యాహ్నం 12.05 గంటలకు పోలీసులకు అందజేయడంతో పోలీసులు మధ్యాహ్నం 12.10 గంటలకు రంగంలోకి దిగారు. కోర్టుకు బాంబు బెదిరింపు సమాచారం అందుకున్న డిఎస్పీ సాయినాథ్ నేతృత్వంలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ మోతూరి, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు, ఆర్ఐ సుధాకర్‌లు తమ సిబ్బందితో కోర్టుకు చేరుకున్నారు. అప్పటికే డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందడంతో డాగ్ స్క్వాడ్ కోర్టుకు చేరుకుని బాంబు ఎక్కడ పెట్టారనే విషయంపై తనిఖీలు ప్రారంభించాయి. వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ మోతూరి, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబులు కోర్టుకు చేరుకుని న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులకు వెలుపలికి తరలించారు. ఆపై కోర్టు భవనాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అయితే డాగ్ స్క్వాడ్‌కు ఎక్కడా బాంబు పెట్టిన అనవాళ్ళు కన్పించలేదు. మధ్యాహ్నం 12.10 గంటల నుండి కోర్టులో తనిఖీలు ప్రారంభించిన పోలీసులు మధ్యాహ్నం 3 గంటల వరకు తనిఖీలు చేసినా బాంబు జాడ కన్పించలేదు. చిత్తూరు జిల్లా కోర్టుకు మరోసారి ఎవరో అకతాయి బాంబు బెదిరింపు మెయిల్ చేశారని నిర్ణయానికి వచ్చిన పోలీసులు ఆ మేరకు విచారణ ప్రారంభించారు.

# ఉరవకొండలో మగ్గంపై నేసిన పట్టుచీరకు జాతీయ స్థాయిలో గుర్తింపు!

- ఆయోధ్య రామమందిరంలో జరిగిన పూజకు ఉరవకొండలో నేసిన పట్టుచీరను ధరించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న రాష్ట్ర చేనేత జౌళీశాఖ కమీషనర్ రేఖారాణి
- రాష్ట్రపతి ధరించడంతో ఉరవకొండలో నేసిన బార్డర్ విత్ టెంపుల్ కుట్టు పట్టుచీరకు జాతీయ గుర్తింపు

**ఉరవకొండ, మార్చి 23 ప్రభాతవార్త:** ఉరవకొండ పట్టణంలో చేనేత మగ్గంపై నేసిన బార్డర్ విత్ టెంపుల్ కుట్టు పట్టుచీరకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈనెల 19వ తేదీన ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య రామమందిరంలో జరిగిన రామయంత్ర ఫలకం ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉరవకొండలో నేసిన చీరను ధరించి ముఖ్య అతిథిగా హాజరు కావడంతో ఉరవకొండకు ఈ గుర్తింపు లభించింది. ఈ విషయాన్ని రాష్ట్రపతికు చీరను బహుకరించిన రాష్ట్ర చేనేత జౌళీశాఖ కమీషనర్ రేఖారాణి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంతో ఉరవకొండ పేరు జాతీయ స్థాయిలో మారుమ్రోగుతోంది. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత జౌళీశాఖ గత ఏడాది మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని చేనేత సంఘాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా మడిసరుకులను అడ్వాన్స్ రూపంలో నగదును అందజేసి రెండు నెలల గడువులోగా పట్టుచీరలు నేసి అందించాలని సూచించింది. ఈ క్రమంలో ఉరవకొండలోని నవదుర్గ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘానికి కూడా ముడి సరుకులు, నగదు అందించగా సంఘం



అధ్యక్షులు కారుపోతుల రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు పుల్లా హరిప్రసాద్ ఆధ్వర్యంలో చేనేత జౌళీశాఖ ఎంపిక చేసిన ఎస్‌హెచ్‌జీ సభ్యులైన సంఘం సభ్యులు కారుపోతుల శా ్యమల, పుల్లా ధనలక్ష్మి, పుల్లా తులసి, ఎర్రా పావని, కారుపోతుల వేదావతి చేనేత మగ్గంపై 4.5 లక్షల రూపాయలు విలువైన 30 పట్టుచీరలు నేసి జిల్లా చేనేత జౌళీశాఖ అధికారులకు చేర్చగా వారు రాష్ట్ర అధికారులకు పంపించారు. ఈక్రమంలో శీతాకాల విడిదికు గాను గత డిసెంబర్ నెలలో హైదరాబాద్‌కు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు రాష్ట్ర చేనేత జౌళీశాఖ కమీషనర్ రేఖారాణి మర్యాదపూర్వకంగా కలిసి ఉరవకొండలో నేసిన పట్టుచీరను బహుకరించారు. ఈనెల 19వ తేదీన ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య రామమందిరంలో జరిగిన రామయంత్ర ఫలక ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉరవకొండలో చేనేత మగ్గంపై నేసిన బార్డర్ విత్ టెంపుల్ కుట్టు పట్టుచీరను ధరించి హాజరు కావడంతో ఈ విషయాన్ని రాష్ట్ర చేనేత జౌళీశాఖ కమీషనర్ రేఖారాణి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంతో ఉరవకొండ పేరు నేడు దేశ వ్యాప్తంగా మారు మ్రోగుతోంది.

**ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని కొత్త డీజైన్లతో చీరల ఉత్పత్తి:**

ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తే మరిన్ని కొత్త డిజైన్లతో చీరలను ఉత్పత్తి చేస్తామని నవదుర్గ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం అధ్యక్షులు కారుపోతుల రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు పుల్లా హరిప్రసాద్ చెప్పారు. వారు 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ సంఘంలో 52 మంది సభ్యులున్నారని వారికి చేతినిండా పని కల్పించడానికి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించడంతోపాటు ముడి సరుకులు అందించి ఆర్డర్లు ఇస్తే మెరుగైన డిజైన్లతో చీరలు ఉత్పత్తి చేసి అందిస్తామన్నారు. ప్రస్తుతం సంఘం సభ్యులకు పని లేకపోవడంతో మాస్టర్ వీవర్ల వద్ద పని చేసుకోవాల్సి వస్తోందన్నారు. తమకు చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్‌పై కూడా అవగాహన ఉందన్నారు. చేనేత మగ్గాలపై టెంపుల్ కుట్టు, చెక్స్, బార్డర్ లెస్, బార్డర్ అప్ బుట్టాలు తదితర చీరలు ఉత్పత్తి చేస్తామన్నారు. తమ సంఘంలో ప్రస్తుతం షేర్ క్యాపిటల్ లేనందున కొత్త కొత్త రకాల చీరల ఉత్పత్తికు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. తమ సంఘంలో ఉత్పత్తి అయిన చీరను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ధరించడం దేశ వ్యాప్తంగా గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# విమానాశ్రయ నిర్వాసితులకు అమరావతిలో ప్లాట్‌ల కేటాయింపు

## 75మంది రైతులకు రూ.79.87కోట్ల విలువైన భూముల కేటాయింపు

**గన్నవరం (కృష్ణా), మార్చి 23 ప్రభాతవార్త :** దాదాపు దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న గన్నవరం విమానాశ్రయ నిర్వాసిత రైతులకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చొరవతో రాజధాని అమరావతిలో ప్లాట్‌లు కేటాయించారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ కోసం గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుల నుండి భూమిని సమీకరించారు. భూములు ఇచ్చిన రైతులకు రాజధాని రైతులకు ఇచ్చినట్లుగానే భూములు కేటాయించేలా ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. ప్రభుత్వం సమీకరించిన భూమిలో విమానాశ్రయం అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ రైతులందరికీ అమరావతిలో భూములు ఇవ్వలేదు. కొంతమంది రైతులకు భూములు కేటాయించినప్పటికీ రైతులందరికీ ఇవ్వలేదు. ఈదశలో రైతుల ఇబ్బందులు తెలుసుకున్న యార్లగడ్డ వెంకట్రావ్ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్ళి రైతులకు భూములు కేటాయించాలని కోరారు. యార్లగడ్డ విజ్ఞప్తికి స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విమానాశ్రయ నిర్వాసిత రైతులకు రాజధానిలో భూమలు కేటాయించాలని ఆదేశించారు. ఈమేరకు 75మంది రైతులకు రూ.79.87కోట్ల విలువచేసే 85ప్లాట్‌లను కేటాయించారు. సోమవారం సాయంత్రం గన్నవరం యంపిడిఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ చేతుల మీదుగా భూముల కేటాయింపు పత్రాలను రైతులకు అందచేసారు. భూములు



విమానాశ్రయ నిర్వాసితులకు అమరావతి ప్లాట్‌లు కేటాయింపు పత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

కేటాయించటంతో రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేసారు. భూముల కేటాయింపులో జప్యం జరిగినందుకు ఎమ్మెల్యే రైతులకు క్షమాపణ చెప్పారు. విమానాశ్రయ నిర్వాసిత రైతులందరికీ రాజధానిలో భూములు కేటాయించామని, ఇంకా 9ఎకరాల భూమికి సంబందించి కోర్టు వివాదాలు ఉండటంతో పెండింగ్ ఉందన్నారు. విమానాశ్రయ విస్తరణ కోసం సమీకరించిన భూముల్లో దావాజీగూడెం గ్రామంలో సీతారామచంద్రస్వామి ఆలయానికి 1895సంవత్సరం గొంది బాపయ్య 4.34ఎకరాలు విరాళంగా ఇవ్వగా గత 10ఏళ్ళలో రెవెన్యూ అధికారులు రికార్డులు టాంపరింగ్ చేసారని ఆరోపించారు. ఈవ్యవహారంపై విచారణ జరిపి బాద్యులపై చర్యలు తీసుకోవటంతోపాటు, దేవుడి భూమికి పరిహారంగా వెలగపూడిలో 1850 గజాల భూమిని కేటాయించేలా చర్యలు తీసుకుంటానని యార్లగడ్డ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గుడివాడ ఆర్డీలో బాలసుబ్రమణ్యం, గన్నవరం ఏయంసి చైర్మన్ గుడవల్లి నరసింహారావు, నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, దొంతు చిన్న తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఫిన్‌టెక్ ఆవిష్కరణలే భవిష్యత్

# వ్యాపారాలకు దిశా నిర్దేశం

## ప్రొఫెసర్ రఘు కొర్రపాటి

### ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

**విజయవాడ, మార్చి23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఫిన్‌టెక్ రంగంలోని ఆవిష్కరణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మారుస్తున్నాయని, డిజిటల్ పేమెంట్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చైన్ టెక్నాలజీలు భవిష్యత్ వ్యాపారాలకు కీలకమవుతాయని అమెరికాలోని వాల్డెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రఘు కొర్రపాటి తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రూసా 2.0 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఫిన్‌టెక్ ఇన్నోవేషన్స్ అండ్ బిజినెస్ అప్లికేషన్స్" అనే మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును సోమవారం ప్రారంభించారు. డా. ముల్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ మరియు కామర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం సంయుక్తంగా ఈ సదస్సును డా. హెచ్.హెచ్. డిచిమాన్, డా. జాన్ డేవిడ్ ఆడిటోరియంలో నిర్వహించింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె. గంగాధరరావు మాట్లాడుతూ, విద్యా రంగం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారాలని, విద్యార్థులు ఆధునిక ఫిన్‌టెక్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఎక్ట్రానిక్స్ సిస్టమ్స్ సీఈఓ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకృష్ణ మాట్లాడుతూ, ఫిన్‌టెక్ రంగంలో స్టార్టప్స్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని, యువత సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు. కీనోట్ స్పీకర్లలో అల్కా మెహతా (పేయిడ్ పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపకురాలు సీఈఓ) డిజిటల్ పేమెంట్ వ్యవస్థల అభివృద్ధిపై మాట్లాడగా, రోబిన్స్ జాయ్ (నిప్పాన్ మ్యూచువల్ ఫండ్స్ ఇండియా లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రీజినల్ హెడ్) పెట్టుబడి ధోరణులపై వివరించారు. డా. ఎం. ఉమ మహేశ్వరరావు (ఇన్ఫోసిస్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్) ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో టెక్నాలజీ వినియోగంపై మాట్లాడారు. ఇతర ప్రముఖుల్లో కే. ప్రేమ్ కుమార్ (ఎర్నెస్ట్ యంగ్ సీనియర్ చీఫ్ ఫైనాన్షియల్ అనలిస్ట్), వెంకట రమణ గోసావి, ఎం.వి.వి.ఎన్. పాత్రుడు (వైట్ షీల్డ్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్), డా. వెంకట్ ఇంక్కుర్తి (ఫైనాన్షియల్ కన్సల్టెంట్), జయశ్రీ వెంకటేష్ (బ్యాంక్ ఆఫ్ టోక్యో సీనియర్ బ్యాంకింగ్ ప్రొఫెషనల్), ప్రొఫెసర్ రత్నాకర్ డి.బి. (ఐఎంఆర్ఎఫ్ ఫౌండేషన్ చైర్మన్), శివ ప్రసాద్ (హెచ్‌సీఎల్‌టెక్ విజయవాడ సెంటర్ హెడ్) పాల్గొన్నారు.

# పార్కింగ్ కాంట్రాక్టర్‌కు జరిమానా

## కొరడా ఝుళిపించిన ఇవో వికె శీనా నాయక్

**ఇంద్రకీలాద్రి, మార్చి 23, ప్రభాతవార్త :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం లో పార్కింగ్ ఫీజుల పేరిట నిబంధనలకు విరుద్ధంగా అదనపు వసూళ్లకు పాల్పడుతున్న పార్కింగ్ కాంట్రాక్టర్‌పై దేవస్థానం ఇఓ వికె శీనా నాయక్ కఠిన చర్యలు చేపట్టారు. దేవస్థానంలో వాహనాల పార్కింగ్, టోల్ వసూలు చేసుకునే హక్కును పొందిన మెస్సర్స్ వి.ఎల్.డి ఏజెన్సీస్ అండ్ కాంట్రాక్టర్ ప్రతినిధులు భక్తుల నుండి నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. పలువురు భక్తులు వీడియో ద్వారా తమ ఆవేదన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. 4 చక్రాల వాహనాలకు (మినీ వ్యాన్) నిర్ణీత ధర రూ. 100/ ఉండగా, కాంట్రాక్టర్ సిబ్బంది రూ. 200/ వసూలు చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ఆధారాలతో సహా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అదనపు వసూళ్లపై ప్రశ్నించిన భక్తులతో కాంట్రాక్టర్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, దేవస్థానం ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపిన ఇఓ వికె శీనా నాయక్ దేవస్థానం కాంట్రాక్ట్ నిబంధనలు 12(ఇ), 17, 18, 22, 23 మరియు 25లను ఉల్లంఘించినట్లు నిర్ధారించి, సదరు కాంట్రాక్టర్‌కు రూ. 25,000 జరిమానా విధించారు. జరిమానా మొత్తాన్ని మూడు రోజుల్లోగా చెల్లించాలని, అలాగే ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని ఈవో శీనా నాయక్ ఆదేశించారు. టెండర్ గడువు ముగిసే లోపు భవిష్యత్తులో ఇటువంటి ఫిర్యాదులు మళ్లీ వస్తే, ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే టెండర్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని ఈవో ఈ సందర్భంగా హెచ్చరించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని, భక్తుడే దేవస్థానంనకు ముఖ్యమని, ఈ టెండర్ ద్వారా లభించే ఆదాయంకూడా ఆలయానికి ముఖ్యం కాదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం టెండర్ దశలో ఉన్న కొత్త పార్కింగ్ టెండర్‌లో నిబంధనలు ఉల్లంఘించి, భక్తుల నుండి అధిక ధరలు వసూల్ చేస్తున్న మెస్సర్స్ వి.ఎల్.డి ఏజెన్సీస్ అండ్ కాంట్రాక్టర్స్ వారిని నిషేధం విధించేందుకు దేవదాయ ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

24-3Pg5.qxd:24-3Pg5.qxd 1/1/02 6:32 AM Page 1



# భారత్‌కు ఊహించని సవాళ్లు



### మధ్య ప్రాచ్య యుద్ధంతో 3 వారాలుగా ఇంధన సంక్షోభం

### పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాకు లోటు రానివ్వం

### యుద్ధం విరమింపచేయడానికి యత్నాలు: లోక్‌సభలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, మార్చి 23:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా భారత్ ఊహించని సవాళ్లను ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం లోక్‌సభలో వెల్లడించారు. ఈ యుద్ధం గల్ఫ్ దేశాల్లోని భారతీయులపై, దేశ వాణిజ్యంపై, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ సంక్షోభంపై విదేశాంగ మంత్రి జైశంకర్, కేంద్ర మంత్రి హార్దీప్ సింగ్ పురి ఇప్పటికే సభకు వివరించారని గుర్తుచేశారు. ఈ సంక్షోభానికి త్వరగా పరిష్కారం కనుగొనాలని ప్రపంచ దేశాలన్నీ కోరుకుంటున్నాయని తెలిపారు. భారత్‌కు అవసరమైన ముడిచమురు, గ్యాస్, ఎరువులు వంటివి పెద్ద మొత్తంలో హార్మూజ్ జలసంధి నుంచే వస్తాయని ప్రధాని మోడీ గుర్తుచేశారు. యుద్ధం కారణంగా ఈ మార్గంలో నౌకల రాకపోకలు సవాలుగా మారాయని అన్నారు. అయినప్పటికీ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడకుండా మా ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందని ఆయన వివరించారు. దేశం తన ఎల్పీజీ అవసరాల్లో 60 శాతం దిగుమతి చేసుకుంటున్నందున, సరఫరాలో అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని దేశీయ వినియోగదారులకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని కూడా పెంచుతున్నట్లు చెప్పారు. గత 11 ఏళ్లలో ఇంధన భద్రత కోసం తమ ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక చర్యలను ప్రధాని మోడీ వివరించారు. గతంలో కేవలం 27 దేశాల నుంచి ముడి చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ వంటివి దిగుమతి చేసుకోగా, నేడు 41 దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయికి చేరామని తెలిపారు. సంక్షోభ సమయాల కోసం ముడి చమురు నిల్వలకు ప్రాధాన్యత ఇచ్చామని, ప్రస్తుతం దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని 64 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పెంచేందుకు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇవి కాకుండా ఆయిల్ కంపెనీల వద్ద ఉండే నిల్వలు అదనమని అన్నారు. చమురు, గ్యాస్ సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేలా వివిధ దేశాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, గల్ఫ్, ఇతర సముద్ర మార్గాలను నిశితంగా గమనిస్తున్నామని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ సంక్షోభం భారత్‌కు ఆర్థిక, జాతీయ భద్రత, మానవతా పరమైన సవాళ్లను సృష్టిస్తోందని వివరించారు. యుద్ధంలో చిక్కుకున్న దేశాలతో, దాని ప్రభావానికి గురైన దేశాలతో భారత్‌కు విస్తృతమైన వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. మనకు అవసరమైన ముడి చమురు, గ్యాస్‌లో సింహభాగం ఈ ప్రాంతం నుంచే దిగుమతి అవుతోంది. ఇతర దేశాలతో మన వాణిజ్యానికి ఈ ప్రాంతం ఒక ముఖ్యమైన మార్గం కూడా. అందువల్ల, ఈ యుద్ధం మనపై తీవ్ర ప్రభావం చూపుతోందని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సుమారు కోటి మంది భారతీయులు నివసిస్తూ, పనిచేస్తున్నారని, అలాగే వాణిజ్య నౌకల్లో పనిచేసే భారత సిబ్బంది సంఖ్య కూడా చాలా ఎక్కువని, ఈ కారణాల వల్ల భారత్ ఆందోళన సహజంగానే ఎక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు. సంక్షోభ ప్రాంతాల్లోని భారతీయుల భద్రత, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రభావిత దేశాల్లోని ప్రతి భారతీయుడికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాం. నేను స్వయంగా రెండు దఫాలుగా చాలా పశ్చిమాసియా దేశాల అధినేతలతో ఫోన్‌లో మాట్లాడాను. భారతీయులకు పూర్తి భద్రత కల్పిస్తామని వారంతా హామీ ఇచ్చారని తెలిపారు. దురదృష్టవశాత్తు కొందరు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు గాయపడ్డారని చెబుతూ, వారి కుటుంబాలకు అవసరమైన మద్దతు అందిస్తున్నామని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందేలా చూస్తున్నామని వివరించారు. ఇప్పటికే 3,75,000 మందికి పైగా భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారని, ఒక్క ఇరాన్ నుంచే 700 మంది మెడికల్ విద్యార్థులతో సహా వెయ్యి మంది వచ్చారని తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని భారతీయ పాఠశాలల్లో 10, 12వ తరగతి పరీక్షలను సీబీఎస్‌ఈ రద్దు చేసిందని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

పశ్చిమాసియా సంక్షోభం రైతులపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని ప్రధాని మోడీ భరోసా ఇచ్చారు. రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు దేశంలో పుష్కలంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు వేయడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. గత కొన్నేళ్లుగా మేం తీసుకున్న చర్యల వల్ల వివిధ మార్గాల్లో ఎరువుల దిగుమతి సాధ్యమైంది. రైతులకు మేక్ ఇన్ ఇండియా ఎరువుల ప్రత్యామ్నా యాన్ని కూడా ఇచ్చామని ఆయన వివరించారు.

## సౌదీ, బహ్రెయిన్ సైనిక స్థావరాలపై డ్రోన్ దాడులు

**టెహ్రాన్, మార్చి 23:** సౌదీ అరేబియా, బహ్రెయిన్‌ల లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) సోమవారం ప్రకటించింది. ఈ పరిణామంతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం లక్ష్యంగా ఈ దాడులు జరిపినట్లు ఐఆర్ జీసీ ప్రతినిధి తెలిపారు. అమెరికా నిఘా విమానాలు ఈ స్థావరాల నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నందున వాటిని లక్ష్యంగా చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన ఐదు కేసీ135 స్ట్రాటోట్యాంకర్ విమానాలు దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. సౌదీ అరేబియా తమ దేశంపైకి వస్తున్న ఇరాన్ ఆయుధాలను అడ్డుకుంది. రియాద్, తూర్పు ప్రాంతం లక్ష్యంగా వచ్చిన రెండు డ్రోన్లు, ఒక బాలిస్టిక్ క్షిపణిని తమ వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేసినట్లు సౌదీ రక్షణ శాఖ ప్రకటించింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మౌలిక సదుపాయాలపై కొత్తగా బాంబు దాడులు మొదలుపెట్టింది. తమ లక్ష్యాలను సాధించే దిశగా యుద్ధం సరైన మార్గంలోనే సాగుతోందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు. మరోపక్క, ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత సంక్షోభం 1970ల నాటి చమురు సంక్షోభం కంటే భయంకరంగా మారవచ్చని అంతర్జాతీయ ఇంధన సంస్థ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధ ప్రభావం భారత్‌పైనా స్పష్టంగా కనిపిస్తోంది. చమురు, ఎల్పీజీ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండటంపై భారత పార్లమెంటులో ఆందోళన వ్యక్తమైంది.

## మంటల్లో పశ్చిమాసియా

## దురాక్రమణకు దిగితే.. పర్షియన్ గల్ఫ్ అంతా సీమైన్స్: ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్, మార్చి 23:** ఇరాన్‌లో అమెరికా భూతల దాడులకు దిగొచ్చని, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనంలోకి తీసుకోవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి స్ట్రాంగ్ వార్నింగ్ వచ్చింది. తమ దేశ తీరం లేక ద్వీపాలపై దాడి చేస్తే.. పర్షియన్ గల్ఫ్ అంతటా సీమైన్స్ పరుస్తామని తాజాగా ఇరాన్ డిఫెన్స్ కౌన్సిల్ హెచ్చరించింది. ఈ మేరకు రాయిటర్స్ కథనం పేర్కొంది. దాంతో గల్ఫ్ షిప్పింగ్ మార్గాలు, కమ్యూనికేషన్ లైన్లకు తీవ్ర అంతరాయం కలగొచ్చని పేర్కొంది. తమ తీరం నుంచే వాటిని జలాల్లోకి ప్రవేశపెట్టగలమని వెల్లడించింది. 'దాంతో సుదీర్ఘకాలం గల్ఫ్ ప్రాంతమంతటా.. హార్మూజ్ జలసంధిలో నెలకొన్న పరిస్థితే ఉంటుంది. 1980ల్లో స్వల్ప సంఖ్యలో పరిచిన సీమైన్స్‌ను తొలగించడానికి 100 మైన్ స్వీపర్లు ప్రయత్నించి విఫలమైన సంగతిని మర్చిపోకూడదు' అని ఇరాన్ తన ప్రకటనలో శత్రు దేశాలకు గుర్తు చేసింది. ఇరాన్ చమురు ఎగుమతులకు ఖర్గ్ ఐలాండ్ అత్యంత కీలకమైనది. హార్మూజ్‌ను తెరిచే విషయంలో ఆ దేశంపై ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఆక్రమించాలని యుఎస్ యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దానికి తగ్గట్టే 4500 మంది సెయిలర్లు, మెరైన్లను మోహరించింది. హెలికాప్టర్లు, ఎఫ్-35 ఫైటర్ జెట్స్, సాయుధ ల్యాండింగ్ వెహికల్స్‌తో కూడిన బెటాలియన్‌ను కూడా పంపింది. అయితే ఈ మోహరింపు హార్మూజ్‌ను తెరవడానికా లేక ఖర్గ్ స్వాధీనానికా అనే దానిపై మాత్రం స్పష్టత లేదు.

## హార్మూజ్‌ను దాటి రావాలంటే రూ.18.76 కోట్లు కట్టాల్సిందే!

### కొత్త నిర్ణయం అమలుకు ఇరాన్ యోచన

**టెహ్రాన్,మార్చి 23:** ప్రపంచ చమురు వాణిజ్యానికి జీవనాడి వంటి హార్మూజ్ జలసంధిలో ఇరాన్ తీసుకున్న ఓ సంచలన నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం నెలకొన్న తరుణంలో, ఈ కీలకమైన జలసంధి గుండా ప్రయాణించే ప్రతి వాణిజ్య నౌక నుంచి 2 మిలియన్ డాలర్లు (సుమారు రూ.18.76 కోట్లు) ట్రాన్సిట్ ఫీజుగా వసూలు చేయాలని ఇరాన్ యోచిస్తోంది. ప్రస్తుతం అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో తమ రక్షణ వ్యయాలను భరించడానికి, జలసంధిలో భద్రతను పర్యవేక్షించడానికి ఈ నిధులు అవసరమని ఇరాన్ వాదిస్తోంది. ఫిబ్రవరి 28 నుంచి ఈ మార్గాన్ని మూసివేసి అంతర్జాతీయ వాణిజ్యానికి ఆటంకాలు సృష్టించిన ఇరాన్, ఇప్పుడు దాన్ని పాక్షికంగా తెరిచినా భారీ మూల్యం చెల్లించాల్సిందేనని పరోక్ష సంకేతాలు పంపుతోంది. ఈ చర్య ద్వారా పెద్ద ఎత్తున నిధులు సమీకరించుకోవాలనేది ఇరాన్ వ్యూహంగా కనిపిస్తోంది. రోజుకు లక్షల బ్యారెళ్ల ముడిచమురు రవాణా అయ్యే హార్మూజ్ జలసంధిలో ఈ టోల్ టాక్స్ గనుక అధికారికంగా అమలైతే దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుంది. ఇప్పటికే యుద్ధం కారణంగా పెరిగిన రవాణా ఖర్చులతో సతమతమవుతున్న షిప్పింగ్ సంస్థలపై ఇది పెను భారంగా మారనుంది. అంతిమంగా ఈ భారం ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు దారితీస్తుందని, ఇది అంతర్జాతీయ వాణిజ్యానికి కోలుకోలేని దెబ్బ అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, ఇరాన్ ప్రతిపాదనపై అంతర్జాతీయ షిప్పింగ్ కౌన్సిల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి ఏకపక్ష వసూళ్లు అంతర్జాతీయ సముద్ర చట్టాలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేసింది. ఇరాన్ తీరంలో ఇప్పటికే అనేక ట్యాంకర్లు నిలిచిపోవడంతో సరఫరా వ్యవస్థ స్తంభించిపోగా, ఈ కొత్త నిబంధన వివాదాన్ని మరింత జఠిలం చేస్తోంది.

## హార్మూజ్ నుంచి భారత్‌కు వస్తున్న మరో రెండు నౌకలు!

### పూర్తిస్థాయి భద్రత కల్పించిన ఇరాన్

**న్యూఢిల్లీ, మార్చి 23:** పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రస్థాయికి చేరినప్పటికీ భారత్‌కు ఇంధన సరఫరా విషయంలో భారీ ఊరట లభించింది. సుమారు 92,700 మెట్రిక్ టన్నుల వంటగ్యాస్‌తో వస్తున్న రెండు భారీ భారతీయ నౌకలు పైన్ గ్యాస్, జగ్ వసంత్‌లు హార్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. ఈ నౌకలు ప్రస్తుతం గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా రేవుల వైపు ప్రయాణిస్తున్నాయి. భారత్‌తో ఉన్న బలమైన దౌత్య సంబంధాల కారణంగా ఇరాన్ ఈ నౌకలకు ప్రత్యేక అనుమతి ఇవ్వడం విశేషం. ఇరాన్ నౌకాదళం ఈ నౌకలకు మార్గనిర్దేశం చేసి భద్రత కల్పించింది. యుద్ధ వాతావరణం నెలకొన్న గల్ఫ్ ప్రాంతంలో భారత ఇంధన భద్రతకు ఇది కీలక పరిణామంగా నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇంధన ధరల విషయానికి వస్తే, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బ్యారెల్‌కు 110 డాలర్లు దాటినా, కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం పడకుండా పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచింది. వాణిజ్య అవసరాలకు వాడే బల్క్ డీజిల్ ధరను లీటరుకు రూ.22 వరకు, ప్రీమియం పెట్రోల్ ధరను రూ.2 వరకు పెంచింది. ఈ నిర్ణయం రవాణా, తయారీ రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశంలో 15 నుంచి 20 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళనతో గ్యాస్ సిలిండర్లను ముందస్తుగా బుక్ చేసుకోవద్దని కేంద్ర పెట్రోలియం శాఖ సూచించింది. అమెరికా వంటి దేశాల నుంచి ఎల్పీజీ దిగుమతులను పెంచేందుకు చర్చలు జరుపుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, యుద్ధం ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో సాధారణ ఇంధన ధరలపైనా ప్రభావం పడొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## యుద్ధసమయంలో ఇరాన్‌కు భారత్ మానవతా సాయం



**టెహ్రాన్, మార్చి 23:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, భారత్ అందించిన మానవతా సాయంపై ఇరాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన సైనిక దాడులతో నష్టపోయిన తమ దేశానికి భారత్ అండగా నిలవడం గొప్ప విషయమని పేర్కొంది. గత వారం టెహ్రాన్‌పై జరిగిన దాడుల్లో 60 మందికి పైగా పౌరులు మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ కష్ట సమయంలో భారత్ వైద్య, అత్యవసర సహాయాన్ని అందించింది. ఈ సహాయాన్ని ఇరాన్ ఎప్పటికీ మర్చిపోదని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్‌తో మాట్లాడుతూ, యుద్ధం జరుగుతున్నప్పుడు ఇలాంటి సాయం అందించడం నిజమైన స్నేహానికి నిదర్శనమని ఆయన అన్నారు. భారత్ అధికారికంగా అందించిన సాయంతో పాటు, జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం జిల్లా ప్రజలు చూపిన చొరవ ఈ ఘటనలో ప్రత్యేకంగా నిలిచింది. పురుషులు, మహిళలు, చిన్నారులు అనే తేడా లేకుండా అందరూ విరాళాలు సేకరించారు. మహిళలు తమ బంగారం, వెండి ఆభరణాలు, రాగి పాత్రలను ఇవ్వగా కొందరు తమ జీవనాధారమైన పశువులను సైతం విరాళంగా ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. బుద్గాం వీధుల్లో ఇరాన్‌కు మద్దతుగా, ఇజ్రాయెల్, అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. ఇరాన్ ప్రజల కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పశ్చిమాసియాలో శాంతిని కోరుకునే భారత్ ఈ కష్ట సమయంలో ఇరాన్‌కు సాయం చేయడం ద్వారా తన దౌత్య స్వాతంత్ర్యాన్ని, మానవతా విలువలను చాటుకున్నట్లయింది. ముఖ్యంగా, బుద్గాం ప్రజల స్పందన భారతీయుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

## అమెరికాకు భారీగా తగ్గిన చట్టబద్ధమైన వలసలు

### భారత్, చైనాల అభ్యర్థులకే ఎక్కువ నష్టం




**వాషింగ్టన్, మార్చి 23:** అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం వీసా విధానాలను కఠినతరం చేయడంతో చట్టబద్ధమైన వలసలు భారీగా పడిపోయాయి. 2025 మొదటి ఎనిమిది నెలల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించగా, భారత్, చైనా దేశాల వారు తీవ్రంగా నష్టపోయారు. అధికారిక గణాంకాల ప్రకారం 2024 జనవరి ఆగస్టు కాలంతో పోలిస్తే 2025లో ఇదే సమయానికి అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ సుమారు 2.5 లక్షల వీసాలను తక్కువగా జారీ చేసింది. శాశ్వత నివాసం (గ్రీన్ కార్డు), తాత్కాలిక వీసాల జారీలో మొత్తం 11 శాతం తగ్గుదల నమోదైంది. ఈ తగ్గుదల విద్యార్థులు, ఉద్యోగులు, అమెరికా పౌరుల కుటుంబ సభ్యులకు ఇచ్చే వీసాలతో పాటు పర్యాటక వీసాలపై కూడా ప్రభావం చూపింది. భారత్, చైనా దేశాల వారికి జారీ చేసే వీసాల్లో సుమారు 84వేలు తగ్గుదల కనిపించింది. ముఖ్యంగా విద్యార్థి వీసాలు 30 శాతానికి పైగా పడిపోగా, ఎక్స్ఛేంజ్ విజిటర్ వీసాలు కూడా దాదాపు 30,000 తగ్గాయి. 19 దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలు, సోషల్ మీడియా ఖాతాల తనిఖీలతో కూడిన విస్తృత పరిశీలన, స్టేట్ డిపార్ట్‌మెంట్‌లో సిబ్బంది కొరత వంటివి ఈ తగ్గుదలకు ప్రధాన కారణాలని అధికారులు, విశ్లేషకులు చెబుతున్నారు. ఈ విషయంపై స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి టామీ పిగాట్ మాట్లాడుతూ వీసా అనేది హక్కు కాదు, ఒక సౌలభ్యం మాత్రమే. అమెరికా పౌరుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మరోవైపు, ఈ ఆంక్షలు అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ పోటీతత్వానికి నష్టం కలిగిస్తాయని హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన జాసన్ ఫర్మన్ వంటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మెటా సముద్రగర్భంలోని కేబుల్‌కు బ్రేక్!

### ఇరాన్‌తో ఉన్న యుద్ధభయాలే కారణం

**టెహ్రాన్, మార్చి 23:** పశ్చిమాసియాలో రాజుకుంటున్న యుద్ధం కేవలం గగనతలం, భూభాగాలకే పరిమితం కావడం లేదు. ప్రపంచ డిజిటల్ వ్యవస్థకు వెన్నెముకలాంటి సముద్రగర్భ డేటా కేబుళ్లపైనా ప్రభావం పడుతోంది. దీనికి తాజా నిదర్శనంగా, మెటా (ఫేస్‌బుక్ మాతృసంస్థ) చేపట్టిన ప్రతిష్ఠాత్మక 2 ఆఫ్రికా కేబుల్ ప్రాజెక్టు పనులు పర్షియన్ గల్ఫ్‌లో నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టర్ అల్కాటెల్ సబ్‌మెరైన్ నెట్‌వర్క్స్ ఫోర్స్ మేజర్ నోటీసులు జారీ చేయగా, కేబుల్ వేసే నౌక సౌదీ అరేబియా సమీపంలో చిక్కుకుపోయింది. ఈ పరిణామం కేవలం ప్రస్తుత డిజిటల్ మార్గాలకే కాదు, భవిష్యత్తులో నిర్మించ తలపెట్టిన పటిష్ఠమైన వ్యవస్థలకూ యుద్ధం ఆటంకం కలిగిస్తోందని స్పష్టం చేస్తోంది. ప్రపంచంలో రెండు ప్రాంతాలు ప్రస్తుతం డిజిటల్ కమ్యూనికేషన్లకు అత్యంత కీలకమైనవిగా ఉన్నాయి. అవే ఎర్ర సముద్రం, హార్మూజ్ జలసంధి. ఐరోపా, ఆసియా, ఆఫ్రికాలను కలిపే ఎర్ర సముద్రం ఇప్పటికే అత్యంత ముఖ్యమైన సబ్‌సీ డేటా కారిడార్‌గా ఉంది. గతంలో ఇక్కడ కేబుళ్లు దెబ్బతినడంతో భారత్, పశ్చిమాసియాలోని అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ వేగం తగ్గి, సేవలకు అంతరాయం కలిగింది. ఈ మౌలిక సదుపాయాలు ఎంత సున్నితమైనవో ఆ ఘటన గుర్తుచేసింది. ఇప్పుడు హార్మూజ్ జలసంధి కూడా ప్రాంతీయంగా అంతే ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఏఏఈ1, ఫాల్కన్, గల్ఫ్ బ్రిడ్జ్ వంటి కేబుల్ వ్యవస్థలు దీని గుండానే వెళుతున్నాయి. గల్ఫ్ దేశాలలోని డేటా సెంటర్లను అంతర్జాతీయ నెట్‌వర్క్‌లతో అనుసంధానించడంలో ఇది కీలకం. అందుకే హార్మూజ్‌ను ఇప్పుడు కేవలం చమురు మార్గంగానే కాకుండా కమ్యూనికేషన్స్ చౌక్‌పాయింట్‌గానూ చూస్తున్నారు. సముద్ర గర్భంలోని కేబుళ్లు 95శాతం పైగా అంతర్జాతీయ ఇంటర్నెట్ ట్రాఫిక్‌ను, రోజూ సుమారు 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లావాదేవీలను మోసుకెళతాయి. వీటిని లక్ష్యంగా చేసుకోవడం సులభం కాకపోయినా నౌకల లంగర్లు, ప్రమాదాలు, సైనిక కార్యకలాపాల వల్ల అవి దెబ్బతినే ప్రమాదం ఉంది. అయితే, ఈ యుద్ధం వల్ల ప్రపంచ ఇంటర్నెట్ మొత్తం ఆగిపోతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. ఒక మార్గం దెబ్బతింటే నెట్‌వర్క్‌లు ప్రత్యామ్నాయ మార్గాల్లో డేటాను మళ్లిస్తాయి. అసలైన ముప్పు ఇంటర్నెట్ పూర్తిగా ఆగిపోవడం కాదు, వేగం తగ్గడం (లేటెన్సీ), ప్రాంతీయంగా సేవలు నిలిచిపోవడం, డేటా ప్రవాహానికి తీవ్ర అంతరాయాలు కలగడం. కొత్త ప్రాజెక్టులు ఆలస్యం కావడం, ఇప్పటికే ఉన్న మార్గాలు బలహీనంగా ఉండటం, యుద్ధ వాతావరణం నెలకొనడం ఈ మూడు అంశాలు కలిసి డిజిటల్ ప్రపంచానికి కొత్త సవాల్ విసురుతున్నాయి. ఎర్ర సముద్రం, హార్మూజ్ జలసంధి మార్గాల్లో ఏకకాలంలో సమస్యలు తలెత్తితే దాని ప్రభావం మధ్యప్రాచ్యానికే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలు, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంటర్‌ప్రైజ్ నెట్‌వర్క్‌లపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. క్షిపణుల దాడులు వార్తల్లో నిలుస్తున్నాయి.

## క్షిపణులపై స్టిక్కర్లతో ఇరాన్ సరికొత్తప్రయోగం!

**టెహ్రాన్; మార్చి 23:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ, ఇరాన్ ఒక వినూత్న నిరసనకు తెరతీసింది. ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించిన తమ క్షిపణులపై ఇది అక్రమ యుద్ధం మాత్రమే కాదు అమానవీయం. థ్యాంక్యూ ప్రైమ్ మినిస్టర్ అంటూ శాంతి సందేశాన్ని రాసి పంపింది. ఈ చర్య ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంచెజ్ యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, గాజా, లెబనాన్‌లలో హింసను ఆపాలని, ఐరోపా దేశాలు ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరా నిలిపివేయాలని పిలుపునిచ్చారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలనే ఇరాన్ తమ వ్యూహంలో భాగంగా ఉపయోగించుకుంది. క్షిపణులపై శాంచెజ్ పేరుతో సహా ఆయన మాటలు రాసిన స్టిక్కర్ ను అంటించి ప్రయోగించింది. కేవలం సైనిక దాడికే పరిమితం కాకుండా, ఇజ్రాయెల్ వైఖరిని వ్యతిరేకిస్తున్న అంతర్జాతీయ నేతల గొంతుకను వారికి వినిపించడమే ఇరాన్ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఆయుధాల ద్వారానే శాంతి సందేశాన్ని పంపడం ఒకరకమైన దౌత్యపరమైన వ్యంగ్యంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇజ్రాయెల్ తన దాడులను ఆపకపోతే పరిణామాలు ఇలాగే ఉంటాయని పరోక్షంగా హెచ్చరించడమే దీని వెనుక ఉన్న అంతరార్థం. ఒకవైపు దౌత్యపరమైన చర్చలు జరుగుతున్నా, మరోవైపు క్షిపణి దాడులు ఆగకపోవడంతో మిడిల్ ఈస్ట్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది.

## సూడాన్‌లో పెచ్చుమీరుతున్న ఆధిపత్యపోరు

### ఆసుపత్రిపై డ్రోన్ దాడి, 64 మంది మృతి



**ఖర్టూమ్, మార్చి 23:** ఆఫ్రికా దేశమైన సూడాన్ లో సైన్యం, పారామిలిటరీ గ్రూప్ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ బలగాల మధ్య మూడేళ్లుగా ఆధిపత్యపోరు కొనసాగుతున్నది. ఈ క్రమంలోనే తాజాగా ఈస్ట్ దార్ఫూర్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన డ్రోన్ దాడిలో 64 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో 13 మంది చిన్నారులు, ఒక వైద్యుడు, ఇద్దరు నర్సులు ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ డ్రోన్ దాడిలో 64 మంది మరణించడమేగాక మరో 89 మంది గాయపడినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది. ఆస్పత్రులపై జరిగిన దాడుల్లో 2వేల మందికిపైగా మృతిచెందారు. ఇదిలావుంటే ఆస్పత్రిపై దాడికి పాల్పడింది సైన్యమేనని ఆర్ఎస్ఎఫ్ ఆరోపించింది. అయితే దీనిని సైన్యం పూర్తిగా ఖండించింది.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ట్రంప్ మొండి వైఖరే కారణం : సిఐఎ మాజీ డైరెక్టర్ ధ్వజం

**న్యూయార్కు, మార్చి 23:** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై సొంతగడ్డపైనే విమర్శల సెగ తగులుతోంది. ఇరాన్‌తో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు ట్రంప్ మొండి వైఖరి, దూకుడు నిర్ణయాలే కారణమని సాక్షాత్తూ అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ) మాజీ డైరెక్టర్ వ్యాఖ్యానించారు. ట్రంప్ విధానాల వల్ల అమెరికా ఇప్పుడు బయటకు రాలేని ఒక ఊబిలో చిక్కుకుపోయిందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ శక్తిసామర్థ్యాలను, వారి ప్రతిఘటనను అంచనా వేయడంలో వైట్‌హౌస్ పూర్తిగా విఫలమైంది. ట్రంప్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు దేశాన్ని వెనక్కి రాలేని స్థితికి నెట్టేశాయని మాజీ సీఐఏ చీఫ్ విశ్లేషించారు. దౌత్యపరమైన పరిష్కారాలను పక్కనపెట్టి, సైనిక చర్యలకే ట్రంప్ మొగ్గుచూపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఒకవేళ ఇరాన్ అణు విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తే, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, ఆస్తులే లక్ష్యంగా ఇరాన్ ఎదురుదాడి చేస్తుందన్న హెచ్చరికను తేలికగా తీసుకోరాదని గుర్తుచేశారు. హార్మూజ్ జలసంధి మూసివేతతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ, ట్రంప్ సర్కారు దానిని పట్టించుకోకపోవడంపై నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ యుద్ధ వాతావరణం వల్ల అమెరికా తన మిత్రదేశాల మద్దతును కూడా కోల్పోయే ప్రమాదం ఉందని, అగ్రరాజ్య ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉందన్నారు.

## భక్తులపై పూజారుల మూకుమ్మడి దాడి

### దాడి చేసిన అర్చకులు



**ముంబై, మార్చి 23:** మహారాష్ట్రలోని ఒక ఆలయంలో పూజారులు రెచ్చిపోయారు. కొందరు భక్తులను ఈడ్చుకెళ్లారు. వారిని కొట్టడంతోపాటు పిడిగుద్దులు కురిపించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ సంఘటన జరిగింది. స్థానిక జ్యోతిబా ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాంప్రదాయ ప్రదక్షిణ, హారతి సమయంలో కొందరు భక్తులు దురుసుగా ప్రవర్తించినట్లు ట్రస్ట్ ఆరోపించింది. హారతి కార్యక్రమానికి వారు అంతరాయం కలిగించినట్లు తెలిపింది. పదేపదే హెచ్చరించినప్పటికీ వారు వినిపించుకోలేదని, పూజారులపై గులాల్ విసిరారని ట్రస్ట్ ఆరోపించింది. ఈ గందరగోళంలో సాంప్రదాయ తలపాగాలు కిందపడిపోవడంతో పూజారులు ఆగ్రహించినట్లు వెల్లడించింది. మరోవైపు పరిస్థితి అదుపు తప్పడంతో సుమారు 20 మంది పూజారులు నిందితులైన భక్తులను ఆలయ ప్రాంగణంలోకి ఈడ్చుకెళ్లి కొట్టారు. భయంతో పారిపోవడానికి వారు ప్రయత్నించగా తిరిగి లాక్కెళ్లి మళ్ళీ కొట్టారు. ఆ భక్తులపై పిడిగుద్దులు కురిపించారు. దీంతో ఆ ఆలయం వద్ద గందరగోళం చెలరేగింది.

## 40కిపైగా ఇంధన క్షేత్రాలు ధ్వంసం.. 1970 నాటి చమురు షాక్‌లను మించిన నష్టం

**టెహ్రాన్, మార్చి 23:** కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ లేనంత ఇంధన సంక్షోభం ముప్పును ప్రపంచం ఇప్పుడు ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ఇంధన సంస్థ అధిపతి ఫాతిహ్ బిరోల్ హెచ్చరించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ ప్రాంతంలో 40కి పైగా ఇంధన క్షేత్రాలు ధ్వంసమయ్యాయని మీడియాతో మాట్లాడుతూ హెచ్చరించారు. దాంతో ఇంధన సరఫరాపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. '1970ల్లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు చవిచూసిన చమురు, గ్యాస్ సంక్షోభాలను మించిన పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతిపెద్ద ముప్పును ఎదుర్కొంటోంది. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాను. పశ్చిమాసియాలో ఇంధన మౌలిక సదుపాయాలు దెబ్బతింటే.. ఆ ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లపైనా తీవ్రంగా ఉంటుంది. దాంతో ధరల్లో అస్థిరత, సరఫరా కొరతకు దారితీస్తుంది' అని హెచ్చరించారు. ఇప్పటికే పలు ఆర్థిక వ్యవస్థలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మందగిస్తోన్న వృద్ధితో సతమతమవుతున్నాయి. ఈ సమయంలో ఆయన హెచ్చరికలు వచ్చాయి. ప్రపంచ చమురు వాణిజ్యంలో అతిపెద్ద సంక్షోభంగా 1973ని వ్యవహరిస్తారు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా వ్యవహరించిన అమెరికా, నెదర్లాండ్స్, పోర్చుగల్, దక్షిణాఫ్రికా.. తదితర దేశాలపై ఒపెక్ దేశాలు చమురు ఆంక్షలు విధించాయి. దీంతో పెట్రోల్, డీజిల్‌కు తీవ్ర కొరత ఏర్పడి.. అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్నాయి. 1970ల్లోనే ఇస్లామిక్ విప్లవం వల్ల మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఐరోపాకు గ్యాస్ సరఫరాకు అంతరాయం కలిగింది. వీటిని ఐఇఎ చీఫ్ ప్రస్తుత సంక్షోభంతో పోల్చారు. ప్రస్తుత పరిస్థితులు ఈ ఆయిల్, గ్యాస్ షాక్‌లన్నింటిని మిళితం చేసి.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలోకి నెడుతున్నాయన్నారు. ఈ అనిశ్చితి నుంచి బయటకు వచ్చేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు అత్యవసరమని ప్రపంచ దేశాలకు సూచించారు.

# చేనేత రంగాన్ని కాపాడుకోవడం మన బాధ్యత

- **విజయవాడ, ఏలూరు, విశాఖలో అవగాహన సదస్సులు**
- **హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, ఇండస్ట్రీస్, కామర్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి. సిసోడియా**

**సచివాలయం, మార్చి 23 ప్రభాతవార్త :** చేనేత రంగాభివద్ధి సంరక్షణకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, ఇండస్ట్రీస్, కామర్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి.సిసోడియా పేర్కొన్నారు. చేనేత పరిరక్షణ పథకం అమలు, హ్యాండ్లూమ్ చట్టం, 1985అమలుపై అవగాహన కార్యక్రమాన్ని జీఆర్టీ హోటల్లో ఏర్పాటు చేశారు. అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేనేత రంగంపై అవగాహన కల్పించేందుకు విజయవాడ, ఏలూరు, విశాఖపట్నం లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**చట్టాల అమలు - అక్రమాలపై నిఘా**

1985లో అమల్లోకి వచ్చిన హ్యాండ్ లూమ్ చట్టం చేనేత కార్మికుల రక్షణకు కవచం లాంటిదని సిసోడియా పేర్కొన్నారు. పవర్‌లూమ్ ఉత్పత్తులను హ్యాండ్‌లూమ్ పేరుతో విక్రయించి వినియోగదారులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హ్యాండ్లూమ్ చట్టాన్ని కఠినంగా అమలు చేసి, తప్పుగా లేబులింగ్ చేసి విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**గుర్తింపు చిహ్నాలపై అవగాహన**

వినియోగదారులు అసలైన చేనేత వస్త్రాలను గుర్తించేందుకు సిల్క్‌మార్క్, హ్యాండ్‌లూమ్ మార్క్,.జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ వంటి గుర్తింపు చిహ్నాలపై విస్తృత అవగాహన కల్పించాల్సి అవసరం ఉందని ఆయన స్పష్టంచేశారు.

**కార్మికుల సంక్షేమం ఆర్థిక భరోసా**

చేనేత కార్మికులు రోజుకు 10-12గంటలు కష్టపడినా తగిన ఆదాయం లభించక పోవడం ఆందోళనకరం, ఒక చీర నేయడానికి 4-5రోజులు, బెడ్‌షీట్ నేయడానికి



2రోజులు పడుతుందన్నారు. అందుకే పవర్‌లూమ్ ధరలతో చేనేత పోటీ పడడం కష్టం అని ఆయన అభిప్రాయపడ్డారు. చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం శాఖ మరింత చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**అంతర్జాతీయ గుర్తింపు**

భారతీ చేనేతకు ప్రపంచ వ్యాప్తంగా విశేష గౌరవం ఉందని, ఈ వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చేనేత విశిష్టతను ప్రజలకు తెలియజేయాలని అధికారులను కోరారు. ముందుగా జాయింట్ డైరక్టర్ గుత్తు రాజారావు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేనేతకు ఎనలేని ప్రాముఖ్యాన్ని అందిస్తుంద న్నారు. అనంతరం సాహు, సుబసుత్, హరిబాబు, సాహు మోహన్‌లు చేనేత సిల్క్ మార్కు, హ్యాండ్‌లూమ్ మార్క్, 1985లో వచ్చిన చేనేత చట్టంపై అధికారులకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ అధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## జననగణనలో పొరపాట్లకు తావివ్వొద్దు

### తిరుపతి కమిషనర్ మౌర్య

**తిరుపతి,మార్చి 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నియోజకవర్గంలో జననగణనలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా, పటిష్టంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులు, సిబ్బందికి సూచించారు. జనాభా గణన 2027 పై కచ్చపి ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కమిషనర్ ఎన్. మౌర్య ప్రారంభించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జనన గణన చేసేందుకు 25 మందిని ఎంపిక చేశామని వారికి మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మీరందరూ శ్రద్దగా అన్ని విషయాలను నోట్ చేసుకుని మీ కింద వచ్చే వారికి తెలిపి క్షేత్రస్థాయిలో జనన గణన చేయాలని తెలిపారు. 16 సంవత్సరాల తరువాత జరుగుతున్న ఈ జననగణన లో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పటిష్టంగా నిర్వహించి సమగ్రమైన సమాచారాన్ని సేకరించాలని పిలుపునిచ్చారు. రెండు దశల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, మాస్టర్ ట్రైనర్లు రమాదేవి, సుధారాణి, ఉదయ్, తదితరులు ఉన్నారు.

## యనమలకుదురు శివాలయంలో...
## చోరీతోపాటు అవకతవకలపై విచారణ

**విజయవాడ,మార్చి23 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ సమీపంలోని పెనమలూరు మండలం యనమలకుదురు శివాలయంలో నగదు చోరీతోపాటు అవకతవకలపై విచారణ చేస్తున్నామని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ లలిత తెలిపారు. దీనిపై విచారణ పూర్తి చేసి 15 రోజుల్లో కమిషనర్‌కి నివేదిక అందజేస్తామన్నారు. గత ఐదు సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను సైతం పరిశీలిస్తామని చెప్పారు. ఆలయ ఈవో భవానీ, అర్చకులు కలిసి రూ.10 లక్షలకు పైగా నగదు మాయం చేసినట్లు వస్తున్న ఆరోపణలపై అధికారులు ఇప్పటికే విచారణ ప్రారంభించారు. ఈ వ్యవహారంలో ఆలయ ప్రధాన పూజారి సాగర్, ఉద్యోగులు పూర్ణ రోశయ్యలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇక ఈ ఆలయ ఈవో భవాని ప్రస్తుతం పరారీలో ఉన్నారని తెలుస్తోంది. దేవాలయంలోని అంతరాలయం హుండీ తాళంకు మారు తాళం తయారు చేసి.. భారీగా నగదు చోరీ చేసినట్లు సమాచారం. ఇటీవల మద్యం దుకాణంలో ఈ చోరీకి పాల్పడిన ఆలయ సిబ్బంది మధ్య పంపకాల్లో తేడా వచ్చింది. దీంతో ఈ వ్యవహారం బహిర్గతమైంది. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్ అయింది. విచారణ చేపట్టాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఐదుగురు సభ్యులతో కమిటీని దేవాదాయ శాఖ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ.. ఆలయ ఉద్యోగులు, అర్చకులను విచారిస్తుంది. అలాగే ఆలయంలోని పలు రికార్డులను సైతం పరిశీలిస్తుంది.

## నడిరోడ్డుపై ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం

### గుడివాడలో ఘటన ఇద్దరు సురక్షితం

**విజయవాడ, మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా గుడివాడలో నడిరోడ్డుపై ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధమైంది. ఈ ఘటనలో ఇద్దరు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. ఒక మహిళ తన ప్రయాణం కోసం ఆన్‌లైన్‌లో ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ బుక్ చేసుకుంది. బుకింగ్ యాక్సెప్ట్ చేసిన డ్రైవర్ తన స్కూటర్‌తో ఆమె ఉన్న చోటికి వచ్చాడు. ఆ మహిళ వాహనం ఎక్కి కూర్చుంది. వారు నిర్దేశిత గమ్యం వైపుకు వెళ్తున్నారు .ఈ క్రమంలో ఆ స్కూటర్ గుడివాడలోని రైల్వే వంతెన చేరుకునే సమయంలో స్కూటర్ సీటు కింద నుంచి సన్నగా పొగలు రావడం వెనుక కూర్చున్న మహిళ గమనించింది. దట్టమైన పొగను చూసి వెంటనే స్కూటర్ ఆపాలని డ్రైవర్‌కు చెప్పింది. దాంతో వాహనాన్ని అతను ఆపేశాడు. వెంటనే ఇద్దరు దూరంగా పరుగులు దీసారు. చూస్తుండగానే బైక్ నుంచి ఒక్కసారిగా భారీగా మంటలు ఎగసిపడ్డాయి. బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ లేదా పేలుడు జరగడంతో మంటలు క్షణాల్లో వాహనం మొత్తాన్ని చుట్టు ముట్టాయి. ఎలక్ట్రిక్ స్కూటర్ అలా కాలిపోతున్న దృశ్యాలను



చూసి స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఫైర్ ఇంజిన్‌తో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే ఎలక్ట్రిక్ స్కూటర్ పూర్తిగా కాలిపోయింది. ఎలక్ట్రిక్ స్కూటర్ కాలిపోయినప్పటికి ప్రాణాలతో బయట పడిన ఇద్దరు ఊపిరి పీల్చుకున్నారు.

## కదిరిలో స్నపన తిరుమంజనం ఉత్సవంలో పల్లె సింధూర రెడ్డి

**కదిరి, మార్చి 23 ప్రభాతవార్త:** ఖాద్రి లక్ష్మినరసింహస్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజల పైన సిఎం చంద్రబాబుకు ఎల్లప్పుడు ఉండాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆకాంక్షించారు.

శ్రీ కదిరి లక్ష్మి నరసింహ స్వామి ఆశీస్సులతో రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం చంద్రబాబు మరో 20 ఏళ్ల కొనసాగాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరుకున్నారు. అంతకు ముందు శ్రీ మత్ కదిరి లక్ష్మి నరసింహ స్వామి వారి పవిత్ర బ్రహ్మో త్సవాలలో భాగంగా స్నపన తిరుమం జనం ఉత్సవం (16 రోజుల పండుగ) సందర్భంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఏర్పాటుచేసిన, స్నపన తిరుమంజన ఉత్సవ ఉభయదారులు విష్ణు వర్ధన్ రెడ్డి ఆత్మీయ ఆహ్వానం



శ్రీ కదిరి లక్ష్మినరసింహస్వామి దర్శించుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

మేరకు సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేతో పాటు నియోజవర్గ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ఆలయ పూజారులు వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఒంటిమిట్టలో ఏర్పాట్లు 30లోగా పూర్తి చేయాలి

### సీతారాముల కళ్యాణం పనులపై టిటిడి జేఈవో వీరబ్రహ్మం
### బ్రహ్మోత్సవాల బందోబస్తుపై కడప ఎస్పీ సమీక్ష

**రాజంపేట, మార్చి23 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంచినాలతో నిర్వహించే ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవా లలో భాగంగా ఏప్రిల్ ఒకటిన నిర్వహించే సీతారాముల కళ్యాణం ఏర్పాట్లు ఈ నెల 30లోగా పూర్తి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవో వి.వీరబ్రహ్మం ఆదేశం చారు. సోమవారం ఆయన ఏర్పాట్లపై సమగ్ర తనిఖీలు నిర్వహించారు. అధికారులతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలు, కళ్యాణ వేదిక వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నాలుగు మాడ వీధులు, క్యూలైన్లు, యాగశాల, పోటు, సాంస్కృతిక వేదికలను పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకో



వాలని సూచించారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ఆలయ ప్రాంగణంలో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయడం, తాగునీటి సదుపాయాలను విస్తరించడం, భక్తులకు చల్లని వాతావరణం కల్పించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తులను ఆకట్టుకునేలా లేజర్ లైటింగ్, ఎల్ఈడి తోరణాలు ఏర్పాటు చేసి ఉత్సవాలకు ఆధ్యాత్మిక శోభను పెంచాలని, ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణలు చేపట్టి దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం అన్నప్రసాద భవనాన్ని పరిశీలించిన జేఈఓ, భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సీతారాముల కళ్యాణాన్ని ప్రతిబింబించేలా భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కళ్యాణ వేదికపై తెలుగుదనం ఉట్టిపడేలా పుష్పాలంకరణలు చేయాలన్నారు. ఆలయం, క్యూలైన్లు, అన్నప్రసాద వితరణ కేంద్రాలు, గ్యాలరీలలో భక్తులకు సేవలు అందించేందుకు తగినంత మంది శ్రీవారి సేవకులను ఏర్పాటు చేయాలని సిపిఆర్ఓ డా. టి. రవికి సూచించారు. ఒంటిమిట్ట శ్రీరామ బ్రహ్మోత్సవాలపై కడప ఎస్పీ సమీఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు కడప జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 26 నుండి ప్రారంభం కానున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరాములవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్.పీ సోమవారం కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కోదండ రామాల యం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలు, కళ్యాణ వేదిక పరిసరాల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలపై రాజంపేట ఏ.ఎస్.పీ రామనాథ్ హెగ్డేకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా వాహనాలు వెళ్లేలా ప్రణాళికా బద్దంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి: సీపీఎం

### విజయవాడలో విప్లవ వీరుల వర్థంతి కార్యక్రమం

**విజయవాడ, మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** సామ్రాజ్యవాదం ప్రపంచదేశాలపై యుద్ధాలకు దిగుతూ సామాన్య ప్రజలను చంపుతూ ప్రమాద కరంగా మారిందని, స్వాతంత్ర్య పోరాటవీరులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ స్ఫూర్తితో దాని కి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం కేంద్ర కమి టీ సభ్యులు డి. రమాదేవి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత విప్లవ వీరుల చిత్రపటాలకు రమాదేవి, వైవి తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రమాదేవి మాట్లాడారు. సోషలిస్టు సమాజం అయితేనే ప్రజలకు స్వేచ్ఛ సమానత్వం ఉంటుందని భగత్‌సింగ్ నమ్మారని అన్నారు. వ్యక్తులను చంపడం కాదని, బ్రిటీష్ ప్రభుత్వంపోయి స్వదేశీ పాలన రావాలని కోరుకున్నారని తెలిపారు. ప్రస్తుతం సామ్రాజ్యవాదం ఇరాన్‌పై దాడి చేయడం ద్వారా ప్రపంచ పెత్తనాన్ని నిలబెటుకునేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. దీని ప్రభావం భారతదేశంపై అనేక రూపాల్లో ఉందని తెలిపారు. యుద్ధాలు పోవాలంటే సామ్రాజ్య వాదం పోవాలని, సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం హిందూత్వం పేరిట విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, వాటిని కూడా ఎదుర్కోవాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భగత్ సింగ్ నిరంతరం అధ్యయనం చేసేవారని, ప్రపంచ పరిణామాలు మన దేశంపై ఎలా ఉంటుందో అధ్యయనం చేసే వారన్నారు. సోషలిస్టు భావజాలాన్ని నిరంతరం పరిశీలించారని, అయితే నేటి పాలకులు సోషలిస్టు అనే పదాన్నే రద్దు చేయాలని చూస్తున్నారని, పైగా ఆయనకు పోటీగా వీరసావర్కర్‌ను ముందుకు తీసుకొస్తున్నారని తెలిపారు. నేటి పాలకవర్గాలు ప్రజలను పట్టించుకోకుండా, యువతను పక్కదారి పట్టించేందుకు నిర్వీర్యం చేసేందుకు మద్యం, మాదకద్రవ్యాలు, గంజాయి వంటివాటిని ముందుకు తెస్తున్నా యని తెలిపారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.



## వేసవిలో రెండో ఘాట్ రోడ్డు పునర్నిర్మాణం

### వాహన దారులు సమయ పాలన, జాగ్రత్తలు తప్పని సరి

**తిరుమల, మార్చి 23 ప్రభాత వార్త ప్రతినిధి:** వేసవి సెలవులకు ముందే తిరుమల ఘాట్ రోడ్ల అభివృద్ధి దిశగా టిటిడి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే రెండో ఘాట్ రోడ్డుపై మరమ్మతులు, తారు రోడ్డు పునర్నిర్మాణం పనులు మొదలయ్యాయి. ఈ పనులు నాణ్యతతో, దీర్ఘ కాలం మన్నిక ఉండేలా ఇంజనీరింగ్ అధికారులు చూస్తున్నారు. ఈ పనులు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. 18కిలో మీటర్ల దూరం ఉన్న రెండో ఘాట్‌లో సుమారు రెండు నెలల పాటు అభివృద్ధి పనులు జరగనున్నాయి. పనులు జరుగుతున్న కారణంగా భక్తులు, తిరుమల తిరుపతి స్థానికులు ఘాట్ రోడ్‌లో నిదానముగా, జాగ్రత్తగా వెళ్లాలని టిటిడి కోరింది. అంతేగాక ఘాట్‌లో ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని తిరుమల ట్రాఫిక్ సిఐ హరి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. రోడ్డు పనులు జరిగే సమయంలో వాహనదారులు అసౌకర్యం కలిగించకుండా టిటిడి ఇంజనీరింగ్ అధికారులకు సహకరించాలని కోరారు.

## విజయవాడలో తక్కువ ధరకు బంగారం పేరిట మోసగించే ముఠా ఆటకట్టించిన పోలీసులు

**విజయవాడ,మార్చి23 ప్రభాతవార్త ప్రతినిధి :** విజయవాడ నగరంలో అమాయకులను లక్ష్యంగా చేసుకుని, తక్కువ ధరకు బంగారం విక్రయిస్తామనే ఆశ చూపి మోసం చేయాలనుకున్న ముఠాను విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ కేసులో ప్రధానంగా ఓ మాజీ హోంగార్డ్, ఎస్సై వేషంలో వచ్చి దబాయించడం సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి, విజయవాడకు చెందిన వర్మ అనే వ్యక్తి తక్కువ ధరకు బంగారం ఇస్తానని ఆశ చూపించాడు. బయట మార్కెట్ ధర కంటే చాలా తక్కువకే ఇస్తానని నమ్మించి ప్రసాద్‌ను హైదరాబాద్ నుంచి విజయవాడకు రప్పించాడు. ప్రసాద్, వర్మలు బంగారం డీల్ కోసం కలుసుకున్న సమయంలో, పక్కా ప్లాన్ ప్రకారం ఓ ముఠా ఎంట్రీ ఇచ్చింది. ఈ ముఠాలో హరికృష్ణ అనే మాజీ హోంగార్డ్.. సబ్ ఇన్‌స్పెక్టర్ యూనిఫాం లో వచ్చాడు. అతడితో పాటు కిరణ్, సురేశ్ అనే వ్యక్తులు కానిస్టేబుల్స్ వేషంలో వచ్చారు. అక్రమంగా బంగారం కొంటున్నారనే నెపంతో ప్రసాద్‌ను బెదిరించి, అతని వద్ద ఉన్న నగదును కాజేయాలనేది వీరి ప్లాన్. పోలీసులుగా నమ్మించి భయభ్రాంతులకు గురిచేయాలని వారు భావించారు. ఈ వ్యవహారంలో బాధితుడు ప్రసాద్ ముందే అప్రమత్తమయ్యాడు. వర్మ ప్రవర్తనపై అనుమానం రావడంతో, అతను ముందే విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందించాడు. నిందితులు ప్రసాద్‌ను ట్రాప్ చేసే సమయంలో, అప్పటికే అక్కడ మాటు వేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేశారు. మాజీ హోంగార్డ్ హరికృష్ణతో పాటు వర్మ, కిరణ్, సురేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న నకిలీ ఐడెంటిటీ కార్డులు, పోలీసు యూనిఫాంలను స్వాధీనం చేసుకున్నారు. బంగారాన్ని గుర్తింపు పొందిన నగల దుకాణాల్లోనే కొనాలని సూచించారు. తెలియని వ్యక్తులతో రహస్యంగా నగదు లావాదేవీలు జరపడం ప్రమాదకరమని పోలీసులు హెచ్చరించారు.

## పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, మార్చి 23, ప్రభాతవార్త :** ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో వస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఎన్‌టిఆర్ జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. సోమవారం ప్రజల నుండి మొత్తం 112 అర్జీలు రాగా వాటిలో రెవెన్యూ 31, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ 24, పోలీస్ శాఖ 14, పంచాయతీరాజ్ 9 అర్జీలు రాగా మిగిలినవి ఇతరశాఖలకు సంబంధించినవి ఉన్నాయి. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలపై సత్వరమే విచారణ జరిపి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వేసవి ఎండలు ముదురుతున్నందున వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశా సూచించారు. వడదెబ్బకు ముందస్తు జాగ్రత్తలే సరైన మందు అని పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వడదెబ్బ నివారణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో రూపొందించారు.

## భూసమీకరణలో 6.28ఎకరాలు అందచేసిన రైతు అంజయ్య

**విజయవాడ, మార్చి 23, ప్రభాతవార్త :** రాష్ట్రరాజధాని అమరావతి నిర్మాణానికి రెండవిడత భూసమీకరణకు రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తూనే ఉన్నారు. తాజాగా తాడికొండ ప్రాంతంలోని పెదమద్దూరు గ్రామరైతు కంతేటి అంజయ్య 6.28 ఎకరాల భూమిని భూసమీకరణలో ఇచ్చారు. ఈమేరకు సోమవారం భూమి పత్రాలను సిఆర్‌డిఏ అధికారులకు అందచేసారు. పెదమద్దూరు సిఆర్‌డిఏ యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భూమి పత్రాలను డిప్యూటి కలెక్టర్ ఏసురత్నంకు అందచేసారు. అనంతరం అధికారులు భూసమీకరణ ప్రక్రియలో భాగంగా ఫారం-2ను, రసీదును రైతుకు ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజధాని అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్నారని కొనియాడారు. చంద్రబాబునాయుడుపై తనకు నమ్మకం ఉందని, ఆయన నేతృత్వంలో అమరావతి ప్రపంచస్థాయి నగరంగా రూపొందుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేసారు. ఈకార్యక్రమానికి హాజరైన అఖిలభారత పంచాయతీరాజ్ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు రాజధానికి భూమి ఇచ్చిన రైతు అంజయ్యను అభినందించారు. ఐదుకోట్ల ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు ముందుకు వచ్చి భూములు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రెండవ విడత భూసమీకరణ కోసం ఎంపిక చేసిన గ్రామల రైతులు, కౌలురైతుల వివరాలు, ప్లాట్‌ల కేటాయింపు ప్రాంతాలు, బ్యాంకు రుణాలకు సంబంధించిన అంశాలను లిఖితపూర్వకంగా రైతులకు తెలియచేయాలని మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేసారు. ఈఅంశాలపై రైతులకు స్పష్టతనిస్తే మరింత మంది భూసమీకరణకు ముందుకు వస్తారని అభిప్రాయపడ్డారు.

## వాటర్ ప్లాంట్ల అనధికారిక విద్యుత్ వాడకంపై కొరడా

### ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,మార్చి 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ సంస్థ పరిధిలో వాటర్ ప్లాంట్లకు అనధికారికంగా విద్యుత్తును వినియోగిస్తున్నారని అందిన ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసులో సోమవారం ఉదయం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నుంచి ఒక వినియోగదారుడు మాట్లాడుతూ ఆ ప్రాంతంలో నిర్వహిస్తున్న రెండు వాటర్ ప్లాంట్‌లు రూ. లక్షల్లో విద్యుత్ బిల్లులు బకాయిలు పడ్డాయని, బిల్లు చెల్లించలేదని ఆ సర్వీసులను డిస్కనెక్ట్ చేసినప్పటికీ అనధికారికంగా విద్యుత్తును వినియోగించుకుంటూ సంస్థకు నష్టం కలిగిస్తున్నారని తెలియజేశారు. ఈ అంశంపై శివశంకర్ మాట్లాడుతూ దీనిపై విచారణ నిర్వహిస్తామని, సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని



తెలిపారు. సంస్థకు నష్టం కలిగించే ఇటువంటి చర్యలను ఉపేక్షించబోమని తెలిపారు. అదేవిధంగా సంస్థ అధికారులు సిబ్బంది పనితీరు, ఆర్థిక లావాదేవీలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమం ద్వారా 50 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. దీని ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333 కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.









## ప్రపంచంలో నెంబర్ వన్

# ఉక్కు పరిశ్రమ..

**పాయకరావుపేట వైపు ప్రపంచం చూసే విధంగా తీర్చిదిద్దుతా.. ఉక్కుమనిషి లక్ష్మీ మిట్టల్ ..కొత్త చరిత్ర సృష్టిస్తాం- విశాఖ ఉక్కును కాపాడుకున్నాం.. అతిపెద్ద ఉక్కు పరిశ్రమ : అర్సెలార్ మిట్టల్- నిప్పన్ స్టీల్**











(నక్కపల్లి, ప్రభాతవార్త)

ప్రపంచంలోనే అర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఫ్యాక్టరీ ఒకటని ఇది ఒక చరిత్రని, ప్రపంచంలోనే నెంబర్ వన్ పరిశ్రమగా తీర్చిదిద్దే విషయంలో అన్ని విధాలుగా సహకరిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ కు సోమవారం మధ్యాహ్నం భూమి పూజ కార్యక్రమం మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర గనుల శాఖ మంత్రి హెచ్ డి కుమార్ స్వామి లతో కలిసి లక్ష్మి మిట్టల్ ,ఆదిత్య మిట్టల్ సారాధ్యంలో నిర్వహించారు. అనంతరం వేదిక మీదకు చేరుకుంటుండగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లను చూసిన వేలాదిమంది సభలో ఉన్న ప్రజలు, రైతులు, మహిళలు, విద్యార్థులు థాంక్యూ సీఎం.. థాంక్యూ పవన్ కళ్యాణ్ 8వ పేజీలో

# పరిశ్రమ పునరుద్ధరణకు సమిష్టి కృషి అవసరం



విశాఖపట్నం, మార్చి 23 ప్రభాతవార్త

విశాఖ ఉక్కు పరిశ్రమ పునరుద్ధరణకు సమిష్టి కృషి అవసరమని, రాబోయే రెండేళ్లు ఇందుకు ఎంతో కీలకమని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకు మిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. పరిశ్రమ అభివృద్ధి దిశగా తీసుకునే నిర్ణయాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ న సందర్శిం చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మని కలుసుకుని విశాఖ ఉక్కు పరి శ్రమకు సంబంధించిన పలు కీలక అంశాలను సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ పరిశ్రమ పనితీరు, మార్కెట్ పరిస్థితులు, సిబ్బంది వ్యవహారాలు స్థానిక సమస్యలపై తన అభిప్రాయాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మార్కెట్ వ్యూహం తోపాటు ధరలు గతంలో ఉత్పత్తులు తక్కువ ధరలకు విక్రయించిన పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటూ, ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున భవిష్యత్తులో ఉత్పత్తులను తక్కువ ధరలకు విక్రయించ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెమీ ఉత్పత్తులపై సమీక్ష:సెమీ-ఫినిష్డ్ ఉత్ప త్తుల విక్రయం లాభదాయకమా కాదా అనే విషయంపై సమగ్ర విశ్లేషణ అవసరమని, లాభం లేకపోతే ఉత్పత్తి పరిమాణాన్ని పునః పరిశీలించాలని కోరారు. వడ్డీ భారం తగ్గించే దిశగా బ్యాంకులతో ఉన్నత స్థాయి చర్చలు జరపాలని, గత మూడు నెలలుగా పరిశ్రమ క్యాష్ పాజిటివ్ దిశగా సాగుతోందని వివరించారు. సరైన వ్యక్తి సరైన స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అనుభవజ్ఞులైన సిబ్బందిని కీలక విభాగాల్లో నియమించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. సిబ్బంది తగ్గింపు ప్రక్రియ: వీఆర్ఎస్ ఇతర మార్గాల్లో సిబ్బంది తగ్గింపు శాస్త్రీయంగా, విభాగాల వారీగా 8వ పేజీలో






# సృష్టి క్షేత్రాన్ని ఆపేందుకు తిరుగుతున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

**దైవ కార్యానికి ఆటంకాలు తగవు.. సృష్టి క్షేత్ర నిర్మాణాన్ని అడ్డుకోవద్దు!**
**-ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించిన నర్సీపట్నం అర్చకులు, ప్రజలు**



విశాఖపట్నం, మార్చి 23 ప్రభాతవార్త

అత్యంత ప్రతిష్టాత్మకంగా నర్సీపట్నంలో నిర్మిస్తున్న "సృష్టి క్షేత్రం" నిర్మాణాన్ని అడ్డుకునేందుకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శతవిధాలా ప్రయత్నిస్తున్నారని. ఈ దైవ కార్యాన్ని ఎలాగైనా ఆపాలని సోమవారం అధికారుల చుట్టూ తిరుగుతూ ఫిర్యాదులు చేయడంపై 8వ పేజీలో









# శెట్టిబలిజల దైవం దొమ్మేటి వెంకటరెడ్డి



**గత వైసిపి పాలనలో బిసిలను వెంటపడి వేధించారు**
**6నెలల్లో దొమ్మేటి విగ్రహాన్ని ఏర్పాటుచేస్తాం**
**శెట్టిబలిజ కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపడతాం**
**దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సభలో మంత్రి నారా లోకేష్**

విశాఖపట్నం మార్చి 23 ప్రభాతవార్త

శెట్టిబలిజల దైవం దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి. శెట్టిబలిజ సంక్షేమ సంఘం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. శెట్టిబలిజల్లో చైతన్యం తీసుకొచ్చి హక్కుల సాధన కోసం ఉద్యమించారని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కొనియాడారు. విశాఖపట్నం తెలుగుదేశం కార్యాలయంలో దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... శెట్టి బలిజల ఆత్మగౌరవం దొమ్మేటి వెంకటరెడ్డి గారి జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను. దొమ్మేటి వెంకటరెడ్డి గారి జయంతిని ఈరోజు రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నాం. దొమ్మేటి వెంకటరెడ్డి జీవితం మనకు ఆదర్శం. బ్రిటిష్ పాలనలో శెట్టిబలిజలు బర్మా వలస వెళ్లారు. వారిలో దొమ్మేటి 8వ పేజీలో




# పరిశ్రమ పునరుద్ధరణకు సమిష్ఠ కృషి అవసరం











## విశాఖలో మంత్రి లోకేష్ ప్రజాదర్బార్

### 84వ రోజు వినతిపత్రాల స్వీకరణ

విశాఖపట్నం, ప్రభాతవార్త

రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖ టీడీపీ కార్యాలయంలో 84వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. విశాఖ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున వచ్చి వినతిపత్రాలు అందజేశారు. తమకు వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని ఆంధ్రా యూనివర్సిటీ మినిమం టైమ్ స్కేల్ ఉద్యోగులు కోరారు. ఇటీవల విడుదల చేసిన జాబ్ కేలండర్ లో విద్యుత్ శాఖ ఏఈఈ, జెఎల్ఎం పోస్టులను కూడా కలిపి నోటిఫికేషన్ ఇవ్వాలని పలువురు అభ్యర్థులు విన్నవించారు. కొత్తగా ప్రారంభించబోయే భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో తమ సేవలను ఉపయోగించు కోవాలని విశాఖ ఎయిర్ పోర్టు పోర్టర్లు వినతిపత్రం సమర్పించారు.






## ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనస్వాగతం

విశాఖపట్నం, ప్రభాతవార్త

నక్కపల్లి వద్ద ఏర్పాటు చేయనున్న అర్సిలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయడానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు,రాష్ట్ర బీజేపీ మీడియా కో ఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికారు.రాష్ట్ర పారిశ్రామికాభి వృద్ధికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని అభినందించారు.



## లంచానికి లాక్..!

**125వ వార్డు, లలితానగర్ సచివాలయంలో ఉచ్చు -రూ.80 వేలు లంచం తీసుకుంటూ అక్కయ్యపాలెంలో ఉద్యోగి పట్టివేత -సచివాలయాల్లో అవినీతిపై పెరుగుతున్న ఫిర్యాదులు**

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖ నగరంలో సచివాలయ వ్యవస్థలో అవినీతి ఆరోపణలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. అక్కయ్యపాలెం వార్డు సచివాలయంలో రూ.80 వేల లంచం తీసుకుంటూ వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ పైలా రాజేష్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కడం సంచలనం రేపింది.అక్కయ్యపాలెం పరిధిలోని 125వ వార్డు లలితానగర్ సచివాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. వార్డు ఎడ్యుకేషన్ కం డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ పైలా రాజేష్ స్థిరాస్తి సెటిల్‌మెంట్ డీడ్ ప్రాసెస్ చేయడానికి రూ.90 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు వచ్చింది. ఫిర్యాదుదారు గణేష్‌తో చివరకు రూ.80 వేల వద్ద ఒప్పందం కుదిరింది.లంచం ఇవ్వడానికి ఇష్టపడని గణేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో, గుర్తు పెట్టిన నోట్లతో ట్రాప్ ఏర్పాటు చేశారు. సచివాలయంలోనే రూ.80 వేల నగదు స్వీకరిస్తుండగా పైలా రాజేష్‌ను అధికారులు పట్టుకున్నారు. అనంతరం అతన్ని కోర్టులో హాజరు పరచేందుకు చర్యలు చేపట్టారు.ఈ ట్రాప్‌లో ఏసీబీ డీఎస్పీలు రమణమూర్తి, హర్షిత, సీఐలు శ్రీనివాస్, వెంకటరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు ప్రజలకు 1064 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఏసీబీకి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

### ఇటీవలి కాలంలో ఏసీబీకి చిక్కిన సచివాలయ సెక్రటరీలు

విశాఖలో ఇటీవల కాలంలో పలువురు సచివాలయం సఖియేటర్లు ఏసీబీకి చికినా సంఘటనలో ఎన్నో ఉన్నాయి.. గత రెండేళ్లుగా ఏసీబీకి పట్టుబడిన సచివాలయం సెక్రటరీ వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక నెహ్రూ నగర్ వార్డు సచివాలయంలో వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా పనిచేస్తున్న గణేశ్, ఇంటి పన్ను, నీటి పన్ను పేరు మార్పు కోసం రూ 25 వేల లంచం డిమాండ్ చేశాడు. ముందుగా రూ.9 వేల తీసుకుని, మిగిలిన రూ.16 వేల స్వీకరిస్తుండగా ఏసీబీకి చిక్కాడు.తగరపువలస పరిధిలో గ్రామ సచివాలయ కార్యదర్శి వై. స్వామినాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ముగడ రాజు కలిసి రికార్డుల పేరు మార్పు కోసం రూ.60 వేల డిమాండ్ చేసి, రూ.30 వేల తీసుకుంటుండగా పట్టుబడ్డారు.ప్రశాంతినగర్ వార్డు అడ్మిన్ సెక్రటరీ డి. భాస్కరరావు, ప్రాపర్టీ ట్యాక్స్ పేరు మార్పు కోసం రూ.40 వేల అడిగి, రూ.20 వేల తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.

### సచివాలయాల్లో అవినీతి పై పెరుగుతున్న ఫిర్యాదులు

రాష్ట్రవ్యాప్తంగా భూమి రికార్డులు, పన్నుల మార్పులు, రిజిస్ట్రేషన్ సంబంధిత సేవల్లో లంచాల ఆరోపణలు ఎక్కువవుతున్నాయని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. విశాఖ జిల్లాలో ముఖ్యంగా స్థిరాస్తి, ట్యాక్స్, రికార్డు మార్పులే ఎక్కువ ట్రాప్ కేసులకుకారణమవుతున్నాయి.ప్రజలు ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్ లేదా సమీప ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.







## సీఎం సభకు కర్ర సాము విద్యార్థులు

విశాఖపట్నం, మార్చి 23 ప్రభాతవార్త

నక్కపల్లిలో ఏర్పాటు చేసిన స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన వేడుకలో నగరానికి చెందిన బాలికలు చేసిన కర్ర సాము చూపర్లులను ఆకట్టుకుంది. అంతరించిపోయే ఇటు వంటి కలలు ప్రదర్శన చూసి వచ్చినవారు మంత్రం ముద్దులు అయ్యారు. బాలికలను అందరూ కొనియాడారు.








ong-10_ong-10.qxd 3/23/2026 11:37 PM Page 1






## డ్రైవర్ శ్రీనుపై అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి: ఆర్టీసీ డ్రైవర్లు నిరసన

**అనకాపల్లి మార్చి 23 : (ప్రభాతవార్త)**



అనకాపల్లి డిపోలో కె శ్రీను డ్రైవర్ యాక్సిడెంట్ పై విచారణ ఏకపక్షంగా ఉందని అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అనకాపల్లి ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులందరూ ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎన్.ఎం యు ఎ కార్యదర్శి కే ఎన్ వి రమేష్ మాట్లాడుతూ జరిగిన యాక్సిడెంట్ లో పాదచారిని తప్పు 80 శాతం ఉన్నప్పటికీ యాక్సిడెంట్లో కేవలం డ్రైవర్ ను పూర్తి బాధ్యుడని చేయటం చాలా అన్యాయం అన్నారు. తక్షణమే డ్రైవర్ యొక్క అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం డిపో క్యాషియర్ ఎం బి రాజు , డిపో కమిటీ, కార్మికులు పాల్గొని నిరసన తెలియజేశారు.

## నూకాంబికను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు దంపతులు

**అనకాపల్లి మార్చి 23 ;(ప్రభాతవార్త)**



ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారిని తుని మాజీ శాసనసభ్యులు రాజా అశోక్ బాబు, ఆంధ్ర ప్రదేశ్ మార్క్ ఫెడ్ మాజీ ఛైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా డీ సీ ఎం ఎస్ మాజీ ఛైర్మన్ డీ వీ వీ గోపాల్ రాజు (పెదబాబు) తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఛైర్మన్ పీలా నాగ శ్రీను పూర్ణకుంభం తో స్వాగతం పలికి, అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి చిత్రపటం అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం నవరాత్రి ఉత్సవాలను మార్క్ఫెడ్ మాజీ ఛైర్మన్ డివివి గోపాల్ రాజు, మెహర్ బేబీ దంపతులు ప్రారంభించారు.

## గ్రంధాలయంలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**




భగత్ సింగ్ వర్ధంతిని నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయ ధికారిణి పీ.దమయంతి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠకులు రామచంద్రరావు, సీతారామమూర్తి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల విద్యార్థి ఈశ్వర్ మాట్లాడుతు భగత్ సింగ్ ఎక్కడ పుట్టింది, ఏవిధంగా స్వతంత్రోద్యమంలో పాల్గొన్నారో వివరించాడు. పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థి ఆర్.సత్తిబాబు మాట్లాడుతూ 1919లో జరిగిన జలియన్వాలాబాగ్ ఘటన భగత్ లో బ్రిటిష్ వారి పట్ల మరింత కోపాన్ని పెంచింది. ఆనాటి నుండి తన జీవితాన్ని స్వాతంత్రోద్యమానికే అంకితం చేయాలని నిర్ణయించుకున్నారన్నారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పీ. ప్రభాకర్ మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో భగత్ సింగ్ ఒకరు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకించినవాడు. ప్రత్యక్షంగా స్వాతంత్రములో పాల్గొన్నారు. భగత్ సింగ్ కు వివాహం చేయాలని తలంచినప్పుడు నా జీవితం దేశానికే అంకితం చేయాలని ఇంటి నుండి వెళ్లి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని, తనకు ఉరిశిక్ష వేసినంత వరకు పుస్తక పఠనం చేసిన వ్యక్తి భగత్ సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు, పాఠకులు,యువకులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిచెన్స్ నిర్ణయాన్ని విరమించుకోవాలి

**- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు**

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**




మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయబోయే స్మార్ట్ కిచెన్స్ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన ఉద్యమం చేపట్టడం జరుగుతుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన నిరసన కార్యక్రమంలో చేపట్టారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సుమారు పాతికెళ్లుగా మధ్యాహ్నం భోజనం పథకంలో వేలాదిమంది మహిళలు పనిచేస్తున్నారని, వీరు అనేక ఏళ్ల పాటు పారితోషకాలు ఇవ్వకపోయినా పగే ముందస్తు పెట్టుబడి పెట్టి పిల్లలకు న్యాయమైన ఆహారాన్ని వండి పెడుతున్నారన్నారు. డొక్కా సీతమ్మ వంటి వారి పేరు పెట్టి నేడు మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రైవేటుపరం చేయాలని చూడటం ప్రభుత్వానికి ఎంతవరకు సమంజసమన్నారు. పేద పిల్లలకు పెట్టే ఆహారంపై, పథకాలపై ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి విడనాడాలన్నారు. కావున కార్మికులందరూ మిడ్ డే మిల్ పథకం స్మార్ట్ కిచెన్లకు ఇవ్వడాన్ని ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మిడ్ డే మిల్ కార్మిక సంఘం నాయకులు కె . ప్రసన్న, సత్యవతి, చిన్న తల్లి, ఒమ్మి నూకరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ కు స్వాగతం పలికిన మాజీ మంత్రి దాడి

**అనకాపల్లి రూరల్ మార్చి 23: (ప్రభాతవార్త)**



విశాఖ చేరుకున్న విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కి సోమవారం విశాఖ ఎయిర్ పోర్టులో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు , టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి దాడి రత్నాకర్ తో కలసి ఘనస్వాగతం పలికారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద దేశంలోనే అతిపెద్ద ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్స్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి తో కలిసి నారా లోకేష్ పాల్గొంటారు.

## 2030 నాటికి టీబీ నివారణ లక్ష్యం ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు

**చోడవరం, మార్చి 23, ప్రభాతవార్త:**




రానున్న 2030 నాటికి దేశవ్యాప్తంగా క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తగు కృషి చేస్తామని ఆ దిశగా ప్రతి ఏడాది మార్చి 23న క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు చెప్పారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవ సందర్భంగా చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఎవరికైనా కనిపిస్తే వెంటనే ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నుంచి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా టీబీ వ్యతిరేక నినాదాలు చేస్తూ సమాజంలో ప్రతి ఒక్కరు గౌరవంగా జీవించేందుకు సంపూర్ణ ఆరోగ్యం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ కళాశాల విద్యార్థులు ఆసుపత్రి వైద్యులు సిబ్బంది, టీవీ యూనిట్, ఐ సి టి సి సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు ఘన స్వాగతం.!









**(నక్కపల్లి రూరల్/ అడ్డురోడ్డు, ప్రభాతవార్త)**

నక్కపల్లి మండలం రాజయ్యపేట సమీపంలో లక్ష 30 కోట్ల రూపాయలతో అత్యంత ప్రతిష్టాత్మక నిర్మిస్తున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం మధ్యాహ్నం చందనాడ రాజయ్యపేట గ్రామాల వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ పవన్ కళ్యాణ్ లకు లక్ష్మి మిట్టల్ ఆదిత్య మిట్టల్ తో పాటు హోంమంత్రి వంగలపూడి అనిత లు ఘన స్వాగతం పలికారు. వారితోపాటు కేంద్రమంత్రి కుమారస్వామి , కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ , స్పీకర్ అయ్యన్నపాత్రుడు , మంత్రులు నారా లోకేష్ , కొండపల్లి శ్రీనివాస్ , భరత్ , అచ్చెన్నాయుడు , గుమ్మిడి సంధ్యారాణి, కొల్లు రవీంద్ర , ఎంపీ రమేష్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ , ఎమ్మెల్యేలు, నేతలు లకు స్వాగతం పలికిన అనంతరం ఆర్సెలార్ మిట్టల్ నిఫాన్ ఇండియా ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమం వద్ద ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియన్స్ సెంటర్‌ను తిలకించిన ముఖ్యమంత్రి చంద్రబాబు తోపాటు కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇండియా ప్లాంట్ కు సంబంధించిన వివరాలు, ఉక్కు రంగంలో తిలీవిలీ ఇండియా సంస్థ ప్రగతి వంటి అంశాలపై వీడియో ప్రజెంటేషన్‌ను తిలకించిన సీఎం చంద్రబాబు కు లక్ష్మీ మిట్టల్ ఆదిత్య మిట్టల్ సీఈవో లు కలిసి పూర్తిస్థాయి వివరాలను తెలియజేశారు. సమయంలో ఆసక్తికరమైన విషయాలు చోటుచేసుకున్నాయి లక్ష్మీ మిట్టల్ ,ఆదిత్య మిట్టల్ లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కోసం మాట్లాడారు. ఆ సమయంలో వారు సంతోషించారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

**- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ**

**చోడవరం, మార్చి 23, ప్రభాతవార్త:**



స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా సోమవారం చోడవరం లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, నాయకులు సిఐటియు ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఉషోదయ కాలేజీ నుండి కొత్తూరు వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించి, విద్యార్థులు, ప్రజలు నాయకులు డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞను చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు ,సుఖదేవుల ప్రాణ త్యాగాలు తో స్వాతంత్రం సిద్ధించుకోవడం జరిగిందని వారి స్ఫూర్తితో దేశంలో పెరిగిపోతున్న డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాల మాఫియాలను అరికట్టడం కోసం విద్యార్థులు, యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. నేడు డ్రగ్స్ మాఫియాలు పేచ్చి మీరు పోయి విద్యార్థులను, యువతను బలి పశువులను చేసి తప్పుదోవ పట్టించి గంజాయి మత్తు పదార్థాలకు బానిసలు చేస్తున్నారని అన్నారు. అనంతరం చోడవరం లోని బాలికల వసతి గృహంలో భగత్ సింగ్ , రాజగురు, సుఖ దేవ్ ల వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు ఎస్ వి నాయుడు, దేవుళ్ళు, నాగిరెడ్డి సత్యనారాయణ, విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పిడిఎస్ఓ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల 95వ వర్ధంతి వేడుకలు

**చోడవరం, మార్చి 23, ప్రభాతవార్త**



భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల 95 వ వర్ధంతిని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట దినంగా పాటిద్దామని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ పిలుపునిచ్చింది. సోమవారం స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో కార్యక్రమంలో ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజు గురు, సుఖదేవులు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తృణప్రాయంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులని కొనియాడారు. మరణించే ముందు"విప్లవం వర్ధిల్లాలి!"సామ్రాజ్యవాదం నశించాలి అంటూ నినదిస్తూ ఉరకంబమెక్కారనీ అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ కలిపి ఇరాన్ పై సాగిస్తున్న యుద్ధకాండను ప్రపంచ ప్రజలంతా ఖండించాలని అన్నారు.ఈ మధ్యనే వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురోను, వారి భార్యను అమెరికా అరెస్ట్ చేసిందని, ఇప్పుడు ఇరాన్తో యుద్ధం చేస్తుండగానే క్యోబాలో 60 శాతం భూభాగంలో విద్యుత్తు లేకుండా చేసిందన్నారు. తర్వాత యుద్ధం కూడా ప్రకటిస్తామని ట్రంప్ చెప్తున్నాడు అంటే ఇది అమెరికా కర్కసత్వానికి, యుద్ధ దాహానికి, దుర్మార్గమైన సామ్రాజ్యవాదానికి నిదర్శనమని అన్నారు.ఈ యుద్ధం కారణంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ రేట్లు పెరుగుతున్నాయని వీటి కారణంగా రోజువారి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే పరిస్థితి సంభవిస్తుందని, ఇప్పటికే అమెరికన్ డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ 119 రూపాయలకు చేరుకుందని, ఇది భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంతోష్ ,అర్జున్, పీడీఎస్ఓ జిల్లా నాయకులు పి.రాజేష్,.మణికంఠ,మహేష్,నవీన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ 95వ వర్ధంతి ఘనంగా నిర్వహించినఐద్వా:: సిఐటియు

**(రాంబిల్లి మార్చి 23 (ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలంలో దేశ స్వతంత్ర సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా సిఐటియు (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్) మరియు ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు, అనంతరం నాయకులు ఆయన త్యాగాలను స్మరించుకున్నారు, స్వతంత్రం కోసం తన ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ జీవితాన్ని, ఆయన ఆలోచనలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు, భగత్ సింగ్ కేవలం స్వతంత్ర సమరయోధుడే కాకుండా సమాజంలో సమానత్వం న్యాయం కోసం పోరాడిన మహానుభావుడు అని తెలిపారు, కార్మికుల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం ఇప్పటికి ప్రస్తుత కాలంలో ప్రసంగికమని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం, మండల కార్యదర్శి చందక మంగతాయారు, సిఐటియు నాయకులు జిల్లా కార్యదర్శి జి దేవుడు నాయుడు,చందక రామకృష్ణ , రాము నారాయణరావు డివైఎఫ్ఐ నాయకులు శివాజీ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్ 95వ వర్ధంతి కార్యక్రమం

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**



నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్ 95వ వర్ధంతిని సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్ఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం భగత్ సింగ్ చిరుప్రాయంలోనే ప్రాణాలు అర్పించారని కొనియాడారు. తండ్రి క్రమాభిక్ష కోరినా ఆయన తిరస్కరించి చిరునవ్వుతో ఉరితాడును స్వీకరించడం యువతకు ఆదర్శమన్నారు.భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు చదువులో రాణిస్తూ దేశభక్తితో ముందుకు సాగాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను గుర్తుంచుకుని సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ భగత్ సింగ్ వంటి మహనీయుల ఆలోచనలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నర్సీపట్నం గ్రేడ్1 సాధనకై కూటమి నేతల నిరసన

**: పెట్ల గణేష్ దొంగ వైఖరిపై లాలం మురళీకృష్ణ ఫైర్**

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**



పక్క నియోజకవర్గం నుండి వచ్చిన పెట్ల గణేష్‌కు నర్సీపట్నం అభివృద్ధి జరగడం ఇష్టం లేదు .నర్సీపట్నం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు, ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్ దొంగ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ తీవ్రంగా ధ్వజమెత్తారు. అంబేద్కర్ విగ్రహం వద్ద కూటమి నాయకులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. మార్చి 17న జరిగిన ఆఖరి మున్సిపల్ సమావేశంలో 4వ అంశంగా నర్సీపట్నం మున్సిపాలిటీని గ్రేడ్1 గా అప్ గ్రేడ్ చేసే తీర్మానంపై చర్చ జరిగిందని, 28 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని మురళీకృష్ణ ఈ సందర్భంగా గుర్తుచేశారు.అయితే భోజన విరామం అనంతరం మున్సిపల్ చైర్పర్సన్ సుబ్బలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్ మాటలు విని తీర్మానం ఆమోదం పొందలేదని మినిట్స్ బుక్లో రాయడం నర్సీపట్నానికి చేసిన తీవ్ర అన్యాయమని ఆయన ధ్వజమెత్తారు.పక్క నియోజకవర్గానికి చెందిన పెట్ల గణేష్ ఇక్కడ జోక్యం చేసుకోవడం దారుణమన్నారు. గతంలో నూకాంబికా గుడి విషయంలో 10 లక్షలు తీసుకున్నారని, డమ్మీ ఎమ్మెల్యేగా వ్యవహరించారని తీవ్రస్థాయిలో విమర్శించారు. నర్సీపట్నం వార్షిక ఆదాయం ఆధారంగా గౌరవ అయ్యన్నపాత్రుడు గారు మున్సిపాలిటీని గ్రేడ్1 గా అప్ గ్రేడ్ చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నారని, ఆ అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసీపీకి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ నిరసనలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ సుబ్బలక్ష్మి స్వయంగా రాసి ఇచ్చిన తీర్మానం ప్రతులను చేతబూని నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గుడ బండి ఆదిలక్ష్మి, వైస్ చైర్పర్సన్ గొలుసు నరసింహమూర్తి, దనిమిరెడ్డి మధు, నూకాంబికా ఆలయ చైర్మన్ కొరుప్రోలు శ్రీను, డబ్బీర్ శ్రీకాంత్, దాసు, పలువురు మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జిలు, దళిత నాయకులు పాల్గొన్నారు.

## నక్కపల్లి ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు తరలి వెళ్లిన నాయకులు

**కసింకోట, మార్చి 23, ప్రభాతవార్త;**



నక్కపల్లి లో సోమవారం జరుగు స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభకు కసింకోట మండలం నుండి కూటమి నాయకులు బస్సులలో బయలుదేరి వెళ్లారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కాయల మురళి, వేగి గోపి, జనసేన నాయకులు ఆధ్వర్యంలో నక్కపల్లి బయలుదేరి వెళ్లారు.

## దైవ కార్యానికి ఆటంకాలు వద్దు.. నర్సీపట్నంలో "సృష్టి క్షేత్ర" నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూడటం దారుణం

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**



నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న "సృష్టి క్షేత్రం"లో 108 అడుగుల భారీ శివపార్వతుల విగ్రహ నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూడటం దారుణమని స్థానిక అర్చకులు, పురోహితులు తీవ్రంగా ఖండించారు. గౌరవ అయ్యన్నపాత్రుడు గారి ఆధ్వర్యంలో, విజయ్ బాబు, రాజేష్ బాబుల సంకల్పంతో నర్సీపట్నంలో మునుపెన్నడూ లేని విధంగా 108 అడుగుల ఎత్తైన ఎదురెదురుగా ఉండే శివపార్వతుల విగ్రహాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.ఉత్తర వాహిని నదీ తీరాన దక్షిణ కాశీగా పిలువబడే ఈ ప్రాంతంలో నిర్మితమవుతున్న ఈ క్షేత్రం నర్సీపట్నానికే గర్వకారణమని అర్చకులు పేర్కొన్నారు. గతంలో హైదరాబాద్లో బుద్ధుడి విగ్రహం, కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహం, గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వంటివి ఆయా ప్రాంతాలకు ఎంతటి పేరు ప్రఖ్యాతులు, ఉపాధి అవకాశాలు తీసుకువచ్చాయో, ఈ సృష్టి క్షేత్రం కూడా నర్సీపట్నానికి అంతే ఖ్యాతిని తీసుకువస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఇంతటి పవిత్రమైన బృహత్కార్యాన్ని అడ్డుకునేందుకు మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్ తదితరులు వాట్సాప్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేస్తూ అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేయడం పట్ల అర్చకులు అనిపిండి ఫణి కుమార్, పెరివిల్లి రామం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయ్యన్నపాత్రుడు ఎవరి వద్ద ఎటువంటి ఆర్థిక సహాయం ఆశించకుండా, ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా స్వచ్ఛందంగా ఈ విగ్రహ నిర్మాణాన్ని చేపడుతున్నారని స్పష్టం చేశారు. పరమశివుడికి సంబంధించిన మహాకార్యానికి ఆటంకాలు కల్పించడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని, దైవ కార్యాలను అడ్డుకునే వారి కుటుంబాలు బాగుపడవని వారు హెచ్చరించారు. నర్సీపట్నం ప్రజలందరూ ఈ పవిత్ర కార్యక్రమానికి మద్దతుగా నిలవాలని, ఎటు వంటి ఆటంకాలు లేకుండా సృష్టి క్షేత్ర నిర్మాణం విజయవంతంగా పూర్తి కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రారంభోత్సవం రోజైనా వచ్చి ఒక్క పువ్వు వేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేరి ఆదిత్య, భమిడిపాటి జగదీశ్, వెలవలపల్లి బలరామ శర్మ పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి భాషోత్సవ పోటీల్లో భవ్య శ్రీ ప్రతిభకు ప్రథమ బహుమతి

**(రాంబిల్లి మార్చి 23 (ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం పంచదార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి భవ్య శ్రీ ప్రతిభకు ప్రథమ బహుమతి లభించింది, అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి బాషోత్సవ పోటీలలో 9వ తరగతి చదువుతున్న ఎన్. భవ్యశ్రీ తెలుగు స్టోరీ టెల్లింగ్ అంశంలో ప్రథమ స్థానం గెలుపొందింది, ఈ పోటీలలో ఏడు మండలాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో పద్య పఠనము మరియు కథలు చెప్పడం అను రెండు అంశాల్లో ఈ పోటీలు నిర్వహించగా ప్రథమ స్థానంలో భవ్య శ్రీ గెలుపొందిందని పంచదార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఉమా తెలిపారు, ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు వి. సూర్యనారాయణ, ఎం. సూర్యారావు మాట్లాడుతూ భవ్య శ్రీ విజయం పాఠశాలకే కాకుండా పంచదారల గ్రామానికి కూడా గర్వకారణం అని కొనియాడారు, విద్యార్థులు భాషా ప్రావీణ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని వారు అన్నారు, భవ్యశ్రీ లాంటి ప్రతిభావంతుల విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.




# వేసవి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయండి

- జిల్లా యంత్రాంగానికి కీలక ఆదేశాలు: జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**పాడేరు,మార్చి,23, ప్రభాతవార్త:**



జిల్లాలోని అన్ని జన సముదాయలు,కూడలిలో రాబోయే తీవ్రమైన ఎండలు, ఉష్ణగాలుల దృష్ట్యా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో సమ్మర్ ఆక్షన్ ప్లాన్ రూపొందించుకోని, చలివేంద్రాలు ఏర్పాటుకు ప్రతిష్టమైన చర్యల రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. సోమవారకలెక్టర్ తన చాంబర్ నుండి అల్లూరు పోలవరం జిల్లాల సంబంధించిన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఐటీడీఏ, కలెక్టరేట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ప్రజలు,జనాలు ఎక్కువగా మసిలే ప్రదేశాలను, చలివేంద్రాల ఏర్పాటు ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే సంతలు, ఆర్.టి.సి బస్టాప్‌లు, బస్సు షెల్టర్లు పర్యాటక ప్రాంతాల్లో తక్షణమే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల వద్ద, ఎన్.ఆర్.జి.ఎస్ పనులు చేసే కూలీలకు మరియు పాఠశాల విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా తగిన నీడ మరియు రక్షణ చర్యలు చేపట్టాలి. తాగునీటి సరఫరా సంబంధించి గ్రామాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించి, తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు, మేకలకు గ్రామ స్థాయిలో ప్రత్యేకంగా వాటర్ పాంట్స్ (నీటి కుంటలు) ఏర్పాటు చేయాలి. వ్యవసాయం, ఉద్యానవనం సాగునీటి ఎద్దడి రాకుండా చెక్ డ్యామ్‌ల ద్వారా పంట పొలాలకు నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. వైద్య సౌకర్యాలు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వడదెబ్బ నివారణకు అవసరమైన ఓఆర్ ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలి. ప్రజలు కూడా ఎండలు ఎక్కువగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, ఎండల తీవ్రత ఉన్నప్పుడు అందుకు తగిన ఏర్పాటు చేసుకొని, మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.అనంతరం వడదెబ్బ తాలకుండా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన పోస్టర్ను ప్రారంభించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అల్లూరు, పోలవరం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, రెండు జిల్లాల ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, డిపిఓ,డిఎంహెచ్ఓ, డిఈఓ, డిఎఫ్ఓస్, ఫైర్, ఈఈ ఎస్ఎంఐ, ఈఈ ఆర్డబ్ల్యూఎస్, డిడి గ్రౌండ్ వాటర్, పిడి ఐసిడిఎస్ ఇరిగేషన్, ఎడి సిరికల్చర్, ఏడి ఆర్టికల్చర్, అగ్రికల్చర్, డీఎం,ఆర్ఎం ఆర్టీసీ,ఎస్పీ ట్రాన్స్కో,పిడి డిఆర్డిఏ డ్వామా తదితర శాఖలఅధికారులు పాల్గొన్నారు.

## పాడేరులో వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

- సమావేశానికి విచ్చేసిన అరకు పార్లమెంట్ పరిశీలకులు చింతలపూడి వెంకట రామయ్య

**గూడెం కొత్తవీధి మార్చి 23 (ప్రభాతవార్త)**



పాడేరులో జరిగిన వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరైన గూడెం కొత్తవీధి మండల వైసీపీ నాయకులు. అలాగే మొదటి సారిగా విచ్చేసిన అరకు పార్లమెంట్ పరిశీలికులు చింతలపూడి వెంకట రామయ్య నీ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ మరియు జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి,వైస్ ఎంపీపీ లోత దేముడు,అల్లూరి జిల్లా క్రిస్టియన్ వింగ్ జిల్లా అధ్యక్షులు వసుపరి తిమోతి,నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు వనపల రాజేష్,నియోజకవర్గ యువజన అధ్యక్షులు లమ్మసింగి రమేష్,జీకే వీధి ఎస్టీ సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ, దామనపల్లి పంచాయితీ పార్టీ అధ్యక్షులు సాగిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ ప్రవేశాలకు ఆన్లైన్ తప్పనిసరి

**గూడెం కొత్తవీధి,మార్చి 23 (ప్రభాతవార్త)**

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జీకేవీధి కేజీబీవీ ప్రత్యేక అధికారి నాగలక్ష్మి తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం తో పాటు 7, 8,9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థినుల నుంచి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 1 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 13 నుంచి 17 వరకు సంబంధిత కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ధ్రువపత్రాలను పరిశీలించి సీట్లను కేటాయిస్తారని వెల్లడించారు. మధ్యలో చదువు మానేసి మళ్లీ విద్యను కొనసాగించాలనుకునే బాలికలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడే వాళ్ళకే ప్రాధాన్యత కల్పిస్తాం

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

**అరకు రూరల్, మార్చి 23, ప్రభాతవార్త :**



అరకులోయ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ విభాగం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం నిరంతరం కష్టపడే కార్యకర్తలకు, నిబద్ధత కలిగిన వారికి పార్టీ లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. సొంత ప్రయోజనాల కోసం కాకుండా పార్టీ బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజలతో మమేకం అవుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజా వ్యతిరేక పనులను ప్రజల వరకు చేరేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అరకు పార్లమెంట్ పరిసీలకులు చింతలపూడి వెంకటరమణ, అరకు నియోజకవర్గ ఇన్చార్జ్ ..బాణాల శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ కమిటీలు పూర్తిస్థాయిలో నియామకాలు జరిగేలా అందరూ కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం అందించి పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి కి మనసు దోచుకున్న కార్యకర్తలుగా మీరంతా స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర మంతటా కూటమి గెలుపొందిన అరకు నియోజకవర్గంలో గతం కంటే ఈ ఎన్నికల్లో 36000 ఓట్ల భారీ స్థాయి మెజారిటీతో గెలిపించడం అంటే కార్యకర్తల కష్టం ఎంతుందనేది అర్థమవుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో కచ్చితంగా అరకు ప్రాంత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పూర్తిస్థాయి గుర్తింపు లభిస్తుందని అనుకుంటున్నామని అభిప్రాయం వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర , అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, పాడేరు నియోజకర్గ పార్టీ ఇంచార్జీ సత్యారావు, నాయకులు పాంగి చిన్నారావు, కమిడి అశోక్, తడబారికి సురేష్, పెట్టెలి సుక్ర , నర్సింగ్, విజయ్, జగన్, అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ విభాగం అధ్యక్షుడు రేగబోయిన స్వామి మరియు మండల పార్టీ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్థ రాష్ట్ర, జిల్లా, మండల, పంచాయితీ, గ్రామస్థాయి వివిధ హోదాల్లో కలిగి ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యాయం కోసం జి.సి.సి ఆఫీసు ముందు కాఫీ రైతులు ఆందోళన

**గూడెం కొత్తవీధి మార్చి 23 (ప్రభాతవార్త)**



మండలంలో కాఫీ రైతులకు న్యాయం చేయాలని కోరుతూ జి.సి.సి ఆఫీసు ముందు ఆందోళన చేసిన కాఫీ రైతులు. జీ కే వీధి మండలానికి చెందిన కాఫీ రైతులు పెట్రోల్ బంక్ నుంచి జి.సి.సి ఆఫీసు వరకు ర్యాలీ గా వెళ్లి, ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గాలికొండ ఎం.పి.టి.సి అంపురంగి బుజ్జిబాబు మాట్లాడుతూ కాఫీ రైతులు పండించిన కాఫీ కిలో కి 270 రూ/ కొనుగోలు చేయాలని ఎపెక్స్ కమిటీ నిర్ణయం చేసారు. కానీ రైతులు దగ్గర జి.సి.సి అధికారులు కొనుగోలు చేయడం లో నిర్లక్ష్యం చేయడం వలన దళారీల వద్ద నష్ట పోయారని అన్నారు. జి.సి.సి అధికారులు వలన రైతులు కేజీ కి 40, నుంచి 50 రూపాయిలు నష్ట పోయారని కావున జిల్లా కలెక్టర్, పి.ఒ, గిరిజన సహకార సంస్థ చైర్మన్ శ్రావణ కుమార్, తక్షణమే స్పందించి ఎపక్స్ కమిటీ ప్రకటించిన ధరకే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు ఇచ్చిన ఋణాలు రద్దుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాఫీ రైతులు వండలం బాలయ్య, చంటిబాబు, కాకూరు వెంకటరమణ, బలరాం మూర్తి, కొర్ర భూపతి, విజయప్రసాద్, జనసేన మండల ఉపాధ్యక్షులు బత్తూల మార్క్, మరియు వివిధ గ్రామాల నుంచి కాఫీ రైతులు పాల్గొన్నారు.

## పాడేరు శ్రీ మోద కొండమ్మ ఉత్సవాలు తేదీల పోస్టర్ ఆవిష్కరణ

**పాడేరు,మార్చి23, ప్రభాతవార్త:**



పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి గిరిజన జాతర మే నెల 10,11,12 తేదీల జరగనున్న తేదీ పోస్టర్లు మరియు ఆహ్వాన పత్రికలు సోమవారం ఆలయ కమిటీ మరియు ఉత్సవ కమిటీ గ్రామ పెద్దల సమక్షంలో ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్మన్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు చేతుల మీదగా ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ ప్రత్యేక పూజలు చేసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ఉత్స వ కమిటీ ముఖ్య సలహాదారులు ఫలాసి కృష్ణారావు, కిల్లు గంగన్న పడాల్, వంతినబ రాజుబాబు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబునాయుడు, ఆలయ కమిటీ ఉత్సవ కమిటీ సభ్యులు చల్ల రామకృష్ణ,కొణతాల సతీష్, కిల్లు చంద్రమోహన్ కుమార్, గూడెపు సూర్య ప్రకాష్, లకె రత్నాబాయ్, కేజియరాణి, ప్రముఖ రాజకీయ నాయకులు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైసీపీలోనికి టీడీపీ మాజీ వార్డు సభ్యుడు

**కొయ్యూరు, మార్చి23, ప్రభాతవార్త**



మండలంలోని గడబపాలెం పంచాయితీ, మల్లవరం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ వార్డు సభ్యుడు తాలాబు బాలరాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు బిడిజన అప్పారావు ఆధ్వర్యంలో పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు పార్లమెంటు పరిశీలకులు వెంకట్రామయ్య, పాడేరు నియోజకవర్గ పరిశీలకులు సత్యారావు సమక్షంలో పాడేరు క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితుడై బాలరాజు పార్టీలో చేరినట్లు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గాడి సత్యనారాయణ, గ్రీవెన్స్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి గోవర్ధనగిరి, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు ముసిలినాయుడు, మండల కార్యదర్శి పెట్ల గాంధీ, మండల నాయకుడు ఉల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పోరాడుదాం: సిఐటియు

**అరకులోయ, మార్చి 23, ప్రభాతవార్త**




స్వతంత్ర సమరయోధుడు బ్రిటిష్ సామ్రాజ్యవాద దేశాన్ని గడగడ లాడించిన భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టి, వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని, మదక ద్రవ్యాలకి దూరంగా ఉండాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం అరకులోయ మండల కేంద్రంలో భగత్ సింగ్ 95 వ వర్ధంతి సందర్భంగా ఆయనకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతను బానిసలాగ చేసే డ్రగ్స్ వ్యతిరేకంగా పోరాడాలని, డ్రగ్స్, గంజాయి వ్యాపారస్తులు గుండాలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. గంజాయి గుండా ల చేతిలో బలైపోయిన నెల్లూరు సిఐటియు కార్యకర్త పెంచలయ్య కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడాలని తెలిపారు. నెల్లూరు లో గంజాయి కి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున యువతను సమీకరించి పెంచలయ్య పెద్ద ఎత్తున ఉద్యమించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి అరికట్టాలనే ప్రకటనకే పరిమితవుతున్నారని అన్నారు. భగత్ సింగ్ సామ్రాజ్యవాదం వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించారని అన్నారు. అతి చిన్న వయసులో దేశభక్తిని చాటుతూ చిరునవ్వుతో ఉరి కంభం ఎక్కడం జరిగిందని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాద దేశం యుద్ధాలు ప్రోత్సహిస్తూ మనలాంటి దేశాలపై ఆర్థికంగా పరోక్షంగా దెబ్బ కొడుతుందని తెలిపారు. యుద్ధాల వలన అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, ఫలితంగా ధరలు పెరిగిపోయి ఆర్థిక మాంద్యం ఏర్పడుతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్ వ్యతిరేకంగా సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దాడి రాజు, రాంబాబు, వంతల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నివారణే లక్ష్యంగా వ్యాక్సినేషన్

- రాజేంద్రపాలెం పిహెచ్సి వైద్యాధికారిణి స్నేహలతారెడ్డి

**కొయ్యూరు మార్చి 23 ప్రభాతవార్త**



గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణే లక్ష్యంగా 14ఏళ్లలోపు బాలికలకు హెచ్ పీవీ వ్యాక్సిన్లను వేస్తున్నామని మండలంలోని రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. స్నేహలత రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్వీ భూలోక, పలువురు ఏఎన్ఎంలతో కలిసి రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. 11మంది బాలికలకు వ్యాక్సిన్లు వేశామని వైద్యాధికారిని తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో ఇ ప్పటి వరకు 18మందికి వ్యాక్సిన్లు వేయడం జరిగిందని వివరించారు. 14ఏళ్లలోపు బాలికల తల్లితండ్రులు ముందుకు వచ్చి వ్యాక్సినేషన్ ప్రక్రియకు సహకరించాలని వైద్యాధికారిణి డా. స్నేహలతా రెడ్డి కోరారు.

## శెట్టిబలిజి సంఘ వ్యవస్థాపకులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు: జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**పాడేరు,మార్చి23, ప్రభాతవార్త**



శెట్టిబలిజి సంఘ వ్యవస్థాపకులు, ప్రముఖ సామాజిక సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను సోమవారం అల్లూరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అయన ఒక గొప్ప సామాజిక చైతన్యం కలిగిన దొమ్మేటి వెంకటరెడ్డి సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, ముఖ్యంగా శెట్టిబలిజి కులస్థుల ఐక్యత, అభివృద్ధి కోసం చేసిన కృషిని మరువలేనిదని కలెక్టర్ కొనియాడారు.ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ కె. సాహెత్, ఇన్చార్జి డిఆర్ఓ అంబేద్కర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్,వివిధ విభాగాల అధికారులు సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొని వెంకటరెడ్డి సేవలను స్మరించుకున్నారు.

## అరకు ఎంపీ డా.తనుజరాణి

- పలు సమస్యలు పై మంత్రికి వినతి

**పాడేరు,మార్చి23, ప్రభాతవార్త:**



కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని అరకు పార్లమెంట్ సభ్యురాలు డా.గుమ్మా తనూజ రాణి డిల్లీలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ పరిధిలో నెల కొని ఉన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి ఎంపీ తనూజ రాణి తీసుకు వెళ్లి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా కటికి జలపాతాల వద్ద పర్యాటకుల భద్రత, ఆదివాసీ కుటుంబాల జీవనోపాధి కోసం రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని, అలాగే బొర్రా రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ మంజూరు చేసి కనెక్టివిటీ, టూరిజం అభివృద్ధి సహకరించాలని రైల్వే మంత్రిని కోరినట్టు ఎంపీ డా.తనుజరాణి పేర్కొన్నారు. ఈ దీర్ఘకాలిక సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి నీ కోరగా సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ తనూజ రాణి పేర్కొన్నారు.

## కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ అమలు పూర్తిగా విఫలం

- అరకు పార్లమెంట్ వైసిపి పరిశీలకులు, చింతలపూడి వెంకట రామయ్య విమర్శ

**పాడేరు, ప్రభాతవార్త**



సంక్షేమ పథకాలు అమలులో పూర్తిగా కూటమి ప్రభుత్వం విఫలం అయిందని అరకు పార్లమెంట్ వైసిపి పరిశీలకులు, గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట రామయ్య తీవ్ర స్థాయిలో విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో గత వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేసిందన్నారు. పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో శాసన సభ్యులు జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా అరకు పార్లమెంట్ పరిశీలకులు+చింతలపూడి వెంకట రామయ్య,పాడేరు అరకు నియోజకవర్గాల పరిశీలకులు ఏడువాక సత్యారావు ముఖ్య నాయకులు పాల్గొనీ మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శాసన సభ్యులు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు+జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసి ప్రతి కార్యకర్తకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తింపు ఉండాలని డిజిటలైజేషన్ ద్వారా కార్యకర్తలకు భద్రత కల్పించే విధంగా.దూరదృష్టితో వ్యక్తిగత గుర్తింపు కార్డ్ ఇస్తూ పార్టీ కేంద్ర కార్యాలయంలో నేరుగా సమస్యలు తెలియజేసే విధంగా జగన్మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. పాడేరు నియోజకవర్గంలో 90 శాతం కమిటీలు పూర్తి చేసుకున్నాం. ఇంకా త్వరగా మిగతా కమిటీలు త్వరితగతిన పూర్తి చెయ్యాలని నాయకులకు ఆదేశాలు జారీ చేశారు.కావున ప్రతి ఒక్క కార్యకర్తను కమిటీల్లో భాగస్వాములు చేసి భద్రత కల్పించాలని సూచించారు. నాయకులందరూ పార్టీ సిద్ధాంతాలకు తూచతప్పకుండా పాటించి రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మెజారిటీతో గెలిపించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గాడి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు సీధరి మంగ్లన్న దొరా, వంజరి సీతారాం నాయుడు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురూస పార్వతమ్మ, మండల పార్టీ అధ్యక్షులు బిడిజన అప్పారావు, నుర్మాని మత్యకొండం నాయుడు, కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీపీలు, బడుగు రమేష్, బోయిన కుమారి, కొరభు అనూష దేవి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుబ్బడి శేఖర్, పంచాయితీ రాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి బుసారి కృష్ణారావు, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి కూతంగి సూరిబాబు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు లోచలి వర ప్రసాద్, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు వసుపరి తిమోతి, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి జయితి రాజులమ్మ, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొడుగు అచ్యుత్, మాజీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కిల్లో ఊర్వశి రాణి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు శరభ సూర్యనారాయణ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

## మనసున్న మంచోళ్ళు నిజమైన మారాజులు

- అగ్నిబాధిత కుటుంబానికి సాయం చేస్తున్న దాతలు

**కొయ్యూరు మార్చి 23 ప్రభాతవార్త**



మనసున్న మంచోళ్లే నిజమైన మారాజులు, మనసంటూ లేనోళ్లే అసలైన నిరుపేదలుఖి అని ఓ సినీ గేయ రచయిత చెప్పిన మాదిరిగా మండలంలోని చీడిపాలెం పంచాయితీ, సింగవరం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి, సర్వం కోల్పోయిన పాము రాజు కుటుంబాన్ని ఆదుకోవడానికి మనసున్న మంచోళ్ళు అంతా ముందుకు వస్తున్నారు. సింగవరం గ్రామంలో నివసిస్తున్న పాము రాజు కి చెందిన తాటాకుల ఇల్లు శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన పరమ పూజ్య గురువులు శ్రీ శ్రీ రవిశంకర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ టీచర్ జలుమూరి వెంకట గిరిబాబు బాధితులకు అవసరమైన వంట పాత్రలు,కంచాలు గ్లాసులు సోమవారం అందజేశారు. తాము చాలా పేద స్థితిలో ఉన్నామని తన భర్త కిడ్నీ సంబంధ సమస్యలతో బాధపడుతూ రెండు రోజులకు ఒకసారి డయాలసిస్ చేయిస్తున్నామని ఇబ్బందులు పడుతున్నామని రాజు భార్య నాగమణి అన్నారు. ఈ సమయంలో తమకు ఈ సహాయం చేస్తున్న మనసున్న మారాజులు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థవారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు..అనంతరం శరభన్నపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు వై.సింహాచలం మాస్టారు రూ.1000లు నగదు బాధిత కుటుంబానికి అందజేసి తన మానవతా మనసును చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జలుమూరి నాగేశ్వరరావు, ముమ్వల రాజు,ఉపాధ్యాయులు లక్ష్మయ్య,సింహాచలం బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 18వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

-ఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

**పాడేరు,మార్చి23, ప్రభాతవార్త:**




ఏఐటియుసి పెద్ద ఎత్తున పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలలో అత్యంత ప్రధానమైన 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోట్లుగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి 2025 నవంబర్21 నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని దీనివలన పారిశ్రామిక వివాదాలు చట్టం మరియు ఫ్యాక్టరీస్ యాక్ట్, కార్మిక నష్టపరిహార చట్టం వంటి ముఖ్యమైన చట్టాలను రద్దు చేయబడతాయని ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. అల్లూరి జిల్లా ప్రథమ మహాసభ జిల్లా కేంద్రం పాడేరులో జల్లి రాజబాబు అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొని మాట్లాడుతూ ఏఐటియుసి పెద్ద ఎత్తున పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలలో అత్యంత ప్రధానమైన 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోట్లుగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి 2025 నవంబర్21 నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని దీనివలన పారిశ్రామిక వివాదాలు చట్టం మరియు ఫ్యాక్టరీస్ యాక్ట్, కార్మిక నష్టపరిహార చట్టం వంటి ముఖ్యమైన చట్టాలను రద్దు చేయబడతాయని అన్నారు. అదేవిధంగా 2026 ఏప్రిల్ 26 నుండి 29 వరకు తిరుపతి పట్టణంలో ఏఐటీయూసీ రాష్ట్ర 18వ మహాసభలు జరగనున్నాయని, ఆ మహాసభలకు అల్లూరి జిల్లా నుండి పెద్ద ఎత్తున కార్మిక లోకం కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహా సభల్లో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ,సిపిఐ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, ఏఐటియుసి రాష్ట్ర సమితిసభ్యులు సత్య ఆంజనేయ, లగుడు వెంకటరమణ లు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో కార్మిక సమస్యలపై ఏఐటియుసి మరింత ఉద్యమాలకు శ్రీకారం చుట్టబోతుందని, ఏ కార్మికుడికి అన్యాయం జరిగిన అండగా ఏఐటిసి ఉంటుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ ప్రతిపాదిస్తూ ఈ మహాసభలలో 41 మంది తో కౌన్సిల్ మరియు కార్యవర్గ సభ్యులతో కమిటీ ఎన్నుకున్నారు. కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా అల్లూరి జిల్లా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా అమర్ ని ప్రధాన కార్యదర్శిగా జల్లి రాజబాబుని జిల్లా కౌన్సిల్ ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ మహాసభలో కార్యదర్శులుగా కంకిపాటి సత్తిబాబు, దేవరాజు,పండు బాబు, రాంబాబు, లోవరాజు లను, జిల్లా ఉపాధ్యక్షులుగా శివశంకర్, కృష్ణ, కిముదు హనుమంతరావు, శివశంకర్ లను, కోశాధికారిగా కిముదు శివ లను ఎన్నుకొన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింహాచలం, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి కే.చంటిబాబు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోన్ జాయింట్ సెక్రెటరీ వై.రాము, ఏఐవైఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి ముమ్వల లక్ష్మణ్ తదితర నాయకులు పాల్గొనడం జరిగింది. ఒక మహాసభలో అనేక కార్మిక సంఘాలు పాల్గొన్నాయి.

## 7వ రాష్ట్ర జూనియర్ సెలెక్షన్లో నర్సీపట్నం బాక్సర్లు విజయం

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**



విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన 7వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాయ్స్ బాక్సింగ్ సెలెక్షన్లో నర్సీపట్నం నుంచి ముగ్గురు బాక్సర్లు పాల్గొన్నారు. 45 కేజీలో ముకేష్ మరియు 47 కేజీలో లంక ధీరజ్ సాగర్ క్వార్టర్ ఫైనల్ వరకు చేరారు. 65 కేజీలో కుంచె మొక్షిత్ బ్రాంజ్ మెడల్ సాధించి ప్రతిభను ప్రదర్శించాడు. వీరి వెనుక సీనియర్ బాక్సర్ తేజస్విని టీం అసిస్టెంట్ కోచ్గా స్టేట్లో పాల్గొన్నారు. విజేతలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు మెడల్స్ అందజేసి అభినందించారు. సీనియర్ కోచ్ శేఖర్, ఆర్మీ కోచ్ సన్యాసి రావు కూడా ఈ బాక్సర్ల ప్రదర్శనకు ప్రశంసలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక బాక్సింగ్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రతిభలను గుర్తించి మరింత అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు.

## బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షున్ని సన్మానించిన విళ్ళ

**అగనంపూడి ప్రభాతవార్త**



విశాఖ జిల్లా టిడిపి కార్యాలయంలో శెట్టిబలిజి సంఘ వ్యవస్థాపకులు సంఘసంస్కర్త కీర్తిశేషులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఉత్సవాలు సందర్భంగా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల వెంకట సాయి శ్రీనివాసి ను రాష్ట్ర మినిమం వేజ్ బోర్డ్ ఎడ్వేజ కమిటీ డైరెక్టర్ విళ్ళ రామ్మోహన్ కుమార్ దుస్సాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయి శ్రీనివాస్ ఎంపీటీసీగా జడ్పిటిసిగా పదవులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు, కోనసీమ జిల్లాకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ టిఎన్టియుసి నాయకులు నెల్లి సాదురావు, కొర్రాయి నాగార్జున, బలిరెడ్డి సత్యనారాయణ, శీరంశెట్టి బాబ్జి, ఆర్ రామకృష్ణ, పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆశయాలు సాధిద్దాం

**(ఎస్ రాయవరం మార్చి 23 ప్రభాతవార్త)**



ఎస్. రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం లో సోమవారం స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ వీరులు భగత్ సింగ్ తొంబై ఐదవ వర్ధంతి ఘనంగా నిర్వహించారు, ఆయన చిత్ర పటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం. అప్పలరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..దేశ స్వాతంత్ర్య కోసం బ్రిటిష్ వారు తో పోరాడిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజగుర్, సుఖదేవ్ లను ఇరవై మూడు సంవత్సరాల నూనూగు మీసాల వయసు లో బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీయడం జరిగిందని భగత్ సింగ్, రాజగుర్, సుఖదేవ్ లు విప్లవ వీరులు గా భారత దేశానికి స్వాతంత్రం కావాలని, సమసమాజం రావాలని, అందరికి తిండి, బట్ట, గూడు కావాలని పోరాడిన యోదులు వారు నేటి తరానికి ఎంతో ఆదర్శమని తెలిపారు, వారి ఆశయాలు సాధించడానికి యువకులందరూమంచి స్ఫూర్తి తో ముందుకు రావాలని. ఈ రాష్ట్రం లో గంజాయి, డ్రగ్స్ ను నిర్మూలన చేయడానికి యులకులు పోరాడాలని అప్పుడే భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ లకు మనం నివాళులు అర్పించిన వారిమవుతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కె. బాబూరావు, సిహెచ్ రమణ, పి. సాయి, ఎస్. భాస్కర్, పవన్, సిహెచ్ అప్పలరాజు, నారాయణ, నరేంద్ర, హారీష్, జగన్, లక్ష్మీ యువ పాల్గొన్నారు.

## నోటి క్యాన్సర్ రాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్త పడాలి

**అగనంపూడి ప్రభాతవార్త**



నోటి క్యాన్సర్ రాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్త పడాలని అగనంపూడి ఏరియా డెంటల్ డాక్టర్ పి రాజ్యలక్ష్మి అన్నారు. అగనంపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జరిగిన నేషనల్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దంతాలు సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, చెడు అలవాట్లయినా గుట్కా కైని పాన్ పరాకులకు దూరంగా ఉండాలని, నేడు ఎక్కువగా క్యాన్సర్ వస్తున్న కారణంగా ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లు కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ శంకర ప్రసాదు, దుర్గా కళ్యాణి, గౌరీ భవాని, నర్సింగ్ సూపర్డెంట్ హేమ లక్ష్మి, ఏవో రవి రాజు, అధిక సంఖ్యలో పేషెంట్లు పాల్గొన్నారు.

## కూలి పనికి వెళుతుండగా పాముకాటు :: మహిళ మృతి

**(రాంబిల్లి మార్చి 23 ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం అప్పరాయుడుపాలెం పంచాయితీలో గల ధారబోగాపురం గ్రామానికి చెందిన పక్కుర్తి కుమారి (43) కూలి పనికి వెళుతుండగా విషపూరిత పాము కాటు వేయడంతో మరణించిందని సీఐ సిహెచ్. నరసింగరావు తెలిపారు, ఈ ఘటన ఉదయం 6:30 గంటల ప్రాంతంలో జరగడంతో హుటాహుటిన ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేపించారు, అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఉదయం 9:30 గంటల సమయంలో ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలు భర్త ఫిర్యాదు మేరకు రాంబిల్లి పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్వర్గీయ గుడివాడ గుర్నాథరావు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి... బోదుపు గోవింద్..

**ఎలమంచిలి, మార్చ్ 23, ప్రభాతవార్త:**



పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నెంబర్ బోదుపు గోవిందు పత్రిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోదుపు గోవిందు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర టైగర్ మాజీ మంత్రివర్యులు పార్లమెంట్ సభ్యుడు స్వర్గీయ గుడివాడ గుర్నాథరావు విగ్రహాన్ని ధ్వంసం చేయడం అవమానించదగ్గ విషయమని అన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఉత్తరాంధ్రలో ఎన్నడూ లేని వింత పోకటి అవలంబిస్తున్నారని ఆరోపించారు. 20వ తేదీన తగరంపూడిలో ఉన్న స్వర్గీయ గుడివాడ గుర్నాధరావువిగ్ర హం రెండు చేతులు విరగొట్టడం చెయ్యకు పాల్పడ్డారన్నారు. ఉత్తరాంధ్రలో మతాలకు కులాలకు అతీతంగా రాజకీయ వ్యక్తిగా గుర్తింపు పొందిన వ్యక్తిని అన్నారు. వైయస్సార్ పాలనలో ఎన్నడు ఇటువంటి దుశ్చర్యలు జరగలేదన్నారు. విగ్రహం దాంసం చేసిన ఆకదాలను పోలీసులు పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోద్దపు ఎర్రయ్య దొర, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, మండల పార్టీ అధ్యక్షులు కొల్లి త్రినాధరావు, మాజీ కో ఆప్షన్ మెంబర్ దూది నరసింహమూర్తి, వైసీపీ నాయకులు పిల్లా త్రినాధరావు, ఎడ్ల వాసు, పడాల నాని పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్తో పాటు అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు.!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**





మండలంలోని చందనాడ వద్ద సోమవారం జరిగిన మిట్టల్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమం సందర్భంగా అద్భుతమైన ఏర్పాట్లు విషయంలో జిల్లా యంత్రాంగం కష్టపడి పని చేశారని, ప్రధానంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ లను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఆమెతోపాటు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జిల్లా, నియోజకవర్గస్థాయి అధికార యంత్రాంగాన్ని అభినందించారు. ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ,జిల్లా కలెక్టర్ ,ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

## సీతారాములు కళ్యాణ మహోత్సవానికి ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న కమిటీ సభ్యులు..

**ఎలమంచిలి, మార్చి 23, ప్రభాతవార్త:**



పట్టణంలోని కొత్తపేట సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 27వ తేదీన జరుగు కళ్యాణ మహోత్సవానికి కొత్తపేట సీతారాముల కళ్యాణ మహోత్సవ పురోహితులు, స్థానికులు కలిసి ఇంటింటికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేస్తున్నారు.

## పవన్ కళ్యాణ్ స్వాగతం పలికిన "తోట, గెడ్డం" .!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**







రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మండలంలోని చందనాడ వద్ద మిట్టల్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి సోమవారం వచ్చిన సందర్భంగా హెలికాప్టర్ వద్ద రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తో పాటు జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేష్, నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ గడ్డం బుజ్జి లతోపాటు పలువురు నాయకులు స్వాగతం పలికారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**(అడ్డురోడ్డు, ప్రభాతవార్త )**



మండలంలోని రాజయ్య పేట చందనాడ మధ్య సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా లక్ష్మీ మిట్టల్, ఆదిత్య మిట్టల్ లా ఆధ్వర్యంలో జరిగే స్టీల్ ప్లాంట్ భూమి పూజకు సంబంధించి ముందుగా సభలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ప్రజలను ఆకట్టుకుంది. అనేకమైన రూపాలతో వేదిక దద్దరిల్లింది.

## కళాకారుల ప్రతిభకు వేదికగా నూకాంబిక ఉత్సవాలు

**- సాంస్కృతిక వైభవంతో ఘనంగా కొనసాగుతున్న నూకంబిక అమ్మవారి 7వ రోజు రాష్ట్ర మహోత్సవాలు**

**అనకాపల్లి, మార్చి 23;( ప్రభాతవార్త)**





అనకాపల్లి జిల్లా సాంస్కృతిక కాంతులతో కళకళలాడుతోంది. ఉత్తరాంధ్రల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి రాష్ట్ర పండుగ మహోత్సవాలు ఏడో రోజు సోమవారం రాత్రి అట్టహాసంగా కొనసాగాయి. మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మరియు జనసేన పార్టీ ఇంచార్జ్ రామ్కి పర్యవేక్షణలో ఈ వేడుకలు మరింత వైభవంగా నిర్వహించబడుతున్నాయి. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు అనకాపల్లి ఎన్టీఆర్ మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. అనకాపల్లి బృందం ప్రదర్శించిన "ధ్యాన గణపతి కల్చరల్ నైట్"లో క్లాసికల్ భక్తి ఆలాపనలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించగా, ఏలూరు నుంచి వచ్చిన నాట్య భారతి అకాడమీ జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాలకు విచ్చేసిన ప్రజలు ఆనందంతో మునిగిపోయారు. స్థానికులు ఈ మహోత్సవాల నిర్వహణపై శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జనసేన పార్టీ ఇంచార్జ్ రామ్కికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా వరదాయిని మానవసేవ మాధవ సేవ సభ్యులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నెలరోజుల పాటు జరుగుతున్న నూకాంబిక అమ్మవారి మహోత్సవాలు అనకాపల్లి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నాయని తెలిపారు. మహోత్సవాల సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ పీలా నాగ శీను, ఈవో శ్రీధర్, ధర్మకర్తల మండల సభ్యులు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ లు తిమ్మ పాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, మరియు గండేపల్లి మురళి, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ పాల్గొన్నారు... సాంప్రదాయం - సాంస్కృతికం - భక్తి కలయికగా ఈ మహోత్సవాలు అనకాపల్లిలో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి.

## ఘనంగా క్షయ నివారణ ర్యాలీ.!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



ప్రపంచ నివారణ దినోత్సవ సందర్భంగా సూపరిడెంట్ డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి వైద్య సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ తో పాటు వైద్యులు రవి కిరణ్, ఈశ్వరప్రసాద్, మహిళ వైద్యులు, హెడ్ నర్స్, స్టాఫ్ నర్స్ లు ఫార్మసిస్ట్ ఇమామ్, రేడియో గ్రాఫర్ వర్మ తదితరులు ఉన్నారు.

## మూకాంబికా అమ్మవారిని దర్శించుకున్న మార్క్ పెడ్ మాజీ ఛైర్మన్ గోపాలరాజు

**అనకాపల్లి,మార్చి23:( ప్రభాహవార్త)**



అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారిని సోమవారం ఆంధ్ర ప్రదేశ్ మార్క్ ఫెడ్ మాజీ ఛైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా డీ సీ ఎం ఎస్ మాజీ ఛైర్మన్ డీ వీ వీ గోపాల్ రాజు (పెదబాబు), తుని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి పూర్ణకుంభం తో స్వాగతం పలికి, అమ్మవారి చిత్రపటం అందజేసి, ఆలయ ఛైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు). సత్కరించారు. అనంతరం నవరాత్రి ఉత్సవాలను మార్క్ఫెడ్ మాజీ ఛైర్మన్ డివివి గోపాల్ రాజు, మెహర్ బేబీ దంపతులు ప్రారంభించారు.

## పవన్ కళ్యాణ్కు వెంకటేశ్వర స్వామి బొమ్మను అందజేసిన మీగడ

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



నక్కపల్లి పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కు పట్టణానికి చెందిన టిడిపి నాయకులు మీగడ సత్యనారాయణమూర్తి మర్యాద పూర్వకంగా కలిసి వెంకటేశ్వర స్వామి బొమ్మను అందజేశారు.

## విజయవంతంగా స్టీల్ ప్లాంట్ భూమి పూజ..

**- తరలివచ్చిన వేలాది మంది ప్రజలు.. ఊపిరి పీల్చుకున్న అధికారులు.!**

**(నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త)**



మండలంలోని రాజయ్యపేట చందనాడ మధ్య సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరిగిన భూమి పూజ కార్యక్రమానికి సూచించిన విధంగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. ప్రత్యేక వాహనాల్లో సభ వేదిక వద్దకు ఉదయం 11 గంటల నుంచి ప్రజలు మహిళలు విద్యార్థులు రావడం మొదలుపెట్టారు .వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. వాతావరణం సహకరించడంతో ఎక్కడ ఎటువంటి అసౌకర్యాలు జరక్కుండా ఎప్పటికప్పుడు వచ్చిన ప్రజలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాలంటీర్లు మంచినీరు ,మజ్జిగ అందిస్తూ వారికి సహకరించారు. జాతీయ రహదారి నుంచి మొదలుకొని సభా ప్రాంగణం వరకు ఊహించిన విధంగా కూటమి నాయకులు స్వాగతం పలికేందుకు భారీ కటౌట్లు లు ఏర్పాటు చేశారు. ఇది ఇలా ఉంటే జిల్లా యంత్రాంగం కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో డి ఐ జి గోపీనాథ్ జెట్టి తో పాటు జిల్లా ఎస్పీ ,జాయింట్ కలెక్టర్ తదితర అధికారులు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న సభా వేదిక వద్దకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు చేరుకునేటట్లు అన్ని ఏర్పాట్లు చేశారు. సభ విజయవంతం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ అతిధులు కూర్చునే గ్యాలరీతోపాటు వీవీఐపీ గ్యాలరీలోకి పెద్ద ఎత్తున సభ్యులు రావడంతో సభకు వచ్చిన కొంతమంది అసహనాన్ని గురయ్యారు. అధికారులు హెచ్చరించినప్పటికీ ఎవరు వెళ్ళలేని పరిస్థితి.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కు స్వాగతం పలికిన జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి సూర్యచంద్ర

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**



నక్కపల్లి ప్రాంతంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ భాగస్వామ్యంతో సుమారు 1.49 లక్షల కోట్లు ఖర్చుతో నిర్మిస్తున్న ఉక్కు కర్మాగార సభ ప్రాంగణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ విచ్చేశారు. ఈ సందర్భంగా జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర ప్రత్యేకంగా పవన్ కళ్యాణ్ ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ భారీ పారిశ్రామిక ప్రాజెక్ట్ ఉత్తరాంధ్ర ప్రాంతంలో అభివృద్ధికి తోడ్పడే విధంగా, వేలాది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనుందని సూర్యచంద్ర అన్నారు. సూర్యచంద్ర వెంట జిల్లా కార్యదర్శి పంచాడ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పేరు ఎత్తితే చాలు.. మారుమ్రోగిన సభ ప్రాంగణం.!

**(అడ్డురోడ్డు, ప్రభాతవార్త)**





ఆర్సి లార్ మెటల్ నిఫాన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన సందర్భంగా మండలంలోని రాజయ్యపేట చందనాడ గ్రామాల మధ్యలో జరిగిన సభలో వేదిక మీద ఉన్న అతిథులు లోకేష్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస్ వర్మ, లక్ష్మీ మిట్టల్, ఆదిత్య మిట్టల్, చివరిలో మాట్లాడిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తదితరులు మాట్లాడుతున్న సందర్భంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేరు చెబితే చాలు సభ మొత్తం ఒక్కసారిగా హోరెత్తింది. పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నంత సేపు సభ అంతా మారు మ్రోగుతూనే ఉంది. అదే కాకుండా చంద్రబాబు మాట్లాడేందుకు వేదికపైకి వచ్చినప్పుడు చంద్రబాబు జిందాబాద్ అంటూ.. థాంక్యూ సీఎం అంటూ నినాదాలు హోరెత్తాయి. కానీ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు వచ్చిన గ్రామీణ ప్రాంత ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, రాష్ట్ర విద్యా మంత్రి నారా లోకేష్ ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ఇంగ్లీషులో ప్రసంగించడం వలన కొంత ఇబ్బంది పడ్డారు .కానీ కేంద్ర గనుల శాఖ మంత్రి హెచ్డి కుమార్ స్వామి తెలుగులో మాట్లాడడం ఆశ్చర్యం కలిగించింది.

## చంద్రబాబుకు స్వాగతం పలికిన కొణతాల

**అనకాపల్లి,మార్చి23; ( ప్రభాతవార్త)**



అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి వద్ద దేశంలోనే అతిపెద్ద ఆర్సెలార్ మిట్టల్ - నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని హెలిపాడ్ వద్ద మాజీ మంత్రి వర్యులు, అనకాపల్లి శాసన సభ్యులు ..కొణతాల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలుసుకొని స్వాగతం పలికారు.



డిప్యూటీ సిఎం పవన్ కు స్వాగతం పలికిన కొణతాల..

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి వద్ద దేశంలోనే అతిపెద్ద ఆర్సెలార్ మిట్టల్ - నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ ని హెలిపాడ్ వద్ద మాజీ మంత్రి వర్యులు, అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకొని స్వాగతం పలికారు.

## సభలో ఆసక్తికరమైన పరిణామాలు.!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



మండలంలోని రాజయ్యపేట చందనాడ వద్ద ఆర్సిలాల్ మిట్టల్ నిఫాన్ స్టీల్ ప్లాంట్ భూమి పూజకు సంబంధించి జరిగిన కార్యక్రమంలో వేదికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు కుమార్ స్వామి, శ్రీనివాస్ వర్మ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, శాసనసభ స్పీకర్ సి హెచ్ అయ్యన్న పాత్రుడు ,రాష్ట్ర మంత్రులు ,ఎమ్మెల్యేలు, రాష్ట్ర హోం మంత్రి అనిత లు ఉన్నారు. ఆ సమయంలో ఆర్సిలార్ మిట్టల్ నిఫాన్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ అధినేతలు లక్ష్మీ మిట్టల్ ,ఆదిత్య మిట్టల్ ఉన్నారు. ప్రారంభోత్సవానికి సంబంధించి స్టీల్ ప్లాంట్ వివరాలను తెలియజేస్తూ అతిధులకు శుభాకాంక్షలు చెప్పేందుకు తండ్రి కొడుకులు ప్రసంగించారు. తండ్రి లక్ష్మి మిట్టల్ మాట్లాడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పక్కన కూర్చుండగా కుమారుడు ఆదిత్య మిట్టల్ మాట్లాడుతుండగా తండ్రి లక్ష్మీ మిట్టల్ తన సెల్ ఫోన్లో ఫోటో తీశారు. సంఘటన చూసి వేదిక మీద అతిధుల్లో సంతోషం కనిపించింది. ఇదే కాకుండా రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును వేదికపై చూసిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆప్యాయతగా పలకరించుకొని ముందుకు సాగారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసంగం అనంతరం ముఖ్యమంత్రితో మాట్లాడి వేగవంతంగా వెళ్లిపోవడానికి ప్రయత్నించగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తనతో వెళ్లి దగ్గరుండి ఆయన కు వీడ్కోలు పలికారు. అనంతరం సభ వద్దకు చేరుకున్నారు.



## 26న నీలమణి దుర్గ అమ్మవారి హుండీ లెక్కింపు



పాతపట్నం, మార్చి 23 ప్రభాతవార్త: ఉత్కళాంధ్రుల ఇలవేల్పు, పాతపట్నంలో వెలసియున్న ప్రము ఖ పుణ్యక్షేత్రం నీలమణి దుర్గా అమ్మవారి దేవస్థానంలో ధర్మ హుండీలను మార్చి 26వ తేదీన ఉదయం 10 గంటలకు తెరచి లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టి. వాసుదేవరావు తెలిపారు. దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి చైర్మన్ అక్కంధ్ర సన్యాసిరావు, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు, సేవా సమితి సభ్యుల సమక్షంలో ఈ హుండీ లెక్కింపు అత్యంత పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో పాల్గొనదలచిన ఆసక్తి గల భక్తులు తప్పనిసరిగా నిర్దేశించిన డ్రెస్ కోడ్ పాటిస్తూ హాజరుకావాలని ఈవో వాసుదేవరావు కోరారు.

## అమరవీరుల త్యాగం చిరస్మరణీయం



పాతపట్నం, మార్చి 23 ప్రభాతవార్త: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.కృష్ణారావు అధ్యక్షతన పాతపట్నంనకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో సర్దార్ భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గుర్ 95వ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి, సుఖదేవ్, రాజ్‌గుర్ చిత్రపటాలకు జాతీయ నూలు పోగులు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖాధికారి ఎ.గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారి చేతిలో వీర మరణం పొందిన భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గుర్ త్యాగాలను స్మరించుకునేందుకు, మనదేశంలో ప్రతిఏటా మార్చి 23న అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ముగ్గురూ వీరులు బ్రిటిష్ వారు ఏర్పాటు చేసిన సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు లాలాలజపతిరాయ్ హత్య నేపథ్యంలో ఈ ముగ్గురు బ్రిటిష్ అధికారి అయిన జాన్ పి సాండర్స్‌ను కాల్చి చంపారని, బ్రిటిష్ వారు 1931 మార్చి 23న లాహోర్ సెంట్రల్ జైల్లో ఈ ముగ్గురిని ఉరి తీశారని పేర్కొన్నారు. అలాగే రామరాజు, కృష్ణారావు మాట్లాడుతూ ఈ ముగ్గురు దేశం కోసం ప్రాణాలర్పించిన మహోన్నతులని, 23 సంవత్సరాల ప్రాయంలోనే బ్రిటీష్ వారి రాక్షసత్వానికి ఉరికంబమెక్కిన జాతిరత్నాలని, నిత్యస్మరణీయులన్నారు. ఉపాధ్యాయులు బి.రాజేశ్వరి, జె.గాయత్రి,ఎం.ఢిలేశ్వరావు, హెచ్.శ్యామల,విద్యార్థులు పాల్గొని అమరవీరులకు నివాళులు అర్పించారు.

## రాజాంలో వైసీపీ కార్యాలయం ఎక్కడ..?

రాజాం, మార్చి 23, ప్రభాతవార్త రాజాం నియోజకవర్గంలో వైయస్సార్ రాజకీయ పార్టీకి సంబంధించి కార్యాలయం ఎక్కడుందో కార్యకర్తలకు, అభిమానులకు, నాయకులకు, ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. గత 2024లో సార్వత్రిక ఎన్నికల సమయంలో పాలకొండ రోడ్‌లో ఓ షాపింగ్ మాల్‌పై భవనాన్ని అద్దెకు తీసుకొని పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఎన్నికల ముగిసిన తదుపరి ఆ భవనాన్ని ఖాళీ చేశారు. ప్రస్తుతం ఆ పార్టీ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో నియోజకవర్గంలో వైయస్సార్ పార్టీ నాయకులు అభిమానులు, ప్రజలు తమ సమస్యలను ఎక్కడికి వెళ్లి చెప్పుకోవాలనే పరిస్థితి ఏర్పడింది. రాజాం నియోజకవర్గం వైయస్సార్ పార్టీ ఇన్‌చార్జ్‌గా డాక్టర్ తలే రాజేష్ బాధ్యతలు చేపడుతున్నారు. అయితే నియోజవర్గంలో పార్టీ సమావేశం ఏర్పాటు చేయాలంటూ తన నివాస గృహంలో ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా పార్టీకి సంబంధించిన ముఖ్యమైన విషయాలు, ప్రజలు అభిప్రాయాలు, ఫిర్యాదులు చెప్పుకోవాలంటే ఇన్‌చార్జ్ నివాసానికి రప్పించుకుంటున్నారని తెలుస్తుంది. అంతే తప్ప ఏ విధమైన పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయలేదు. ఇటీవల వైయస్సార్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం లేక తన నివాస గృహంలోని ఏర్పాటు చేయడం గమనార్హం. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పార్టీకీ సంబంధించిన కార్యాలయం లేదంటే ఇన్‌చార్జ్ ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు దోలామయం చెందుతున్నారు.

## విత్తన గుళికలు తయారీ విధానం



కంచిలి, మార్చి 23, ప్రభాతవార్త : అంపురం యూనిట్‌లో గల బోగాబెణి గ్రామంలో ఎల్‌నినో ప్రభావాన్ని సూచిస్తోంది. వాతావరణ పరిస్థితిని బట్టి ముందస్తుగా రైతులకు ముందుగా విత్తన గుళికలు తయారు చేసుకోవాలని మాస్టర్ ట్రైనర్ శివానందం, జీవిత రైతులకు తెలియజేశారు.

## స్టీల్‌ప్లాంట్‌తో యువతకు ఉద్యోగ అవకాశాలు



ఆమదాలవలస, మార్చి 23, ప్రభాతవార్త : దేశంలో అతి పెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో సమీకృత ఉక్కు పరిశ్రమ ఏర్పాటు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సందర్భంలో ఎమ్మెల్యే రవికుమార్ కొత్త రోడ్‌లో ఉన్న నివాసాలకు ఇంటింటికి వెళ్లి రాష్ట్రానికి, ఉత్తరాంధ్ర ప్రాంతానికి జరగబోయే అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పేడాడ రామ్‌మోహన్ రావు, తాండ్ర హరి, బెండి రామ్మోహన్ రావు, బుడుమూరు సీతారాం, హనుమంతు బాలకృష్ణ, కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవా దృక్పథంతో మనుషులు మహనీయులుగా : ఎంఈవో



సంతబొమ్మాళి, మార్చి 23, ప్రభాతవార్త : సమాజానికి సేవ చేయాలనే సంకల్పం ఉన్న వ్యక్తులు చరిత్రలో మహనీయులుగా గుర్తించబడతారని సంతబొమ్మాళి మండల విద్యాశాఖాధికారి జలుమూరు చిన్నవాడు అన్నారు. తథాగత సంఘమిత్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ మండలం కొత్తపే ట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు శ్వేత దుస్తుల పంపిణీ జరిగింది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డీఏ స్టాలిన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భావనపాడు సర్పంచ్ బి.మోహన్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ జనార్ధన, విద్యా కమిటీ చైర్మన్ కారాడ పుష్పలత, మత్స్యకార సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ, తదితరులు ప్రసంగించారు. ట్రస్ట్ సభ్యులు బి.చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన సిరిపురం



పాతపట్నం, మార్చి 23 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డిని జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు సోమవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాతపట్నం నియోజకవర్గంతో పాటు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఉన్న సమస్యలు, ఎస్టీ వర్గాల సంక్షేమానికి సంబంధించి పలు అంశాలపై వారు చర్చించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా షటిల్ స్టార్ ఉగాది టోర్నమెంట్



పాతపట్నం, మార్చి 23, ప్రభాతవార్త : స్థానిక షటిల్ స్టార్ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా ముగిసింది. ఈ పోటీల్లో క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతూ హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీలలో డోల వెంకటరమణ, దకర సాయికుమార్ జట్టు విజేతలుగా నిలవగా, లోపింటి సుధీర్, దాసుపురం భాగ్య టీమ్ రన్నర్స్‌గా గెలుపొందారు. విజేతలకు షటిల్ స్టార్స్ గ్రూప్ సభ్యుల చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ పోటీలకు కావాల్సిన బహుమతులను తారక రామారావు స్పాన్సర్‌గా అందించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి ఎంతో తోడ్పడతాయని ఈ సందర్భంగా అతిథులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, మార్కెట్ యార్డ్ వాకర్స్, సెట్లర్స్, స్థానిక క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



కోటబొమ్మాలి, మార్చి 23, ప్రభాతవార్త: మండలం జాతీయ రహదారి నిమ్మాడ జంక్షన్ ఫ్లైఓవర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరకు గాయాలయ్యాయి. ఒరిస్సా నుండి మండపేట ధాన్యం లోడుతో వెళుతున్న లారీని అదే రహదారిలో వెనుక నుంచి స్పీడుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందిని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన మోహన్ గుడియా, మందస మండలం హరిపురం గ్రామానికి చెందిన సాయికుమార్‌లకు తీవ్రంగా గాయాలయ్యాయి. వీరికి 108 సహాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యం కోసం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## హెచ్‌జే దొరకు ఘన నివాళి



కోటబొమ్మాళి, మార్చి 23, ప్రభాతవార్త: మాజీ డీజేపి హెచ్‌జే దొర ఇటీవల హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు హైదరాబాద్‌లోని దొర నివాసంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## 25 నుంచి ఊడికలపాడులో శ్రీరామనవమి ఉత్సవాలు

కోటబొమ్మాళి, మార్చి 23, ప్రభాతవార్త: మండలంలో గల చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు గ్రామంలో ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఈ మూడురోజులు బధ్రాదిరాముడికి భద్రాచలంలో ఎలా శ్రీరామ ఉత్సవాలు జరుగుతాయో అదే విదంగా ఈ గ్రామంలో జరుగుతాయని ఆలయ నిర్వాహకులు సనపల కరుణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, రాష్ట్రంలో పేరొందిన ప్రముఖులచే ప్రవచనాలు, భజనలు ఉంటాయన్నారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని, 27వ తేదీ ఉదయం 9 గంటలకు సుమారు 25 మంది దంపతులచే శ్రీ సీతారామకళ్యాణం నిర్వహించబడుతుందని, అదే రోజు మధ్యాహ్నం 10 వేలు మంది భక్తులకు అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## అధైర్యపడొద్దు.. ఆదుకుంటా

### బాలికకు సైకిల్ అందించిన డాక్టర్ దానేటి శ్రీధర్



ఆముదాలవలస, మార్చి 23, ప్రభాతవార్త: నిరుపేద విద్యార్థుల చదువు కోసం నిత్యం ప్రోత్సహిస్తూ వారికి నగదు ప్రోత్సాహకాలు, పుస్తకాలు ఇతర సామాగ్రి అందించే డాక్టర్ దానేటి శ్రీధర్ మరో అడుగు ముందుకు వేశారు. కష్టం ఉంది సార్ అని నన్ను కలిసిన వారికి తన చేతనైన సాయం అందజేసి వారి ముఖాల్లో ఆనందం నింపుతున్నారు. జనసేన నాయకులు, ప్రముఖ గైనిక్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ ఆమదాలవలస మండలం ముద్దాడ పేటకు చెందిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన బాలిక తొగరాం జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసిస్తోంది. ముద్దాడ పేటకు చెందిన దుర్గ భవాని తాను నిత్యం తొగరాం జూనియర్ కళాశాలకు తీవ్ర ఇబ్బందులు పడి వెళ్లాల్సి వస్తుందని తనను ఆదుకోవాలని డాక్టర్ దానేటి శ్రీధర్‌ను కోరింది. వెంటనే స్పందించిన దానేటి శ్రీధర్ బాలికకు సైకిల్‌ను అందజేశారు. డాక్టర్ దానేటి శ్రీధర్ సైకిల్ అందించడంతో ఆ బాలిక, కుటుంబ సభ్యులు ఆనందంగా కృతజ్ఞతలు తెలిపారు. పేదరికంలో పుట్టడం తప్పు కాదని పేదరికంలోనే ఉండిపోవడం చాలా తప్పు అని ఉన్నత విద్యను అభ్యసించి గొప్ప లక్ష్యాలను చేరుకోవాలని దుర్గాభవానికి డాక్టర్ దానేటి శ్రీధర్ సూచించారు. భవిష్యత్తులో ఏ అవసరమైనా తాను అండగా ఉంటానని అధర్య పడద్దని దుర్గ భవానికి డాక్టర్ శ్రీధర్ హామీని ఇచ్చారు.

## మరువాడలో నూతన విద్యుత్ లైన్ కేబుల్ లైన్ మార్పిడి



సంతబొమ్మాళి, మార్చి 23, ప్రభాతవార్త: మండలంలోని మరువాడ పంచాయతీలో చొక్కరవానిపేట గ్రామం నుండి ఆర్ మరువాడ గ్రామం వరకు కొత్తగా విద్యుత్ కేబుల్ లైన్ సోమవారం మార్పిడి చేశారు. విద్యుత్ కేబుల్ లైన్ పూర్తిగా పాడై పోవడంతో తరుచుగా గ్రామలకు చివరన ఉన్న ఇళ్ళుకు కరెంట్ ఇబ్బందిగా మారుతుంది. ఈ విషయం స్థానిక సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు పలుమార్లు విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు దృష్టిలో పెట్టడంతో ఎట్టకేలకు ఆయన ఆదేశాలతో విద్యుత్ శాఖ అధికారులు కొత్త కేబుల్ లైన్ కోసం సామాగ్రి తెచ్చి సమస్యకు పరిష్కారం చూపారు. దీంతో గ్రామస్తులు మంత్రి అచ్చెన్నాయుడు, సర్పంచ్‌కి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చొక్కర నరసింహులు, సూరాడ కృష్ణ, జె.ఎల్ ఎం హేమసుందర్, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



పాతపట్నం, మార్చి 23, ప్రభాతవార్త: మండలంలోని స్వర్ణ గ్రామాల అభివృద్ధి పనుల పురోగతిని మండల స్వర్ణ గ్రామం అధికారి బి కృష్ణారావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన చంగుడి, పాతపట్నం2, పాతపట్నం3 గ్రామ సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాలలోని మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులను సమీక్షించారు. ఎస్జి ఎస్డబ్ల్యు పెండింగ్‌లో ఉన్న సర్వేలను ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే పూర్తి చేయాలని సిబ్బం దిని సూచించారు. నిర్ణీత గడువులోగా నివేదికలను సమర్పించి, స్వర్ణ గ్రామ అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలని, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

కంచిలి, మార్చి 23, ప్రభాతవార్త: కంచిలి మండలం మఠం సరియాపల్లి పీఎం శ్రీ ఏపీ మోడల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.శివ ప్రసాద్ తెలియజేశారు. ఈ నెల ఏప్రిల్ 30వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఓసి, బిసి విద్యార్థులు 200 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 150 రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. 10వ తరగతి మెరిట్ ఆధారంగా మే 3వ తేదీన మెరిట్ లిస్ట్ ప్రకటించి, ప్రవేశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ అన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసి, సిఐసి గ్రూపులో ప్రవేశాలు పొందవచ్చని అని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9985975684 నెంబర్‌కు సంప్రదించవచ్చని అన్నారు. దూర ప్రాంత విద్యార్థులకు హాస్టలు వసతి కలదు.

## భారతీయ సంస్కృతి గొప్ప సంపద



కంచిలి, మార్చి 23, ప్రభాతవార్త : హిందువులకు భారతీయ సంస్కృతి గొప్ప సంపదని అసుతోస్ పాండే, రాజా స్కేటర్ అన్నారు. బీహార్ రాష్ట్రం శివాని జిల్లాకు చెందిన వీరిద్దరూ అసుతోస్ పాండే సైక్లింగ్, రాజా స్కేటింగ్ చేస్తూ భారతదేశంలో చార్ధామ్, 12 జ్యోతిర్లింగాలు పర్యటిస్తారు. ఫిజికల్ ఫిట్నెస్, భారతీయ సంస్కృతి ప్రజలకు తెలియ జేయడానికి యాత్ర చేపట్టారు. 2026 జనవరి 29వ తేదీన అస్తోష్ పాండే సైక్లింగ్‌తో రాజా స్కేటింగ్ చేస్తూ ఇప్పటికే 2500 కిలోమీటర్లు పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రం కొబ్బరికాయల పారిశ్రామిక వేత్త సంజయ్ కుమార్ శర్మ ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా వారిద్దరిని సంజయ్ కుమార్ శర్మ, ఆయన కుమారుడు మున్నా దుశ్శాలువతో సన్మానిస్తూ భోజన సౌకర్యం కల్పించారు. వీరిద్దరూ భారత దేశంలో 16000 కిలోమీటర్లు పర్యటిస్తారని తెలిపారు. రోజుకి 100 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తూ సాయంత్రం వేళ దేవాలయాలు వద్ద ఆశ్రయం పొందుతారు.

## ఏఎస్ కవిటిలో ఆడ లేగ దూడల ప్రదర్శన



పాతపట్నం, మార్చి 23, ప్రభాతవార్త: పాడి పరిశ్రమలో మేలుజాతి పశువుల పెంపకమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు రైతులకు ఎంతో మేలు చేకూరుస్తాయని జిల్లా పశు ఘనాభివృద్ధి శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సత్య ప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం పాతపట్నం మండలం ఏ.ఎస్. కవిటి గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఆడ లేగదూడల ప్రదర్శన అత్యంత ఉత్సాహంగా సాగింది. గ్రామ సర్పంచ్ నక్క మార్కండేయలు అధ్యక్షతన జరిగిన ఈ ప్రదర్శనలో స్థానిక పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 50 మేలుజాతి లేగ దూడలను రైతులు ప్రదర్శనకు తీసుకువచ్చారు. గ్రామ పెద్దలు కొంగాన సంజీవరావు, అంపోలు భాస్కరరావుతో పాటు సిబ్బంది వల్లభరావు, రామ్మోహనరావు, గుణాలు, యశ్వంత్, నిరంజన్, వీరమ్మ, బాబురావు, జగదీష్, రైతులు, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వీరుల అమరత్వానికి మరణం లేదు



మెళియాపుట్టి, మార్చి 23, ప్రభాతవార్త: షాహిద్ సర్దార్ భగత్‌సింగ్ అమరులు అయ్యి నేటికి 95 సంవత్సరాలు అవుతుంది. వీరులు అమరత్వానికి మరణం లేదనడానికి ఒక నిదర్శనం. అప్పటి ఉమ్మడి భారతదేశం నేడు పాకిస్థాన్‌లో ఉన్న లాహోర్ జైల్‌లో మార్చి 23, 1931లో భగత్ సింగ్‌తో పాటు రాజ్ గురుదేవ్, సుఖదేవులను ఉరి తీయడం జరిగింది. పెన్ను కన్నా గన్ పడితే స్వతంత్రం సాధించగలమని గట్టిగా నమ్మిన సిద్ధాంతంతో ముందుకు వెళ్లారు. భారతదేశంలో ఆనాటి స్వతంత్ర సమర పోరాటంలో భగత్ సింగ్ పాత్ర గెరిల్లా పాత్ర ఆతని పోరాట పటిమ మన యువతకు ఆదర్శం భగత్ సింగ్ ఆదర్శాలు నేటి మన జనసేన యువకులతో జనసైనికులతో సాధ్యపడతాయని నేను నమ్ముతూ అతని ఆశయాలను ముందుకు తీసుకెళ్తారని నమ్ముతూ ఇవే నా నిజమైన నివాళులు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ నాయకులు దుక్క బాలరాజు, రాణా జనార్దనరావు, కాకి సోమేశ్వరరావు, నక్క సుమంత్, కొంచాడ తిరుపతిరావు, రాణా సవరయ్య, నడిమింటి ఆనందరావు, నక్క బాలకృష్ణ, నడిమింటి ఫల్గుణరావు, కోట వాసు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త



## 30 లోగా వృద్ధులకు రేషన్ అందజేయాలి



కోటబొమ్మాళి, మార్చి 23 ప్రభాతవార్త: ప్రతినెల 26వ తేదీ నుండి 30 తేదీ లోపల అన్ని రేషన్ డిపోల పరిధిలో ముఖ్యంగా వృద్ధులకు రేషన్ అందజేయాలని స్థానిక సి.ఎస్.డి.టి. పి.రామచంద్ర రావు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి రేషన్ డీలర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. సకాలంలో డీడీలు తీసి రేషన్ తీసుకువెళ్లాలని, ప్రభుత్వ నిర్ణీత సమయానికి విక్రయాలు పూర్తి చేయాలని తెలిపారు. పంపిణీలో గాని తూకాల్లో గాని ఎక్కడ తేడాలు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రజలకు అందవలసిన నిత్యవసర సరుకులు విషయంలో ఎవరు రాజీ పడవద్దు అని, తనకు అందలేదని ఎవరు నుంచి ఫిర్యాదులు రాకూడదని సూచించారు. ఈ సందర్భంగా మరిన్ని సూచనలు, సలహాలు చేశారు. పలువురు డీలర్ సంఘం నేతలు తమ సమస్యలను డిటి దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించి అటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని రామచంద్ర స్పష్టం చేశారు.

## నేడు వీరఘట్టంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరఘట్టం, మార్చి 23 ప్రభాతవార్త : ఈ నెల 24వ తేది మంగళవారం ఉదయం 9 నుండి 2 వరకు వీరఘట్టం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.విష్ణుమూర్తి సోమవారం విలేకరులకు తెలిపారు. 11కేవీ వీరఘట్టం ఫీడర్ నందు ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, చెట్లు తొలగించుట, ఇతర పనుల నిమిత్తం వీరఘట్టంతో పాటు నడుకూరు, చిట్టపులివలస, విక్రమపురం, కంబర, కంబరవలస, నడిమికెల్ల, కడకెల్లకు విద్యుత్‌ను నిలుపు దల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దయచేసి విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



వీరఘట్టం, మార్చి 23, ప్రభాతవార్త : భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా వీరఘట్టంలో సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి వేడుకల్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ స్వతంత్రం కోసం బ్రిటిష్ పుష్కర్లచే అమరులైన భగత్ సింగ్, సుఖదేవ్ రాజ్ గురులకు విప్లవ జోహార్లును ఈ సందర్భంగా అర్పించారు. కార్యక్రమంలో ఎన్.సింహాచలం, ఎన్.ప్రసాద్, వై.ప్రశాంత్, పి.మజ్జి, తదితరులు పాల్గొన్నారు.

## రామాయణంపై క్విజ్ పోటీలు

ఇచ్ఛాపురం, మార్చి23, ప్రభాతవార్త: శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని శ్రీమద్ వాల్మీకి రామాయణంపై క్విజ్‌ను 26 గురువారం సాయంత్రం 5గం.లకు దాసన్నపేట శ్రీరామ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని తేజేశ్వర శర్మ చెప్పారు. ఆసక్తి గలవారు 26 ఉదయం 8గం.లలోగా తమ పేర్లను నమోదు చేసుకొనగలరని పూర్తి వివరాలుకు 9640739213, 77804 54318 నెంబర్లలో తెన్నేటి తేజేశ్వరశర్మను సంప్రదించగలరని చెప్పారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఇచ్ఛాపురం, మార్చి 23 ప్రభాతవార్త: ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ బాబు ఆదేశాలు మేరకు పాయితారి గ్రామంలో సుభాష్ చికెన్ సెంటర్ నుంచి కీర్తిపురం గణేశ్ మందిరం రోడ్ వరకు సిమెంట్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం పి ఏ సి ఎస్ డైరెక్టర్ గిన్ని బాలరాజు, పాయితారి సర్పంచ్ అభ్యర్థి వలపల తులసి, వలపల నరహరి, లెంక మురళీకృష్ణ, వలపల తుంబనాథం, పూజారి సోమేష్, గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీకాలతో పాడి పశువులకు రక్ష : డాక్టర్ అనిల్



పాతపట్నం, మార్చి 23 ప్రభాతవార్త: మండలంలోని రంకిణి గ్రామంలో సోమవారం పశుసంవర్ధక శాఖ వారు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొరసవాడ పశు చికిత్సాలయం పశువైద్యాధికారి డాక్టర్ పారశెల్లి అనిల్ మాట్లాడుతూ పాడి పశువులకు టీకాలు వేయించడం ద్వారా వాటిని వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చునని తెలిపారు. అలాగే క్రమం తప్పకుండా ప్రతి ఆరు నెలలకు ఈ టీకాలు వేయించడం ద్వారా పశువులలో రోగ నిరోధక శక్తి బాగా పెరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో రంకిణి గ్రామ సర్పంచ్ సింహాచలం, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## దాబాలు నిర్ణీత సమయంలో మూసివేయాలి

### - టెక్కలి / కాశీబుగ్గ డీఎస్పీ లక్ష్మణరావు



కోటబొమ్మాళి, మార్చి 23, ప్రభాతవార్త: జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం దృష్ట్యా, రాత్రి వేళల్లో అనవసర గుంపులు, అశాంతి పరిస్థితులు , నేరాలకు దారితీసే అవకాశాలను నివారించేందుకు ధాబాల నిర్వహణపై టెక్కలి/ కాశీబుగ్గ డీఎస్పీ డి.లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. టెక్కలి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని ధాబాల యజమానులు ప్రతిరోజూ రాత్రి 11:00 గంటల లోపు తమ ధాబాలను తప్పనిసరిగా మూ సివేయాలి. అనుమతి లేకుండా రాత్రి ఆలస్యంగా ధాబాలను నిర్వహించడం, కస్టమర్లను అనుమతించడం చట్టపరమైన చర్యలకు గురికావచ్చు. రాత్రి 11 గంటల తర్వాత టిఫిన్ సెంటర్లు, స్ట్రీట్ ఫుడ్ దుకాణాలు తెరిచి ఉంచరాదని,ప్రతిరోజు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా రాత్రి 11 గంటల తర్వాత ఎటువంటి అత్యవసర కారణం లేకుండా ప్రజలు అనవసరంగా సంచరించరాదు. రాత్రి వేళల్లో సినిమాలకు వెళ్లిన వ్యక్తులు తిరుగు ప్రయాణంలో సినిమా టికెట్‌ను తప్పనిసరిగా కలిగి ఉండాలి. ధాబాల వద్ద మద్యం క్రయ విక్రయాలు, సేవించడం, మాదక ద్రవ్యాల వినియోగం, అనవసర గుంపులు చేరడం, శబ్ద కాలుష్యం సృష్టించడం వంటి కార్యకలాపాలను కఠినంగా నిషేధించడమైనది. ధాబాల యజమానులు తమ ప్రాంగణంలో ఇలాంటి అక్రమ చర్యలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అదేవిధంగా,సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి, సిబ్బంది వివరాలను నమోదు చేయాలన్నారు.అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆదేశాలను ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ హెచ్చరించారు.

## నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా బంద్

పాతపట్నం, మార్చి 23, ప్రభాతవార్త: పాతపట్నం మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని టెక్కలి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ. నరసింహకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ డి ఎస్ ఎస్ ప్రాజెక్టులో భాగంగా కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని గోపాలపురం, కొరసవాడ, బూరగం, బోరుభద్ర, సీతారాంపల్లి, కాగువాడ, కమలమ్మకొట్టు జంక్షన్, బగదల మరియు గురండి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి పనుల నిమిత్తం జరుగుతున్న ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మెరకముడిదాం, మార్చి 23, ప్రభాతవార్త : గర్భాం ఆదర్శ పాఠశాలలో 2026, 2027 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వా నిస్తు న్నట్లు ప్రిన్సిపాల్ డి.వి.ఎస్. అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, మెరిట్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 18 నుండి 30వ తేదీ లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవలసిందిగా సూచించారు. ఓసి, బిసి, ఇ.డబ్ల్యూ.ఎస్.లకు 200 రూపాయలు, ఎస్సీ ఎస్టీలకు 150 రూపాయలు దరఖాస్తు రుసుము అని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

## చెరుకు పంటతో అధికాదాయం



దత్తిరాజేరు, మార్చి 23, ప్రభాతవార్త : రైతులు చెరుకు పంట వేసుకున్నట్లయితే అదికాదాయం లభిస్తుంది వ్యవసాయ సహాయ సంచాలకులు నిర్మలాజ్యోతి అన్నారు . ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య పద్ధతులపై పప్పల లింగాలవలస గ్ర్రామలో చెరుకు పంటపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏడిఏ మాట్లాడుతూ వరి పంట కన్నా చెరుకు పంట రైతులకు లాభదాయకంగా ఉంటుందన్న ఒక్క ఎకరా చెరుకు పంట వేసుకున్నట్లయితే 85వేలు పంట దిగుబడి వస్తుందని రైతులకు సూచించారు. 40 వేలు రూపాయలు పంటకు ఖర్చు అయినా 45వేలు రైతుకు మిగులుతుంది అన్నారు. చెరుకు పంట పండించిన రైతులకు పొగరు ఫ్యాక్టరీ వారు ట్రాన్స్పోర్ట్ సదుపాయం కల్పిస్తారని 35 కిలోమీటర్ల దూరంకు తన్నుకో 280 చెల్లిస్తారని గతంలో మాదిరిగా కాకుండా రైతుల తమ పంట అమ్మిన మూడు రోజుల్లో రైతు యొక్క అకౌంట్ ఖాతాకు తండ్రుకు 3300 రూపాయలు చొప్పున జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రాఫ్ట్ ఈ కేవైసీ రైతులు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గోవిందమ్మ సూపర్ ఫ్యాక్టరీ డివిజనల్ అధికారి చంద్రమోళి వ్యవసాయ సహాయకులు నీలా కృష్ణ గ్రామ వ్యవసాయ స్థాయికులు కేజీయ టిడిపి నాయకులు ముకుంద పాల్గొన్నారు.

## త్వరలో అన్న క్యాంటీన్ ఏర్పాటు..?




శృంగవరపుకోట,మార్చి23, ప్రభాతవార్త: ఎస్.కోట మండల కేంద్రలో త్వరలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు జరగనున్నట్లు సమాచారం.అన్నా క్యాంటీన్ ఏర్పాటు దాదాపు ఏడాది క్రితమే జరగవలసి ఉన్నా కొన్ని విచిత్రమైన రాజకీయ సంఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో క్యాంటీన్ ఏర్పాటుకు అడ్డంకులు ఎదురయ్యాయి. దింతో క్యాంటీన్ ఏర్పాటుకు గండం ఏర్పడింది.అసలు విషయానికొస్తే ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి,జడ్పీ సీఈఓ కలిసి దాదాపు ఏడాది కిందటే పట్టణంలోని పాత బస్టాండ్ ను పరిశీలించారు.క్యాంటీన్ ఏర్పాటుకు ఇక్కడ అనుకూలంగా ఉంటుందని ఒక నిర్ణయానికి వచ్చారు.క్యాంటీన్ ఏర్పాటుకు సన్నహలు చేపట్టే తరుణంలో పెద్ద సమస్య ఏర్పడింది.స్థలం పరిశీలించిన సమయంలో పంచాయతీ పెద్దలు అధికారులను సంప్రదించకుండా స్థల పరిశీలన ఎలా చేస్తారనే వాదనలు మొదలయ్యాయి.స్థల పరిశీలనలో ముందుగా పంచాయతీ నుండి అనుమతులు తీసుకోవాలి.అనుమతులు కావాలంటే పంచాయతీ తీర్మానం చేయాలి.ఎవరినీ సంప్రదించకుండా అందుకు విరుద్ధంగా బస్టాండ్ లో స్థల పరిశీలన చేయడం కరెక్ట్ కాదని వాదనలు తెరపైకి వచ్చాయి.మరి అడ్డంకులు సృష్టించిన వారు ఎవరు అనే విషయానికొస్తే టీడీపీ పార్టీలో ఉన్న కొంత మంది నాయకులే వెనుక నుండి క్యాంటీన్ ఏర్పాటును అడ్డుకున్నట్లు సమాచారం. ఒకే పార్టీలో ఉండి ఏమైనా అంతర్గత విబేధాలు ఉంటే లోపాయికారకంగా చర్చించుకోవాలే తప్పా వందలాది మంది పేదలకు అన్నం పెట్టే క్యాంటీన్ ఏర్పాటుకు అడ్డంకులు సృష్టించడం సరికాదని పేద ప్రజలు ఆరోపిస్తున్నారు. వచ్చే నెల ఏప్రిల్ రెండవ తేదీతో పంచాయతీల పాలకవర్గం కాలం ముగియనుంది.ఇక అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలు కానుంది.తరువాత క్యాంటీన్ ఏర్పాటు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

## కూటమితోనే రైతులకు సంక్షేమం



కొమరాడ, మార్చి 23, ప్రభాత వార్త : రైతు సంక్షేమమే ఓటమి ప్రభుత్వ లక్ష్యయమని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ ఎస్ ఉదయ శేఖర్ పాత్రుడు అన్నారు సోమవారం దుగ్గి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద సకాలంలో నిధులు జమస్తున్నారని అన్నారు. అలాగే రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు డ్రిప్పు ఇరిగేషన్ వంటివి కూడా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ ఏఎంసి వైస్ చైర్మన్ గౌరీ శంకర్రావు తెదేపా నాయకులు త్రినాధం, కిషోర్, హరి ప్రసాద్ ,తవిటి నాయుడు, వేణు ,మురళితో పాటు పలువురు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు .

## పన్నులు వసూలే లక్ష్యంగా పనిచేయాలి : డీడీవో



చీపురుపల్లి, మార్చి 23, ప్రభాత వార్త: పంచాయతీల వారీగా కార్యదర్శిలు పన్నులు వసూలే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని చీపురుపల్లి డిడిఓ కే. హేమసుందర్ కార్యదర్శులకు సూచించారు. సోమవారం నాడు కర్లాం గ్రామ పంచాయతీలో జరుగుతున్న పన్నుల వసూలు కార్యక్రమంను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పలు పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతున్నా.. పట్టించుకోరా?



రామభద్రపురం, ప్రభాత వార్త : రామభద్రపురం మండల కేంద్రంలో ఉన్నటువంటి భారిక బంద చెరువుల్లో గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతున్న పట్టించుకోకుండా ఉన్నటువంటి అధికారులు సిపిఎం పార్టీ రామభద్రపురం మండల కార్యదర్శి బి.శ్రీను డిమాండ్ చేశారు. ఆయన సోమవారం బారిక బంధను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒకపక్క ఉపాధి హామీ పథకం పెట్టి చెరువులను బందులను రక్షించాలని చెప్పుంటే మరోపక్క అక్రమ రవాణా చెరువుల్లో ఉన్నటువంటి గ్రావెల్ నీ ప్రైవేటు వ్యక్తులు ఎత్తుకు పోతుంటే అధికారులకు కనిపించడం లేదని ఆయన అన్నారు.

## పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



దత్తిరాజేరు, మార్చి23,ప్రభాతవార్త: పాడి రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి సీనియర్ నాయకుడు కొండపల్లి కొండలరావు మార్కెట్ కమిటీ చైర్మన్ పివివి గోపాలరాజ్ అన్నారు దత్తి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం మరియు లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి కొండలరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పశు సంపద బాగా అభివృద్ధి చెందిందని పాడి రైతులకు పాల ఉత్పత్తి ద్వారా పాడి రైతులకు ఆదాయం పెరిగింది అన్నారు. కార్యక్రమంలో పసుపు దామోదర్ జిల్లా పశు గణాభివృద్ధి ఎగ్జిక్యూటివ్ అధికారి రాధాకృష్ణ సహాయ సంచాలకులు చంద్రశేఖర్ జిల్లా రోగ నిరోధక వైద్యాధికారి లలిత గారు పశు వైద్యాధికారులు అవినాష్ సుదీర్ సురేష్ సందీప్ టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ చప్ప చంద్రశేఖర్ క్లస్ట ఇన్చార్జీలు బోర్డర్ సింగ్ సత్తిబాబు సర్పంచ్ వరహాలమ్మ పశు వైద్య సిబ్బంది గోపాలమిత్రలు పాల్గొన్నారు

## భగత్‌సింగ్‌కు ఘన నివాళి




కురుపాం, మార్చి 23, ప్రభాతవార్త. మండలంలో జి శివడలో భరత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం ఆదివాసి గిరిజన సంఘ జిల్లా నాయకులు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిం చారు. దేశ స్వతంత్ర సమరంలో భగత్ సింగ్ చేసిన త్యాగాల గురించి చిరస్మరణీయమని అన్నారు. యువత ఆయన ఆశయాలతో పూర్తిగా నిలవాలని దేశ అభివృద్ధికి పాటు పడాలన్నారు.

## భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల సమతుల్య పద్ధతులు



బలిజిపేట, మార్చి 23, ప్రభాతవార్త : మండలం అరసాడ పద మాయవలస సుభద్ర వివిధ గ్రామాల్లో సోమవారం మండల అగ్రికల్చరల్ అధికారి శివ గణేష్ భూసార పరీక్ష పత్రాలను ప్రదర్శించి రైతులకు అవగాహన చర్యలు చేపట్టారు ఈ భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు సమతుల్య పద్ధతిలో వేయటానికి ఈ యొక్క భూసార పరీక్ష కార్డు రైతులందరికీ కూడా ఉపయోగపడుతుంది ఇందులో ముఖ్యంగా నైట్రోజన్ పర్సంటేజ్ అలాగే ఫాస్పరస్ అండ్ పొటాష్ మరియు జింక్ అలాగే అన్ని రకాల పోషకాలు భూములో ఎంత మోతాదులో ఉన్నాయో అనేది మనకు ఈ కార్డు ద్వారా తెలుసుకోవచ్చు తదుపరి తక్కువ ఉన్నచోట మనం ఆ యొక్క సంబంధిత పోషకాలను మనము భూమికి అందించాలి దీని ద్వారా రైతులు పెట్టినటువంటి ఖర్చు తగ్గించుకోవచ్చు క్షుణ్ణంగా వివరించడం జరిగింది. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రము పని చేస్తున్న సిబ్బంది మరియు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదులో బొబ్బిలి భేష్




బొబ్బిలి, మార్చి 23, ప్రభాతవార్త : జిల్లాలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదులో నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ గిరడ అప్పలస్వామి బేస్ అని అమరావతి పార్టీ కార్యాలయం కితాబ్ ఇచ్చింది. బొబ్బిలి నియోజకవర్గంలో జనసేన పార్టీ ఇంచార్జ్ ప్రత్యేక చొరవతో ఒక్కరే 2200 సభ్యత్వాలు తన సొంత సొమ్ముతో పూర్తి చేయగలిగారు. ఉన్నవి పార్టీ కార్యకర్తలు 2800 పూర్తి చేశారని మొత్తం ఐదు వేలు 500 రేపటిలోగా పూర్తి చేయాలని కార్యకర్తలంతా ఒక్కతాటిపై నడిచి బొబ్బిలి నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉంచడమే లక్ష్యంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక్కరోజు కష్టపడి పని చేస్తే స్థానిక ఎన్నికల్లో మనకి ప్రత్యేక స్థానం ఇస్తారని గుర్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో 16 లక్షలు జరుగుతుండగా ఇటీవల సమయాభావం వల్ల ఎమ్మెల్యేలు ఎంపీలు ఈ నమోదు కార్యక్రమానికి హాజరు కాలేకపోయినా అన్నారు నేడుపూర్తిగా విచ్చేసి అత్యధిక సభ్యత్వ నమోదు చేయడమే మీ అందరి కృషితో జరుగుతుందని ఆయన అన్నారు. వీర మహిళ రామలక్ష్మి డ్రైవర్ల కిరణ్ కుమార్ జమ్మ గణేష్ పాల్గొన్నారు.

## వెలగవలస, పెంటలో రైతన్నా .. మీకోసం



బొబ్బిలి, మార్చి 23, ప్రభాతవార్త : రైతులు సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలని వ్యవసాయ అధికారి మజ్జి శ్యాం సుందర్ అన్నారు. వెలగవలస, పెంట గ్రామాలలో రైతన్న మీకు కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు నీటి భద్రత డిమాండ్ల సాగు పై మళ్లింపు వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు దీనికి ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వ్యవసాయ సహాయకులు నాగభూషణం శ్రావణ వరలక్ష్మి పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



నెల్లిమర్ల, మార్చి 23, ప్రభాత వార్త : ప్రభుత్వ పింఛన్ దార్ల సంఘం నెల్లిమర్ల తాలూకా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 70మందికి కంటి తనిఖీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పింఛన్ దార్ల సంఘం భవనంలోనెల్లిమర్ల, గుర్ల పింఛన్ దార్ల సంఘం ఆధ్వర్యంలో విజయనగరం మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది ఈ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించింది. ఈ శిబిరం లో వైద్యులు డాక్టర్ సంతోష్, నవీన్ 70మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురి ని ఉచిత శస్త్ర చికిత్స లకు ఎంపిక చేశారు. మరికొందరికి కళ్ళ అద్దాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రభుత్వ పింఛన్ దార్ల సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కెల్ల చిన్నం నాయుడు, బొమ్మన ఈశ్వరరావు,పింఛన్ దార్లు, కంటి రోగులు పాల్గొన్నారు.

## 28 లోగా ఇంటి పన్నులు పూర్తిచేయాలి



రామభద్రపురం, ప్రభాత వార్త : హౌస్ టాక్స్‌లు 28 లోగ పూర్తిచేయాలి డిడివో కిరణ్ కుమార్ డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఈరోజు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీతో హౌస్ టాక్స్ మీద మీటింగ్ పెట్టడం. రేపటి నుంచి 28వ తారీకు వరకు హౌస్ టాక్స్ స్పెషల్ డ్రైవ్ జరగాలని ఆదేశాలు జారీ చేసి ఉన్నారు 15 పంచాయతీ సెక్రెటరీలను రామభద్రపురం మేజర్ పంచాయతీకి డ్యూటీస్ వేయడం జరిగినది. కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో సిహెచ్ సన్యాసిరావు డిప్యూటీ ఎంపీడీవో పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి : గేదెల



నెల్లిమర్ల, మార్చి 23, ప్రభాతవార్త రైతుల సంక్షేమానికి ఆర్థిక అభ్యున్నతికి తమ కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నదని టిడిపి సీనియర్ నేత, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి గేదెల రాజారావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రైతన్న మీకోసం" వారోత్సవాలు సందర్భంగా సోమవారం అలుగోలు, మధుపాడ, జోగిరాజుపేట గ్రామాల్లోని రైతుల ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి రాజారావు పార్టీ నాయకులు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లం శ్రీనివాస్ , మధుబాల సర్పంచ్ నల్లం అప్పారావు, టిడిపి ఎస్‌ఎస్సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, మండల ఉపాధ్యక్షులు, అలుగోలు మాజీ ఎంపీటీసీ కురిమినేని దివాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆల్తి బాబురావు, పార్టీ నాయకుడు కెల్ల నారాయణ అప్పలనాయుడు , నెల్లిమర్ల ఐ టీడీపీ ప్రెసిడెంట్ బొమ్మిడి రాము , బూత్ కన్వీనర్ మత్స మహాలక్ష్మినాయుడు, తోట అచ్యుతరావు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడం .. కొంచెం నిజాలు మాట్లాడండి : రాజన్నదొర



సాలూరు, మార్చి23, ప్రభాతవార్త: సాలూరు నియోజకవర్గంలో గతంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ఇప్పుడు మంత్రి సంధ్యారాణి టీడీపీ సర్కార్ చేసిందని డప్పుకొడుతూ తన ఖాతాలో వేసుకుని అబద్ధాలు చెపుతున్న వ్యాఖ్యలపై మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం ఆయన నివాసం వద్ద విలేకరుల ప్రెస్మీట్లో మాట్లాడుతు రెండేళ్ల క్రితం సుమారు 60 లక్షలతో నిర్మించే అన్న క్యాంటీన్ ఇంతవరకు ఓపెన్ చేయలేని మీరు 17 కోట్లతో వందుపడకల ఆసుపత్రి ఎలా నిర్మించారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.అలాగే తోణాం,మక్కువ, మెంటాడ మండలంలో ఆసుపత్రిలో మా హయాంలో నిర్మించామని గుర్తు చేశారు. మాజీ పుర అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, వైసీపీ టౌన్ ప్రెసిడెంట్అ ప్పలనాయుడు, గిరిరఘు, దండి శ్రీను,పిరిడిరామకృష్ణ,హరిబాలాజీ, జర్జాపు శ్రీను,కొల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

## చీపురుపల్లి నియోజకవర్గ నాయకులతో బొత్స సమావేశం



గరివిడి, మార్చి23, ప్రభాతవార్త: శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ సోమవారం సాయంత్రం స్థానిక ఆయన క్యాంప్ కార్యాలయంలో చీపురుపల్లి నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాల న్నారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుడు భగత్ సింగ్



తెర్లాం,మార్చి 23, ప్రభాత వార్త : భగత్ సింగ్ స్వాతంత్ర సమర యోధుడు, ఉద్యమకారుడని స్థానిక గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం ఆయన 95 వ వర్ధంతిసందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈయన ఢిల్లీ వీధుల్లో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచరన్నారు. అలానే బతకడం కన్నా తమ ఉద్యమాన్ని కొనసాగించడం కోసం చనిపోవడానికి తొందర పడ్డాడనిభగత్ సింగ్ విమర్శలు ఎదుర్కొన్నాడు. ఈయన ప్రతిజ్ఞ జీవితాన్ని ప్రేమిస్తాం, మరణాన్ని ప్రేమిస్తాం,మరణించి ఎర్ర పూల వనం లో పూలై పూస్తాం అనేదే ఆయన నినాదం. శ్రీవేంకటేరకళాశాల లెక్చరర్ రామారావు,అయిదవ అంగన్వాడీ సెంటర్ కార్యకర్త వై. శ్రీదేవి, పాఠకులు పాల్గొన్నారు.

## వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు

లక్కవరపు, మార్చి 23, ప్రభాత వార్త : మండలంలో శ్రీ రామనవమి వేడుకలు ఘనంగా ప్రతి గ్రామం లో గల రామాలయా లలో నిర్వహిస్తున్నారు తొమ్మిది రోజులు జరిగే ఈ వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు రామ భజనలు చేస్తూ రామ నామ స్మరణ చేస్తూ రామ భక్తులు భక్తి పారవస్యం లో మునిగి తెలుతున్నారు ఎల్ కోట మండల కేంద్రం లో గల పురాతన సీతారామాలయం లో చైతన్య స్కూల్ కరెస్పాండంట్ రిటైర్డ్ హెడ్ మాస్టర్ సంగం వెంకటరావు దంపతులు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం సాయంత్రం వేద పండితులు నిత్య పూజలు నిర్వహించడం జరుగుతుంది ఈ ఏడాది అన్ని రామాలయాలలో నవమి వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించడం చెప్పుకో దగిన విషయం ఈ విదంగా చూస్తే శ్రీ రామ నవమి 26 వ తేది రోజు రామా లయాలు అన్ని ప్రత్యేక కళతో సీతారాముల కళ్యాణం వైభవం గా జరుగనున్నాయి అయోధ్య రాముడు హిందువుల ఆరాధ్య దైవం శ్రీ రాముడు అతని చరిత్ర జీవితం ఎంతో గొప్పగా మధురంగా ఉంటుంది అందుకే శ్రీ రాముడు అంటే హిందువులు కి ఇతర మతాలు వారికీ కూడా ఇష్టం భక్తి గౌరవం కలుగుతుంది.

## శివాలయం ప్రతిష్ఠలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి



పాచిపెంట, మార్చి 23, ప్రభాతవార్త : మండలంలో మోసూరు గ్రామంలో సోమవారం శివాలయం ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. గ్రామస్తులు కోరిక మేరకు స్వామివారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదము స్వీకరించారు. రాష్ట్రంలో సాలూరు నియోజకవర్గంలో గల ప్రజలు సుఖసం తోషాలు ఆయురారోగ్యలతో ప్రజలను కాపాడాలని మహాశివునినీ ప్రార్థించారు. వేద పండితులు మంత్రికి స్వాగతం పలికి వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు ఆమె కుటుంబ సభ్యుల తరపున ప్రజలు తరపున పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమకి వచ్చిన మంత్రికి గ్రామ ఆలయ నిర్మాణ నిర్వాహక కమిటీ సభ్యులు మంత్రి సంధ్యారాణికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు ఈ యుగంధర్ ఆలయ నిర్మాణ నిర్వాహకులు చల్ల కనక, పాచిపెంట టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## మా షేర్లు డబ్బులు మాకు ఇప్పించండి : జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట, మార్చి23, ప్రభాతవార్త.. పెండింగ్‌లో ఉన్న మా షేర్లు డబ్బులు మాకు ఇప్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సుమారు 15 మంది జిందాల్ రైతులు సోమవారం దరఖాస్తు చేసుకున్నారు.గతంలో జిందాల్ అల్యూమినియం కంపెనీ కోసం సేకరించిన భూములకు సంబంధించి ఈ వివాదం నెలకొంది.2007లో ఉన్న అప్పటి ప్రభుత్వం పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుండి భూములను సేకరించింది. భూమిని సేకరించిన సమయంలో మార్కెట్ ధర కంటే అదనంగా కంపెనీలో ఉచితంగా ఈక్విటీ షేర్లను కేటాయిస్తామని రాతపూర్వక హామీ ఇచ్చారని ఒక్కో షేరు ముఖ విలువ రూ.10 చొప్పున లెక్కగట్టగా కొందరు రైతులు గతంలో కేవలం కొంత మొత్తాన్ని (రూ. 24, 600/) మాత్రమే నగదు రూపంలో అందుకున్నారని మిగిలిన పరిహారం సుమారు రూ. 2,21,400/ విలువ గల షేర్లకు సంబంధించిన డబ్బులు ఇప్పటికీ చెల్లించలేదని ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం లెక్కగట్టి ఆమొత్తాన్ని ఇప్పించి న్యాయం చేయాలని వారు అందజేసిన దరఖాస్తులో పేర్కొన్నారు.

## భూ సమస్యను పరిష్కరించండి



చీపురుపల్లి మార్చి 23. ప్రభాతవార్త : మా గ్రామంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించండి అంటూ స్థానిక శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావుకు చుక్కావలస గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం నాడు చీపురుపల్లి ఎమ్మెల్యేక్యాంప్ ఆఫీసులో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో గరివిడి మండలం చుక్కవలస తెలుగు దేశం గ్రామ సీనియర్ నాయకులు శనపతి సత్యనారా యణ ఆధ్వర్యంలో చుక్క వలస గ్రామ రైతులు తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు మాజీమంత్రి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును పార్టీ ఆఫీసులో కలిసి చుక్క వలస రెవెన్యూ రికార్డులో తమ భూమినీ 22 ఏ నిషిద్ధ జాబితా నుంచి తొలగించి తమ సమస్యను పరిష్కరించవలసిందిగా ఎమ్మెల్యే కళా వెంకట్రావుకు విన్నవించుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉందని సదరు సమస్యను పరి ష్కరించాలని వారిని కోరారు .దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మీ భూ సమస్యను అధికా రుల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందనను చూసిన రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎస్‌ఎంసి చైర్మన్ శనపతి జగన్నాథం, చుక్కల నాయకులు శనపతిశ్రీనివాస్ రావు, శనపతి తవిటి నాయుడు, శనపతి సింకి నాయుడు పాల్గొన్నారు.

## 25 న ఆలయాల హుండీ లెక్కింపు



గరుగుబిల్లి, మార్చి 23, ప్రభాతవార్త: ఉత్తరాంధ్రలో చిన తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి గ్రామంలోని పవిత్ర నాగావళినది ఒడ్డున స్వయం వ్యక్తమై వేంచేసి ఉన్న ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శ్రీవెంకటేశ్వర శ్రీకోదండరామస్వామి ఆలయాల హుండీలు లెక్కిం పు కార్యక్రమంను బుధవారం చేపట్ట వారి నున్నామని దేవస్థానం కార్య నిర్వహణ అధికారి బండ్లమూడి శ్రీనివాస్ వెల్లడించారు. ఈమేరకు సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేవస్థానం కార్యనిర్వ హణ అధికారి పర్యవేక్షణలో,గ్రామ పెద్దల సమక్షంలో ఈహుండీల లెక్కింపు కార్యక్రమమును చేపట్ట నున్నామన్నారు. భక్తులు మరియు సేవకుల సహకారంతో హుండీలు తెరచి లెక్కించనున్నామన్నారు. ఈలెక్కింపులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న భక్తులు పంచె, కండువా ధరించి ఉదయం 8 గంటలకు తోటపల్లి దేవస్థానంకు హాజరు కావలసి ఉంద న్నారు. అదేవిధంగా ముందుగా దేవస్థానం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవా లని ఈసందర్భంగా ఈవో బండ్లమూడి శ్రీనివాస్ కోరారు.

## కట్టెల పొయ్యిను ఆశ్రయిస్తున్న పలువురు



గరివిడి మార్చి,23 ప్రభాత వాగ్యాస్ సిలిండర్ లభ్యం కాకపోవడంతో చిల్లర వర్తకులైన టిఫిన్ దుకాణ యజమానులు తమ తమ వ్యాపారులు మూసుకునే దిశగా పురోగమిస్తున్నారు. బ్లాక్‌లో మూడు వేలు పై చిలుకు పలికే గ్యాస్ బండ కొనుగోలు చేయలేని స్థితిలో తమ వ్యాపారులు మానుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైందని వారు లబోదిబోమంటున్నారు. కట్టెలు కొనుగోలు బారమైనా మరికొందరు కట్టెలు పొయ్యి ని ఆశ్రయించారు. ఏదోవిధంగానైనా తమ పొట్ట పోషించుకోవాలని కొందరు కట్టెలు పొయ్యి పై టిఫిన్ తయారు చేస్తూ తమ చిరు వ్యాపారులను సాగిస్తున్నారు. టిఫిన్ తయారీతో వచ్చే కొద్దిపాటి ఆదాయం తో బతికే ఆ కుటుంబాలు మెతుకు పోరులో వారు ఓడే పరిస్థితి ఏర్పడింది. బతుకు వేటలో వారి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. పచ్చిమ ఆసియా దేశాలు యుద్ధం పుణ్యమా అని మా బతుకులు వీదిపాలయ్యాయని వారు విలపిస్తూ ఉన్నారు. ఏరోజు వ్యాపారం ఆ రోజు చేసుకొని జీవితాలను వెళ్లదీసుకునే బతుకులు పై గ్యాస్ బండ రూపం లో భారం పడటం తో ఆ చిల్లర వ్యాపారులు జీవితాలు అస్తవ్యస్త మయ్యే పరిస్థితులు ఉత్పన్నమవడం ఎంతైనా బాధాకరం. పట్టెడు మెతుకులు కోసం ఇంటిల్లి పాది చెమటోడ్చే పరిస్థితి లో.. గ్యాస్ లభించని స్థితిలో ..పనికి దూరమై.. ఆకలికి దగ్గరై ..పస్తుల తో సహజీవనం చేసే దయనీయ పరిస్థితులు ప్రస్ఫుటిస్తున్నాయి .ఆకలి పెనవేసుకునే పరిస్థితులు నడుమ ఆ చిల్లర వర్తక కుటుంబాల బతుకులు బజారున పడే పరిస్థితి ఏర్పడటం బాధాకరం. ప్రభుత్వం చిల్లర వర్తకుల కుటుంబాలను ఆదుకునే క్రమంలో పది కిలోలు గా అందించే గ్యాస్ సిలెండరైనా టిఫిన్ అమ్మే వర్తకులకు అందిస్తే ఆ కుటుంబాలకు చేయూత నిచ్చే అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు ఆలోచన చేస్తారని ఆత్రంగా ఆయా కుటుంబాలు నిరీక్షిస్తున్నాయి.

## కత్తిరింపు సామగ్రి పంపిణీ




కురుపాం, మార్చి 23, ప్రభాతవార్త: కురుపాం నియోజకవర్గంలో జీడి తోటల పునరుజ్జీవన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జీడి తోట పునరుద్ధరణలో భాగంగా కానోపీ నిర్వహణ, నిర్మాణాత్మక కత్తిరింపు, మెరుగైన పద్ధతుల ద్వారా 5 సంవత్సరాలకు పైబడిన పాత, తక్కువ దిగుబడినిచ్చే తోటలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఐ టి డి ఎ పార్వతీపురం , ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి అమలు చేస్తున్న జీడి పునరుద్ధరణ పథకం క్రింద రైతులకు కత్తిరింపు సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీడి తోటలను శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరిస్తే దిగుబడి పెరిగి రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన పరికరాలు, సాంకేతిక సహాయం అందిస్తూ తోటల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి గిరిజ, ఎఫ్‌పీఓ సభ్యులు గౌస్, వినోద్, తాడికొండ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీశాఖ అనుమతులు ఇచ్చి ... రహదారి నిర్మించండి



పార్వతీపురం, మార్చి 23, ప్రభాతవార్త: కొమరాడ మండలం నయ కొండ శిఖరం గిరిజన గ్రామానికి డోలీ రోడ్ల నిర్మాణం కోసం ఇటివల ఐదు కోట్ల రూపాయలు మంజూరైనప్పటికీ అటవీశాఖ అభ్యంతరాల వల్ల రహదారి నిర్మాణం జరగడం లేదని గిరిజనులు వాపోయారు. సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం వద్ద 200 మందికి పైగా గిరిజనులు నయా పంచాయతీ నుంచి వచ్చి నిరసన తెలియజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుంచి నయా గ్రామానికి రహ దారి నిర్మాణానికి నిధులు మంజూరు అవుతున్న అటవీ శాఖ అడ్డంకుల వల్ల రహదారులు పూర్తికావడం లేదని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. డోలీ రోడ్ల నిర్మాణానికి ఇటీవల ఐదు కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది అన్నారు. ఈ నెల 11న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి పనులను ప్రారంభించారని రెండు రోజులలోనే అటవీ శాఖ అధికారులు వచ్చి అనుమతులు లేనిది పనులు చేస్తే ఉపేక్షించేది లేదంటూ హెచ్చరించడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను నిలిపివేసి వెనక్కి వెళ్ళిపోయారని గిరిజనులు తెలిపారు. స్వయంగా ఎమ్మెల్యే పనులను ప్రారంభిస్తే అటువీశాఖ అధికా రులు వచ్చి ఆపేయడంతో తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే తహదారి నిర్మాణ పనులు జరిగేలా ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

24-03pg10.qxd OK:24-03pg10.qxd 1/1/02 6:49 AM Page 1



# మ్యాచ్ ఫినిషర్లతో బౌలర్లకు చుక్కలే




(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్ ఇపుడు పూర్తిగా బ్యాట్స్‌మన్ గేమ్‌గా మారింది. వారి ధనాధన్ బ్యాటింగ్ స్టేడియం లోని ప్రేక్షకులకు, టీవీ తెరలపై మ్యాచ్ చూస్తున్న వీక్షకులకు వినోదం ఇస్తున్నా, బౌలర్లకు మాత్రం చుక్కలు చూపిస్తోంది. భారీ స్కోర్లు, 150 ప్లస్ స్ట్రయిక్ రేట్లు, వరుస సిక్సర్లు... ఇవి అన్నీ కలిసి బౌలర్లకు కష్టకాలం తెచ్చిపెట్టాయి. ఈ ట్రెండ్ 2026 ఐపీఎల్‌లో ఇంకా పెరిగే అవకాశం ఉంది.

గత కొన్ని సీజన్లలో ఐపీఎల్‌లో స్కోర్లు భారీగా పెరిగాయి. ఒకప్పుడు 180నుంచి 200 స్కోరు సేఫ్‌గా భావించేవారు. కానీ ఇప్పుడు 250ప్లస్ పరుగులు సాధారమయ్యాయి. పవర్ ప్లే నుంచి బౌలర్లపై బ్యాట్స్‌మన్ దాడి ప్రారంభమవుతోంది. బౌలర్ ఎవరన్నది కాదు బంతి స్టాండ్‌లోకి పంపామా అన్నదే ముఖ్యమైపోయింది. అలాగే ఎంతసేపు క్రీజ్‌లో ఉన్నారన్నది కాదు ఎంత వేగంగా బాదారా అన్నదే ఫ్యాన్స్ చూస్తున్నారు. దీంతో 250 ప్లస్ స్కోరు చేసినా ఖచ్చితంగా గెలుస్తామన్న నమ్మకం జట్లకు లేకుండా పోతోంది.

ఒకప్పుడు జట్టు కాంబినేషన్ బ్యాటింగ్, బౌలింగ్ సమన్వయంగా ఉందా అని చూసేవారు. ఇపుడు బౌలింగ్ వీక్ అయినా ధనాధన్ బ్యాటింగ్‌తో కవర్ చేయాలని ప్రయత్నిస్తోంది. బ్యాటింగ్ జట్టు తరపున ఇన్నింగ్స్ ప్రారంభించే వ్యక్తిని ఓపెనర్ అని, మ్యాచ్‌ను ముగించే వ్యక్తిని ఫినిషర్ అని అంటారు. ఐపీఎల్‌లోని ఏ జట్టులో మ్యాచ్ ఫినిషర్లు ఉంటే ఆ జట్టునే హాట్ ఫెవరెట్‌గా భావిస్తున్నారు. దీంతో మ్యాచ్ ఫినిషర్లు ముగ్గురుకి తగ్గకుండా ప్రతి జట్టు చూసుకుంటోంది. ప్రస్తుత ఐపీఎల్‌లో పది జట్టు ఉంటే మ్యాచ్ ఫినిషర్లు 30కు పైగా ఉన్నారు.

*ఇండియన్ కాసుల క్రికెట్.. ఐపీఎల్ థీమ్ పూర్తిగా మారిపోయింది. ఐపీఎల్ అంటే ఎంటైర్‌టైన్‌మెంట్ లీగ్‌గా మారిందన్న విమర్శలూ ఉన్నాయి. గ్రౌండ్‌లో ఉన్న మూడు గంటల పాటు క్రికెట్ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించడమే పనిగా పెట్టుకుంది. చిన్న బౌండరీలు, ఫ్లాట్ పిచ్‌లు, ఇంపాక్ట్ ప్లేయర్లు, పవర్ ప్లేలు, డేత్ ఓవర్లు... ఇలా బ్యాట్స్‌మెన్ డామినేటింగ్ గేమ్‌గా మార్చేశాయి. బంతి పడ్డది పడ్డట్లు స్టాండ్స్‌లోకి తరలించే హార్డ్‌హిట్టర్లకు గిరాకీ పెరిగింది. క్షణాల్లో మ్యాచ్‌ను మార్చేసే గేమ్ ఫినిషర్లూ పెరిగాయి. హార్డ్‌హిట్టర్లు బాదే సిక్స్‌లు, బౌండరీల వర్షంలో క్రికెట్ ఫ్యాన్స్ తడిసిముద్దయితే.. వారిని మరింత ఎంటర్‌టైన్ చేసేందుకు చీర్ లీడర్స్ స్టెప్పులు అదనపు హంగులుగా మారాయి.*

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్టు అయిన ముంబై ఇండియన్స్‌లో హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్, విల్ జాక్స్ రూపంలో ముగ్గురు గేమ్ ఫినిషర్లు ఉన్నారు. ఇక ముంబై ఇండియన్స్ లాగానే చాలా విజయవంతమైన జట్టు చెన్నై సూపర్ కింగ్స్‌లో కూడా ఎంఎస్ ధోని, శివమ్ దూబే, కార్తిక్ శర్మ, డెవాల్డ్ బ్రెవిస్ రూపంలో నలుగురు బలమైన ఫినిషర్లు ఉన్నారు. ఐపీఎల్ డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్‌సీబీ జట్టులో కూడా ప్రమాదకరమైన గేమ్ ఫినిషర్లు ఉన్నారు. గత సీజన్‌లో ఆర్‌సీబీ ఛాంపియన్‌గా నిలవడంలో వారు కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా, ఈ సీజన్‌లో కూడా ఆర్‌సీబీ జట్టులో టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రొమారియో షెపర్డ్ రూపంలో ముగ్గురు గేమ్ ఫినిషర్లు ఉన్నారు.

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో డేవిడ్ మిల్లర్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ వంటి మ్యాచ్‌లను ముగించగల ముగ్గురు అద్భుతమైన ఫినిషర్లు ఉన్నారు. 2026 ఐపీఎల్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్... జట్టులోకి లియామ్ లివింగ్‌స్టోన్ అనే కొత్త ఫినిషర్‌ను చేర్చుకుంది. ఆ జట్టులో ఇప్పటికే హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ అనే ఇద్దరు మ్యాచ్ ఫినిషర్లు ఉన్నారు. గుజరాత్ టైటాన్స్‌లో జాసన్ హోల్డర్, రాహుల్ తెవాటియా, గ్లెన్ ఫిలిప్స్‌తో సహా ముగ్గురు బలమైన ఫినిషర్లు ఉన్నారు.

ఐపీఎల్ 2026లో లక్నో సూపర్‌జెయింట్స్ తరపున మ్యాచ్‌లను ముగించే బాధ్యతను నికోలస్ పూరన్, ఆయుష్ బదోని, అబ్దుల్ సమద్ వహించనున్నారు. రాజస్థాన్ రాయల్స్ జట్టులో కూడా మ్యాచ్ ఫినిషర్లకు కొదువ లేదు. జట్టులో వైభవ్ సూర్యవంశీ వంటి విధ్వంసకర ఓపెనర్ ఉండగా, షిమ్రాన్ హెట్మైర్, శుభమ్ దూబే, డోనోవన్ ఫెరీరా వంటి ఫినిషర్లు ఉన్నారు.

ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మ్యాచ్ ఫినిషర్ ఆండ్రీ రస్సెల్ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. అయితే, ఆ జట్టులో ఇప్పటికీ రింకు సింగ్, రమన్‌దీప్ సింగ్, పావెల్ వంటి ఆటగాళ్లు ఉన్నారు. పంజాబ్ కింగ్స్ జట్టులో శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్, మార్కో జాన్సెన్‌లతో సహా ముగ్గురు అద్భుతమైన ఫినిషర్లు ఉన్నారు.

మ్యాచ్ ఫినిషర్లతో పాటు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, రోహిత్ శర్మ, సూర్యవంశీ, విరాట్‌కోహ్లీ వంటి హార్డ్ హిట్టింగ్ ఓపెనర్లు, పవర్ హిట్టర్లు ఎలాగూ ఉండనే ఉన్నారు. ఇక బౌలర్లకు చుక్కలు ఖాయం.

## భారత్ టూర్‌కు ఆసీస్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించనుంది. ఇందుకు సంబంధించి క్రికెట్ ఆస్ట్రేలియా అంతర్జాతీయ క్యాలెండర్‌ను ప్రకటించింది. ఇక వచ్చే ఏడాది జనవరిలో భారత పర్యటనకు రానున్న ఆస్ట్రేలియా జట్టు.. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదు టెస్టులు ఆడనుంది. ఈ నేపథ్యంలో.. భారత్‌లో ఒక్కసారి కూడా టెస్టు సిరీస్ గెలవని కమిన్స్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, జోష్ హాజిల్‌వుడ్, నాథన్ లియోన్ వంటి ఆటగాళ్లకు ఇదే ఆఖరి సిరీస్ కావొచ్చని సీఏ పేర్కొంది. ఒకవేళ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్-2027 ఫైనల్‌కు అర్హత సాధిస్తే జూన్‌లో ఇంగ్లండ్ వేదికగా ఆసీస్ ప్రత్యర్థితో తలపడుతుంది.

## ఖాళీ స్టేడియాల్లో పాక్ లీగ్

**లాహోర్:** అంతర్జాతీయ ఆటగాళ్లంతా ఐపీఎల్ వైపు మొగ్గ చూపుతుండగా.. పాకిస్థాన్ సూపర్ లీగ్ వెలవెలబోతోంది. విదేశీ ఆటగాళ్లకు ఉగ్ర సంస్థల నుంచిబెదిరింపులు వస్తుండడంతో ఒక్కొక్కరుగా ఇంటిదారి పైదొలుగుతున్నారు. దీంతో పాక్ లీగ్‌లో కీలక మార్పులు చేశారు. ఈనెల 26 నుంచి జరిగే లీగ్ ఆరంభ మ్యాచ్‌లను ప్రేక్షకులు లేకుండానే నిర్వహించనున్నారు. అలాగే మ్యాచ్‌లన్నింటినీ కరాచీ, లాహోర్‌లో మాత్రమే ఆడించనున్నారు. గతంలో ఈ రెండింటితో పాటు ముల్తాన్, పెషావర్, ఫైసలాబాద్, రావల్పిండిలో మ్యాచ్‌లు జరిగేవి. కాగా ప్రారంభ వేడుకలను సైతం రద్దు చేశారు. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతుండగా, ఆర్థిక పొదుపు చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహిసిన్ నఖ్వీ తెలిపారు. పరిస్థితులు చక్కబడితే ప్రేక్షకుల్ని అనుమతించే అంశాన్ని పరిశీలిస్తారు.

# అల్కరాజ్‌కు అన్‌సీడెడ్ కోర్డా షాక్



**మియామి:** మియామి ఓపెన్ టెన్నిస్ టోర్నీలో సంచలనం నమోదయ్యింది. పురుషుల ప్రపంచ నంబర్ వన్ కార్లోస్ అల్కరాజ్‌కు అన్ సీడెడ్ సెబాస్టియన్ కోర్డా షాకిచ్చాడు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో అల్కరాజ్ 3-6, 7-5, 4-6తో సెబాస్టియన్ చేతిలో ఓటమి పొంది టోర్నీ నుంచి నిష్క్రమించాడు. రెండు గంటలకు పైగా జరిగిన ఈ మ్యాచ్‌లో కోర్డా తొలి సెట్ నుంచే టాప్ సీడ్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. తొలి సెట్‌ను 6-3తో సునాయాసంగా నెగ్గిన కోర్డా.. రెండో సెట్‌ను అల్కరాజ్‌కు కోల్పోయాడు. అయితే నిర్ణయాత్మక మూడో సెట్‌లో పుంజుకున్న సెబాస్టియన్ కోర్డా పదునైన సర్వీస్‌లతో అల్కరాజ్‌ను మట్టికరిపించి తన కెరీర్‌లో అతిపెద్ద విజయాన్ని నమోదు చేశాడు. 2022లో మియామి ఓపెన్ నెగ్గిన అల్కరాజ్ మరోసారి టైటిల్ నెగ్గాలని ఆశించినప్పటికీ మూడో రౌండ్‌కే పరిమితమయ్యాడు. కాగా మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సెబలెంకా ప్రత్యర్థిపై ఈజీ విక్టరీతో ముందంజ వేసింది.

## ఫిడే క్యాండిడేట్స్ టోర్నీకి
# హంపి దూరం



**హైదరాబాద్:** భారత ప్రముఖ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి కఠినమైన నిర్ణయం తీసుకుంది. ప్రతిష్ఠాత్మకమైన ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ నుంచి వైదొలిగింది. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్నందున భద్రతపై ఆందోళనగా ఉందని చెప్పిన ఆమె.. బాంబుల మోతల మధ్య చెస్‌పై శ్రద్ధ పెట్టడం సాధ్యమవ్వదని వాపోయింది. ఈ విషయాన్ని సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది.

మధ్యఆసియాలోని సిప్రస్‌లో ఈనెల28 నుంచి మొదలయ్యే ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో ఆడడం లేదని హంపి పేర్కొంది. నిర్వాహకులు భరోసా కల్పించినప్పటికీ ప్రస్తుతం అక్కడి పరిస్థితుల్లో సురక్షితంగా ఉంటానని నాకు అనిపించడం లేదు. ఈ నిర్ణయం బాధ తో కూడినదే. కానీ, తప్పనిసరిగా తీసుకో వాల్సి వచ్చింది. నేను నా నిర్ణయానికి కట్టు బడి ఉన్నానని హంపి వెల్లడించింది.

**10 వేల యూరోల జరిమానా**

కోనేరు హంపి వైదొలగడంతో ఆమె స్థానంలో ఉక్రెయిన్ అమ్మాయి అన్నా ముజిచుక్ క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపికైంది. అయితే.. టోర్నీలో ఆడనందుకు హంపిపై భారీ జరిమానా పడింది. నిబంధనల ప్రకారం టోర్నీని బాయ్‌కాట్ చేసినందుకు ఆమె 10 వేల యూరోల ఫైన్ చెల్లించనుంది. ప్రపంచ ఛాంపియన్ కావాలంటే ఈ టోర్నీలో పాల్గొంటేనే సాధ్యమవుతుంది. కోనేరు హంపి వైదొలగడంతో ఈ టోర్నీకి ఎంపికైన భారత యువకెరటాలు దివ్య దేశ్‌ముఖ్, వైశాలి పాల్గొనడంపై ఉత్కంఠ నెలకొంది.

# నిజామాబాద్‌లో ఫ్యాన్ పార్క్




**ముంబై:** స్టేడియానికి వెళ్లక్కర్లేదు.. టికెట్ అక్కర్లేదు.. ఐపీఎల్ 2026 ఫ్యాన్ పార్కులతో హాయిగా మ్యాచ్‌లు వీక్షించే అవకాశాన్ని బీసీసీఐ తీసుకువచ్చింది. నిజామాబాద్‌తో సహా 15 నగరాల్లో స్టేడియం వంటి అనుభూతిని ఉచితంగా పొందవచ్చు. ఈ ఏడాది ఫ్యాన్ పార్కులను వశని, ఆదివారాల్లో నిర్వహించనున్నారు. మొత్తం 11 రాష్ట్రాల్లోని 15 నగరాలను ఇందు కోసం బీసీసీఐ సెలక్ట్ చేసింది.

మార్చి 28, 29 తేదీల్లో హర్యానా లోని రోహ్‌తక్‌తో పాటు భోపాల్, నాగ్‌పూర్, కర్ణాటకలోకి తుమకూరు, పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్‌లో ఫ్యాన్‌పార్క్‌లు ఏర్పాటు చేస్తారు. ఏప్రిల్ 4, 5 తేదీల్లో నిజామాబాద్‌తో పాటు మధుర, జోధ్‌పూర్, మైసూర్, భువనేశ్వర్... ఏప్రిల్ 11, 12 తేదీల్లో మీరట్, నడియాడ్, రత్నగిరి, కోయంబత్తూరు, రూర్కెలాలో నిర్వహిస్తారు. ఫ్యాన్ పార్క్‌లు మినీ కార్నివాల్‌లా ఉంటుంది. ఇక్కడ లైవ్ స్క్రీనింగ్‌తో పాటు అదిరిపోయే సంగీతం, వినోద కార్యక్రమాలు, ఫుడ్ కోర్టులు ఉంటాయి. రాజధానులకు దూరంగా ఉండే నగరాల్లోనూ ఐపీఎల్ క్రేజ్ పెంచేందుకు ఫ్యాన్ పార్కులను బీసీసీఐ ప్రతి ఏటా ఏర్పాటు చేస్తోంది.

# ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి

ముంబై: భారత రూపాయి.. యుఎస్ డాలర్‌తో పోలిస్తే రికార్డు స్థాయిలో బలహీనపడింది. సోమవారం ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి 93.94 వద్ద రికార్డు తక్కువ స్థాయికి చేరుకుంది. ఇది మునుపటి క్లోజ్‌తో పోలిస్తే 41 పైసలు పడిపోయింది. ఆఫ్‌షోర్ ట్రేడ్‌లో కూడా రూపాయి 94ను దాటింది. పశ్చిమాసియాలో (వెస్ట్ ఆసియా) కొనసాగుతున్న యుద్ధం కారణంగా గ్లోబల్ క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 112 పైగా ట్రేడ్ అయి ట్రంప్ యుద్ధం తాత్కాలిక బ్రేక్‌ప్రకటన వెలువడగానే 100 డాలర్ల దిగువకు చేరింది.

రూపాయి క్షీణత భారతదేశం వంటి చమురు దిగుమతి దేశానికి భారంగా మారింది. భారత్ ప్రతి బ్యారెల్‌కు గతం కంటే 50 అదనంగా చెల్లిస్తోందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో యుఎస్ డాలర్ బలంగా ఉండటం, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి నిరంతర నిధుల వెలువడటం (ఫారిన్ అవుట్‌ఫ్లోస్) కూడా రూపాయి



పతనానికి కారణమవుతున్నాయి.

ఇది సేఫ్‌హేవెన్ డిమాండ్‌ను పెంచి డాలర్‌ను మరింత బలోపేతం చేస్తోంది. కాగా మధ్యాహ్నం ట్రేడ్‌ముగిసేనాటికి డాలరుతోరూపాయి మారకం విలువలు 94.12కి చేరాయి. మొత్తం 48 పైసలు క్షీణించింది. ట్రేడింగ్ తొలినాళ్లలోనే 33 పైసలు క్షీణించింది. వారం ప్రారంభంలోనే ఆల్‌టైమ్ కనిష్టానికి చేరుకోవడంతో భారత్ విదేశీ కరెన్సీ ఖజానాపై భారం పడుతోంది.

## భారీ నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ
# రూ.15 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి



**ముంబయి, మార్చి 23:** పశ్చిమాసియా యుద్ధం దేశీయ స్టాక్ మార్కెట్లను వణికిస్తోంది. యుద్ధం ప్రారంభం అయినప్పటినుంచి మార్కెట్ ఘోరంగా దెబ్బతింటోంది. ఇప్పటికే భారీ నష్టాలను చవి చూసింది. ప్రస్తుతం యుద్ధం ముగిసే పరిస్థితులు కనిపించడం లేదు. రోజురోజుకు హెచ్చరికలు బెదిరింపులతో మధ్యప్రాచ్యం తీవ్రత మరింత ముదురుతోంది. దీంతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇక సోమవారం ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమైన మార్కెట్లు చివరి దాకా అదే ఒరవడి కొనసాగించాయి. అన్ని రంగాలు సూచీలు ఘోరంగా దెబ్బతిన్నాయి. దీంతో పెట్టుబడిదారుల లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది. దాదాపు రూ.15 లక్షల కోట్లకు పైగా ఇన్వెస్టర్లు నష్టపోయారు.

బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 429 లక్షల కోట్లకుపైగా ఉండగా ఇప్పుడు అది రూ. 414లక్షల కోట్లుగా ఉంది. ఈ క్రమంలో ఇవాళ్టి సెషన్‌లో రూ. 15 లక్షల కోట్లకుపైగా నష్టపోయినట్లు నిర్ధారణ అయింది. సెషన్ ఆరంభంలోనే దాదాపు ఈ స్థాయి నష్టాలతో సూచీలు ప్రారంభం కాగా నిమిషాల్లో లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది. సెన్సెక్స్ 1,836 పాయింట్లు నష్టపోయి 72, 696 దగ్గర ముగియగా నిఫ్టీ 601 పాయింట్లు నష్టపోయి 22, 512 దగ్గర ముగిసింది. ఇక రూపాయి విలువ ఘోరంగా దెబ్బతింది. సోమవారం రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 93.97 దగ్గర సరికొత్త రికార్డు కనిష్ట స్థాయి దగ్గర ముగిసింది.

ఇక నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, జియో ఫైనాన్షియల్ అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఓఎన్‌జీసీ, పవర్ గ్రిడ్ కార్ప్, టీసీఎస్ లాభపడ్డాయి. రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, పీఎస్‌యు బ్యాంక్ రంగాల సూచీలు ఒక్కొక్కటి 4 శాతం కంటే ఎక్కువగా పడిపోవడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 3.81శాతం క్షీణిస్తే బిఎస్ఇ 250 స్మాల్ క్యాప్ సూచీ 3.86శాతం నష్టపోయింది. మార్కెట్ల పరంగా ఎన్ఎస్ఇలో 331 షేర్లుపెరిగితే 3007 షేర్లు పతనం చెందాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 94.12వద్ద ట్రేడ్ అయింది ఆల్ టైమ్ కనిష్టానికి చేరింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లుకూడా 6.74శాతం దిగజారి రూ.1,34,751కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడి చమురు 1.31 డాలర్లుపెరిగి 113.50 డాలర్లవద్దట్రేడ్ అయింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 4.70శాతం దిగజారింది. ఎయిర్‌ఫ్లోవా రైల్ టెక్నాలజీ కూడా 4.62శాతం క్షీణించింది. వారీ ఎనర్జీస్ 3.19 శాతం, అశోక్‌లేల్యాండ్ 4.11శాతం, మోనార్క్ సర్వేయర్స్ 2.67 శాతం, పిరమల్ ఫైనాన్స్ 3.19శాతం దిగజారాయి. సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్‌సంస్థ ఐపిఒలో ఇష్యూ బిడ్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజే 0.25 రెట్లు ట్రేడ్ అయ్యాయి. 24వతేదీ ముగుస్తుంది. ఇష్యూధరను రూ.163నుంచి రూ.172గా నిర్ణయించారు.

# ఆన్‌లైన్ పేమెంట్లకు కొత్తరూల్స్



**ముంబయి, మార్చి 23:** ఆన్‌లైన్ పేమెంట్లను మరింత సురక్షితంగా మార్చేందుకు ఆర్‌బిఐ కొత్త నిబంధనలను తీసుకొస్తోంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ రూల్స్ అమలుకానున్నాయి. సైబర్ నేరాలు, అనధికారిక లావాదేవీలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన నిబంధనలను తీసుకొస్తోంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి అన్ని డిజిటల్ లావాదేవీలకు కనీసం రెండు రకాల భద్రతా ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. ఒక పాస్‌వర్డ్ లేదా ఒక ఓటీపీ మాత్రమే కాకుండా అదనపు సెక్యూరిటీ లేయర్‌ను రిజర్వ్ బ్యాంక్ తప్పనిసరి చేసింది. టూఫ్యాక్టర్ అథెంటికేషన్ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. పాస్‌వర్డ్స్, పిన్ నంబర్స్, ఎస్ఎంఎస్ ఆధారిత ఓటీపీలు లేదా సాఫ్ట్‌వేర్ ఆధారిత అథెంటికేషన్ వంటివి అదనంగా ఉపయోగించాల్సి ఉంటుంది. ప్రతి ట్రాన్సాక్షన్‌కు ఒక ఫ్యాక్టర్ అథెంటికేషన్ అనేది ప్రత్యేకంగా జనరేట్ చేయాల్సి ఉంటుందని ఆర్‌బీఐ తెలిపింది. బ్యాంకులు హైరిస్క్ ట్రాన్సాక్షన్ల విషయంలో అదనపు తనిఖీలు చేయాలి. ఒక భద్రతా కోడ్‌ను తస్కరించినా రెండో లేయర్ భద్రత వల్ల ట్రాన్సాక్షన్ పూర్తి చేయడం వారికి కష్టమవుతుంది. ప్రతి లావాదేవీ జరిగిన వెంటనే వినియోగదారులకు ఎస్ఎంఎస్, ఇమెయిల్ లేదా ఇన్‌యాప్ నోటిఫికేషన్ల ద్వారా తక్షణ సమాచారం అందేలా బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు చర్యలు తీసుకోవాలి. ఆన్‌లైన్ వెబ్‌సైట్లు లేదా యాప్స్‌లలో కార్డు వివరాలను సేవ్ చేసేటప్పుడు టోకనైజేషన్ ప్రక్రియను మరింత పటిష్టం చేయనున్నారు. దీంతో మీ అసలు కార్డు వివరాలు వ్యాపారులకు తెలియకుండా గోప్యంగా ఉంటాయి. ఆటో డెబిట్ లేదా సబ్‌స్క్రిప్షన్ల విషయంలో వినియోగదారుడి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి అదనపు ఛార్జీలను వసూలు చేయకూడదు. ప్రతి పేమెంట్‌కు ముందు రిమైండర్ పంపాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకువస్తున్న ఈ కొత్త మార్పులు ఆన్‌లైన్ చెల్లింపుల ప్రక్రియను మరింత పటిష్ఠం చేస్తుంది. దీర్ఘకాలంలో వినియోగదారుల ఆర్థిక భద్రతకు ఎంతో మేలు చేస్తుంది. ఏప్రిల్ 1 నుంచి బ్యాంకింగ్ యాప్స్ లేదా పేమెంట్ వాలెట్లలో ఈ కొత్త భద్రతా ఫీచర్లను బ్యాంకులు తీసుకువస్తున్నాయి.

## ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది
# పన్నురిటర్నులు పూర్తిచేయండి

**ముంబయి, మార్చి 23:** ఆర్థిక సంవత్సరం 202526 ముగింపు దశకు వచ్చేసింది. మార్చి 31, 2026 నాటికి పన్ను చెల్లింపుదారులు, సామాన్య ఇన్వెస్టర్లు పూర్తి చేయాల్సిన పలు కీలకమైన ఆర్థిక అంశాలు పూర్తిచేయాల్సి ఉంది. కేవలం ఆదాయపు పన్ను రిటర్నులే కాకుండా పాన్ కార్డు, పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన పెట్టుబడులు ఇతర ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఈ పనులు మార్చి 31వ తేదీలోపు పూర్తి చేయకపోతే భారీగా పెనాల్టీలు చెల్లించడమే కాకుండా కొన్ని ఆర్థిక సేవలు నిలిచిపోయే ప్రమాదమూ ఉంది. ఆర్థిక సంవత్సరం 2025-26కి సంబంధించి ఏదైనా ఆదాయాన్ని వెల్లడించకపోయినా లేదా తమ ఐటీ రిటర్నుల్లో తప్పులున్నా వాటిని సరిదిద్దుకుని అప్‌డేటెడ్ రిటర్నులు దాఖలు చేసేందుకు మార్చి 31 చివరి అవకాశం. పాత పన్ను విధానం ఎంచుకున్న వారు సెక్షన్ 80సి కింద రూ. 1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు. ఎల్ఐసీ, పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్ వంటి పథకాల్లో పెట్టుబడి పెట్టడానికి ఇదే ఆఖరి తేదీ. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ లేదా సుకన్య సమృద్ధి యోజన వంటి ఖాతాలు కలిగి ఉన్నవారు ఆ ఖాతాలు యాక్టివ్‌గా ఉండాలంటే కనీస వార్షిక మొత్తాన్ని మార్చి 31 లోపు జమ చేయాలి. మీరు ఇంకా పాన్ కార్డు కావాలన్నా, మార్పులు చేయాలనుకుంటే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 1 నుంచి ఆధార్‌తో పాటు డేట్ ఆఫ్ బర్త్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి. కొన్ని ముఖ్యమైన లావాదేవీల వివరాలు కచ్చితంగా తెలియజేయాల్సి ఉంటుంది.

పన్ను చెల్లింపుదారులు తమ వార్షిక పన్ను అంచనాలో చివరి విడత చెల్లింపులను మార్చి నెలలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ గడువు మార్చి 15తో ముగిసినా మార్చి 31




వరకు చెల్లించవచ్చు. గడువు దాటితే డబుల్ వడ్డీ చెల్లించాల్సి రావచ్చు. బ్యాంక్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ పాలసీలకు సంబంధించి కేవైసీ వివరాలు ఈనెల 31 లోపు పూర్తి చేయాలి. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీకి టీడీఎస్ మినహాయింపు పొందాలనుకునే సీనియర్ సిటిజన్లు, ఇతరులు ఈఫారాలను సకాలంలో బ్యాంకులకు సమర్పించాలి. లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ఎల్టీసీజీ కింద రూ. 1.25 లక్షల వరకు పన్ను మినహాయింపు ప్రయోజనం పొందడానికి అవసరమైన లావాదేవీలను పూర్తి చేయాలి.

డీమ్యాట్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్ ఫోలియోలలో నామినీలను చేర్చడం లేదా అప్‌డేట్ చేయడం పూర్తిచేయాలి. సెక్షన్ 80ఎ కింద అదనపు పన్ను మినహాయింపు పొందాలనుకునే వారు తమ ఆరోగ్య బీమా ప్రీమియంలను మార్చి 31 లోపు చెల్లించి ఆ రసీదులను భద్రపరుచుకోవాలి. మార్చి 31దాటితే పన్ను మినహాయింపులు కోల్పోవడమే కాకుండా, పెనాల్టీల భారం పడే అవకాశం ఉంది. కొన్ని ఖాతాలు ఇనాక్టివ్ గా మారిపోతాయి.

# దిగివస్తున్న వెండి,పసిడి ధరలు

ముంబయి, మార్చి 23: మద్యప్రాచ్యం యుద్ధంతో బంగారం రేట్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్న సంగతి తెలిసిందే. అయితే సోమవారం ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు రూ.5521 తగ్గి రూ.1,38,971కి చేరాయి. అంతకుముందు రోజు సెషన్‌లో రూ.1,44,492కి చేరింది. అఖిలభారత సరాఫా అసోసియేషన్‌ప్రకారం ఢిల్లీలో పసిడి 10 గ్రాములకు రూ.1,52,650వద్దట్రేడ్ అయింది. ఇక స్పాట్ మార్కెట్లలో 24 క్యారెట్ల బంగారం పదిగ్రాములు రూ.5950 తగ్గి రూ. 1,40,020గా ఉంది. ఆభరణాల బంగారం కూడా 5450 తగ్గి రూ.128,350గా కొనసాగింది. 18 కేరట్ల బంగారం కూడా గ్రాముకు రూ.446 తగ్గి రూ.10,502 వద్ద స్థిరపడింది. గ్లోబల్, దేశీయ మార్కెట్లలో గడచిన 43 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా పసిడిధరలు నలిచాయి. 1983 తర్వాత ఒకేవారంలో పసిడిధరలు ఈ భారీస్థాయిలో పడిపోవడం ఇదే మొదటిసారి. గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 10శాతం క్షీణించి 4352 డాలర్లకు పడిపోయింది. ఇదే తీరుకొనసాగి 4100 డాలర్ల వరకూ వెళ్లే అవకాశం ఉంది. భారత్ ఎంసిఎక్స్‌లో 10 గ్రాముల బంగారానికి రూ.1.36లక్షలమవద్ద మద్దతుకనిపించింది. అలాగే వెండిధరలు కూడా రూ.2.30 లక్షలుగా కొనసాగింది. ఒకేరోజు రూ.20వేలు క్షీణించింది.

## వాడుకలో లేని ఖతాలకు ఇపిఎఫ్ఓ సెటిల్‌మెంట్




**న్యూఢిల్లీ, మార్చి23:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఖాతాదారుల కోసం కీలక నిర్ణయం తీసుకుంటోంది. చాలా కాలంగా వాడుకలో లేని పీఎఫ్ ఖాతాల్లోని క్లెయిమ్ చేయని నిధులను ఆటోమెటిక్‌గా సెటిల్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. దీని కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ సెటిల్‌మెంట్ వ్యవస్థను తీసుకురానుంది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, ఖాతాదారులు ఎలాంటి క్లెయిమ్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండానే వారి ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ అవుతాయి. నివేదికల ప్రకారం, తొలి దశలో భాగంగా ఆధార్ వెరిఫై అయిన సుమారు 8లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాలను ప్రాసెస్ చేయనున్నారు. ఈ ఖాతాల్లో దాదాపు రూ. 5,200 కోట్ల నిధులు ఉన్నట్లు అంచనా. వీటిలో 14,000 ఖాతాల్లో రూ.5లక్షలకు పైగా, 38,000 ఖాతాల్లో రూ. లక్ష నుంచి 5లక్షల మధ్య బ్యాలెన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 31 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాల్లో రూ. 10,181 కోట్ల డిపాజిట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నట్లు ఈపీఎఫ్ఓ గుర్తించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.